జన రాజకీయం కోసం... ₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9
పక్షపత్రిక
సంచిక - 02
జనవరి 16-31, 2018



# గ్లామర్‌ని వ్యవస్థ మార్పు కోసం వినియోగిస్తే మేలు!



## నిజమైన స్వయంపాలనను 102 ఏళ్ల క్రితం అర్థం చేసుకుని పోరాడిన గొప్ప భారతీయుడు

"రైతు కోసం యూత్ పార్లమెంట్"

YOUTH PARLIAMENT



# రైతుల ఆదాయాన్ని పెంచటమే ఆత్మహత్యలకు పరిష్కారం

రైతుల ఆదాయం పెంచటం ద్వారానే దేశవ్యాప్తంగా ఆత్మహత్యల నివారణ సాధ్యమవుతుందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ స్పష్టం చేశారు. ఆదాయాన్ని పెంచే పరిష్కారాన్ని వదిలేసి రుణమాఫీని జాతీయ విధానమన్నట్లు అనుకరిస్తే రైతులు మరింత సంక్షోభంలోకి కూరుకుపోతారన్నారు. రుణమాఫీ జరిగిన రాష్ట్రాల్లో రైతుల దుస్థితిని చూస్తే ఈ వాస్తవం స్పష్టంగా అర్థమవుతుందన్నారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ), యూత్ పార్లమెంట్ ఆధ్వర్యంలో రైతులు : వ్యవసాయ, గ్రామీణ సంక్షోభం పై హైదరాబాద్ ఉస్మానియా యూనివర్శిటీ ఆర్ట్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

యూత్ పార్లమెంటరీ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఎంపీలుగా, మంత్రులుగా, ప్రతిపక్ష నాయకులుగా పలువురు విద్యార్థులు, న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆసక్తికర చర్చ చేశారు. వైబీఐ కన్వీనర్ శివరామకృష్ణ మాట్లాడుతూ, 2022 నాటికి రైతు ఆత్మహత్యలు లేని భారతదేశ నిర్మాణానికి తాము వ్యవస్థీకృతంగా పనిచేస్తున్నామన్నారు. ప్రాధాన్యత లేని అంశాలు చుట్టూ వాగ్వాదం, చర్చ లేకుండా రచ్చతో నేతలు ఢిల్లీలో పార్లమెంటు పరువు తీస్తున్నారని, వ్యవసాయం గురించిన చర్చ చేయటానికి కూడా వారికి తీరికలేదని పలువురు వక్తలు అన్నారు. యూత్ పార్లమెంట్ తీర్మానాలను తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు, కేంద్రానికి పంపుతామని వైబీఐ కో ఆర్డినేటర్ చిట్టిమల్ల మహేశ్ తెలిపారు. వ్యవసాయంలో మెరుగైన ఆదాయం వచ్చే విధానాలను అనుసరించటంతోపాటు మంచి విద్య ఆరోగ్యాలను రైతు కుటుంబాలకు అందించే ఏర్పాటు చేస్తే చాలావరకు సంక్షోభాన్ని అరికట్టవచ్చని జేపీ ఈ సందర్భంగా సూచించారు. సత్య, సోనియా, జయంతి చంద్, సతీష్, కరుణాకర్‌రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.



# తిరుమలలో హోటల్ యజమానుల దౌర్జన్యాలపై చర్యలు తీసుకోవాలి

తిరుమలలో అధిక ధరలపై ప్రశ్నిస్తున్న భక్తులపై కొందరు హోటల్ యజమానులు దౌర్జన్యాలకు దిగుతున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి కల్లూరి బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. తిరుపతికి చెందిన భక్తపాలే భరద్వాజ హోటల్ బిల్లుల ఆధారంగా హైకోర్టులో కేసు వేయగా బెదిరిస్తున్నారన్నారు. ఆయనకు లోక్‌సత్తా అండగా నిలుస్తోందన్నారు. టీటీడీ యాజమాన్యం, పోలీసులు రక్షణ కల్పించాలని ఈవో అనిల్ సింఘాల్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. యాత్రికులకు తిరుమలలో సమస్యలు ఎదురైతే 9885172939కు కాల్ చేయాలని కోరారు. లోక్‌సత్తా పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు వెల్లంకొండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

జనవరి 16-31, 2018 సంపుటి - ౨ సంచిక - 02

## కార్టూన్ కార్నర్




ఏం పర్లేదు మేం ముందుకే వెళ్తున్నాం.

## లోపలి పేజీల్లో...

గ్లామర్‌ని వ్యవస్థ మార్పు కోసం ................ 5
నిజమైన స్వయంపాలనను 102 ఏళ్ల క్రితం..... 8
చైనాలో ఉంటే మార్కాపురం వంటివి ............ 13
స్థానిక అధికారాలు లేకపోతే దోమల్ని కూడా... 15
వెయ్యికి ఒక్క రూపాయి ఇస్తున్నారు................ 16
ధరలు మన ఇష్టమొచ్చినట్టు ఉండాలనటానికి... 17
ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన జేపీ చర్చాగోష్టి.. 18
చిన్నేరు చిన్నబోతోంది... సేద్యం ఎండిపోతుంది! 20
స్థానికంగా నిధులు, పౌరసేవల చట్టం ఉంటే... 21
ఏడాదికి రూ.30,000 ఖర్చు.................... 22
ఆలస్యంగా మేలుకోవటమే పోలవరానికి....... 23
ప్రభుత్వ జోక్యం ఉండి ఉంటే ఈ పాటికే ......... 24
ఉపాధిలో సరికొత్త సవాళ్లు........................ 26
30 శాతం గ్రామాల్లో సాగుభూమి ................ 28
జేపీ కారణంగా దేశ ఖజానాకు .................... 29
స్థానిక దిశానిర్దేశానికి లిటిల్ జేపీలను............ 30
(మీడియాలో) ‘కీ’ కామెంట్లు...................... 32
ఎందరినో కదిలిస్తున్నది ఆరాటం.................. 34

## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి.కుటుంబరావు

## రచనలు పంపండి

‘లోక్‌సత్తా టైమ్స్’ పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి ‘లోక్‌సత్తా టైమ్స్’ పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును “లోక్‌సత్తా టైమ్స్” ఎకౌంట్ నం: *62007167836*, **SBI** పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.


**బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి**

# 2జీ - చట్టబద్ధపాలన సంస్కృతి!



సురాజ్య యాత్ర లక్ష్యాలు ప్రతి రాష్ట్రానికీ వర్తించేవి, జాతీయ స్థాయిలో ప్రభుత్వం కూడా బాధ్యత తీసుకోవాల్సినవి. ప్రభుత్వాలు సులభంగా, ఉన్న బడ్జెట్‌లోనే, పార్టీలకతీతంగా, ఏమాత్రం ఆలస్యం లేకుండానే అమలుచేయగలిగేవి, జన జీవితాల్లో మాత్రం గణనీయమైన మేలి మార్పును తేగలిగేవి. అమలు చేసే పార్టీలకు కాలక్రమంలో ఓట్లు కూడా తెచ్చేవి.. ఇలాంటి ఆరు అంశాలను సురాజ్య లక్ష్యాలుగా ఎంపిక చేశాం. మరోపక్క పెత్తందారీ ధోరణులు లేకుండా, ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో కొత్తతరం నాయకత్వాన్ని శిక్షణతో సిద్ధం చేసే ఏర్పాట్లను చేశాం. ఈ మొత్తం కోసం ఎంతో ముందుచూపుతో రెండుమూడేళ్లుగా కసరత్తు జరుగుతున్నా, చివరకు లక్ష్యాల్ని నిర్ణయించేటప్పుడు కొందరు యువ సహచరుల నుంచి భిన్నాభిప్రాయాలు వచ్చాయి. విద్య, ఆరోగ్యం, వ్యవసాయంలో ఆదాయం ఓకేగానీ.. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు లేని సేవలకు పౌర సేవల చట్టం, స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు, చట్టబద్ధపాలన అంశాలను కూడా చేరిస్తే స్పందన తగ్గే అవకాశముందని వారి వాదన. ఆ లక్ష్యాల గురించి ప్రజలకు పెద్ద అవగాహన, ఆసక్తి ఉండదు, మీడియా పట్టించుకోదు.. వగైరా సందేహాల్ని వ్యక్తం చేశారు. వాటి బదులు మసాలా, వేడి ఉండే వేరే అంశాలను చేరిస్తే బావుంటుందన్నారు. కానీ హేతుబద్ధంగా వాస్తవాల్ని వివరిస్తూ.. వారి వాదనల్ని తోసిపుచ్చాను. "ప్రజల పన్నుల డబ్బుతో జీతాలు తీసుకునే ప్రభుత్వ కార్యాలయాల్లో వారికి సేవలందించటం, ఎక్కడిపనులు అక్కడే జరిగేలా జనం ఉండే గ్రామాలు, పట్టణాలకు నిధులివ్వటం, మహిళల రక్షణకు, పేద, ధనిక తేడా లేకుండా చట్టాన్ని అందరికీ సమానంగా వర్తింపచేసేందుకు చట్టబద్ధపాలనను అమలు చేయటం" వంటివి ప్రజాస్వామ్యంలో కనీస చర్యలు. ఈ పునాది లేకుంటే దీర్ఘకాలంలో భారతదేశం కూడా మనలేదు. ఈ అంశాలను ప్రజల్లో ప్రచారం చేయవలసిన వారు అధికార క్రీడలో, వ్యక్తిగత ఎజెండాల్లో మునిగితేలుతున్నా.. మనం మాత్రం తీసుకెళ్లాల్సిందే, స్పందన ఎలా ఉన్నా ఈ ఆరు లక్ష్యాలతోనే సురాజ్య యాత్ర కార్యక్రమాన్ని చేద్దాం అని వారిని ఒప్పించాను. 'వాస్తవాలు చెబుతుంటే ప్రజలు, ముఖ్యంగా యువత కాస్త ఆలస్యంగానైనా స్పందిస్తారు'.. అని ఆంధ్రప్రదేశ్‌లో సురాజ్య యాత్ర పూర్తయ్యేసరికి లోక్‌సత్తా, యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ) సహచరుల్లో కూడా నమ్మకం కలిగింది. ఇటీవల 2జీ స్పెక్ట్రం కుంభకోణం కేసులో సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు వచ్చాక 'చట్టబద్ధపాలన' చుట్టూ ఉద్యమం ఉధృతం చేద్దామని వారే గొంతు పెంచారు. 2జీ కేసులో భారతదేశానికి జరిగిన ఒకే ఒక్క మేలు లోక్‌సత్తా పిటిషన్ ద్వారా జరిగిందని ప్రజలకు విస్పష్టంగా తెలియచేశాం. అసలిది కుంభకోణమేనా? అంత నేరమైతే ప్రత్యర్థి కాంగ్రెస్‌కు ఊరటనిచ్చేలా కేంద్రంలోని బీజేపీ/ఎన్డీయే ప్రభుత్వ కనుసన్నల్లోని సీబీఐ ఎందుకు వ్యవహరించింది? వంటి ప్రశ్నలను చాలామంది అడుగుతున్నారు. పార్టీ రాజకీయాల్లో చిక్కుకోకుండా కాస్త హేతుబద్ధ ఇంగితంతో ఆలోచిస్తే చాలు.. 2జీ కేసులో వాస్తవాలు తేటతెల్లమవుతాయి. ఈ కేసులో ఉన్న కంపెనీలు, వాటి లాలూచీ ప్రయోజనాలు చిన్నవేమీ కావు. అందుకే దేశవ్యాప్తంగా సుప్రసిద్ధులైన జేఎం లింగ్డో, గోపాలస్వామి, టీఎస్ కృష్ణమూర్తి, అడ్మిరల్ తహిల్యానీ, పి.శంకర్, జూలియో రెబీరో వంటి పౌరులను ఒక చోట చేర్చి ప్రశాంత్ భూషణ్ న్యాయవాదిగా 2010లో లోక్‌సత్తా పిటిషన్‌ను దాఖలు చేసింది. అన్ని రాజకీయ పార్టీలూ సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ) వేయాలి, నేరస్తులను శిక్షించాలి అని వాదిస్తుంటే.. ముందు దేశ ప్రజల సొమ్ముకనష్టపోకుండా, ఇలా అవినీతికి పాల్పడితే మొత్తం కక్కిస్తారన్న భయం కలిగించేలా లైసెన్సుల్ని రద్దు చేయాలని, ఇకముందు సహజ వనరుల కేటాయింపులను వేలం పాటల ద్వారానే నిర్వహించాలని లోక్‌సత్తా సుప్రీంకోర్టులో వాదించింది. ఈ వాదనను అంగీకరించి 122 లైసెన్సులను సుప్రీంకోర్టు రద్దు చేసింది, ఇక ముందు వేలం ద్వారానే ప్రకృతి వనరుల కేటాయింపులు జరగాలని స్పష్టంచేసింది. ఈ రకంగానే తర్వాత స్పెక్ట్రం, బొగ్గు కేటాయింపులు జరిగి ప్రభుత్వానికి అదనపు ఆదాయం వచ్చింది. కనిమోళి, రాజా సహా 2జీ కేసులో నిందితులను శిక్షించటానికి మనదేశంలో వ్యవస్థ ఎంత గొప్పగా ఉందో ఆరోజున తెలుసు కాబట్టి, వారిని శిక్షించటంతోనే మన సమస్యలు పరిష్కారం కావు కాబట్టే.. దేశ సహజ వనరుల పరిరక్షణకు వ్యవస్థీకృత మార్పులను సాధించటం మీద లోక్‌సత్తా దృష్టి పెట్టింది. కానీ 2014లో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం.. చట్టబద్ధపాలనను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకొని ఉంటే ఈవేళ 2జీ కేసులో దోషులు తప్పించుకునే అవకాశం కూడా వచ్చేది కాదు (ఆహారపు అలవాట్లు, మహారాష్ట్ర భీమా-కోరెగావ్ వంటివి హింసాత్మకం కూడా అయ్యేవి కావు). 2జీ కుంభకోణం గురించి ఎవరెన్ని వాదనలు వినిపించినా, అక్కడ నేరం జరిగిందనేది ఇంగితజ్ఞానానికి అర్థమవుతున్న విషయం. లైసెన్సులు పొందిన కంపెనీల కార్యకలాపాలు, వాటికి ఆ లైసెన్సులు వచ్చిన తీరు, ఆ తర్వాత వేలం ద్వారా వచ్చిన అనేకరెట్లు అధికాదాయం.. ఇలా పలు అంశాలు నేరాన్ని పట్టిస్తున్నాయి. ప్రజలకు తక్కువ ధరకు మొబైల్ ఫోన్ సేవలను అందుబాటులోకి తేవటం అనే వాదనను ఆ తర్వాత తెర మీదికి తెచ్చారు. అది అబద్ధమని ఆ తర్వాతి పరిణామాలు రుజువు చేశాయి. ఒకవేళ ధరల్ని తగ్గించేందుకు రాయితీ ఇవ్వాలనుకుంటే.. తగిన ప్రజాప్రయోజనాల్ని చూపిస్తూ ప్రభుత్వం వేలం తర్వాత ఉత్తర్వును జారీ చేయవచ్చు కూడా. కానీ చెవులు తప్ప కళ్లులేని కోర్టులో నేరం రుజువు కావాలంటే సాక్ష్యాలను సమగ్రంగా సమర్పించాలి. చట్టబద్ధపాలన వైఫల్యాన్ని సరిచేసే చర్యల మీద మోదీ ప్రభుత్వం కనీసంగా కూడా దృష్టి సారించకపోవటంతో దేశంలోని వ్యవస్థలన్నీ ఈ కేసులో అభాసుపాలయ్యాయి. దీంతో స్వతంత్ర భారతదేశంలో ఒక పెద్ద కేసు వీగిపోయి ప్రజలకు న్యాయవ్యవస్థ మీద కూడా అపనమ్మకం ఏర్పడే పరిస్థితి ఏర్పడింది. తమిళనాడు ఆర్కేనగర్ ఉప ఎన్నిక సమయంలో ప్రజలు బీజేపీ-డీఎంకే-కాంగ్రెస్ లోపాయికారీ లాలూచీ అంటూ చేసిన వ్యాఖ్యలను ప్రధాని, ఆ పార్టీ నేతలు మాత్రమే కాదు, రాజకీయ వ్యవస్థ, పౌరసమాజం కూడా తీవ్రంగా పట్టించుకోవాలి. ప్రజలు ఓటుకు నోటు తీసుకోవచ్చు, నోటు ఇచ్చిన పార్టీల్లోనే ఓటు వేస్తాం అంటుండవచ్చు.. కానీ ఎన్నికైన ప్రజాప్రతినిధులు నిజాయతీగా పనిచేసి వ్యవస్థను బాగుచేయాలని వారు కోరుకుంటుంటారు. అందుకే నోట్ల రద్దు సమయంలో ఎంత అసమర్థంగా అమలుచేసినా మోదీకి అండగా నిలిచారు. కానీ నోట్ల రద్దు తర్వాత అవినీతికి వ్యతిరేకంగా పెద్ద సంస్కరణల్ని చేపట్టకపోవటం, 2జీ కేసులో సీబీఐ ప్రత్యేక కోర్టులో తీర్పు వంటివి వారిని మరింత నిరాశలోకి నెడుతున్నాయి. ఊకదంపుడు ఉపన్యాసాలు ఆపి, ఇప్పటికైనా చట్టబద్ధపాలనకసంస్కృతి కోసం న్యాయ, పోలీసు సంస్కరణల్ని ప్రధాని అమలు చేయాలి, ముఖ్యమంత్రులకు దిశానిర్దేశం చేయాలి. సురాజ్య లక్ష్యాల అమలును ఎల్లకాలం దాటవేయలేరు.

# గ్లామర్‌ని వ్యవస్థ మార్పుకోసం వినియోగిస్తే మేలు!



అయిదు, పది కోట్లు సంపాదిస్తే ఎమ్మెల్యే అయిపోవాలి. సినిమా హీరోగానో, స్పోర్ట్ స్టార్‌గానో గుర్తింపును పొంది వంద కోట్లో, రెండొందలు కోట్లో సంపాదిస్తే రాజకీయాల్లోకి వచ్చి ఏకంగా ముఖ్యమంత్రి అయిపోవాలి లేదా ఉన్నత పదవిని పొందాలి.. ఈ సెల్ఫీ రాజకీయ ధోరణి ఇటీవల పెరిగిపోతోంది. పాలకుల పుణ్యమా అని అవిద్య, పేదరికం పెద్దఎత్తున కొనసాగుతుండటం వల్ల మన దేశంలో.. జీవిత కష్టాల నుంచి తప్పించుకోవటానికి విచక్షణా రహితంగా తెగ సినిమాలు చూడటం, మద్యం తాగటం పెద్ద ఎస్కేప్‌లలా ఉపయోగపడుతుంటాయి. సినిమాలోనో, ఆటలోనో వీరత్వం ప్రదర్శించే సెలబ్రిటీలు రాజకీయాల్లో నాయకత్వం అందిస్తామంటూ ముందుకొచ్చి కాస్త భరోసా ఇవ్వగానే సామాన్యుల్లో ఆశలు రేకెత్తుతుంటాయి.

వ్యవస్థీకృత వైఫల్యం వల్ల మనదేశంలో కొనసాగుతున్న దుస్థితిని ఆసరాగా చేసుకుని ముఖ్యంగా సినీ హీరోలు రాజకీయాల్లోకి రావటం చాలా ఏళ్లుగా ఉన్నా.. ఇటీవల జోరందుకుంది. తమిళనాడులో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఒకరకంగా ఇది పరాకాష్టకు చేరుకుంది. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నట్టు అగ్ర సినీహీరోలు కమల్‌హాసన్, రజనీకాంత్ ప్రకటించారు. అవినీతి అంతం, నిజాయతీ రాజకీయాలు గురించి మాట్లాడుతున్నా, పదవులు అక్కర్లేదు అంటున్నా.. ఎన్నికల్లో పోటీ చేయటం, కేవలం నెగ్గటం మీదే తమ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించుకుంటామన్న సంకేతాలు వారి మాటల్లో, కదలికల్లో స్పష్టంగానే కనిపిస్తున్నాయి.

రాజకీయాల్లోకి వచ్చే హక్కు ఎవరికైనా ఉంది. కానీ అపార జనాదరణ, కోట్ల డబ్బు లేదా ఆ డబ్బును వివిధ కారణాల రీత్యా సమకూర్చేవారు ఉన్నంత మాత్రాన రాజకీయాల్లోకి రావటం వల్ల ప్రయోజనం ఉండదు. రజనీకాంత్, కమల్‌హాసన్ సహా ఇప్పుడు ప్రజాదరణ ఉన్న పలువురు హీరోలు చాలా కష్టపడి సినిమాల్లో ఎదిగినవారే. నూటికి ఒకరికో, ఇద్దరికో వచ్చే స్థాయిని వారు నిర్మించుకున్నారు. వారి సామర్థ్యాన్ని తక్కువ చేసి చూడటం కాదిది. కానీ రాజకీయాల ద్వారా ప్రజలకు ఎలాంటి మేలు చేయదలచుకుంటున్నారు, ఆ మేలును సాధించేందుకు ఎలాంటి విధానాలను అనుసరించదలచుకున్నారు హేతుబద్ధంగా వివరించలేనప్పుడు, ఆ దిశ లేనప్పుడు వారి రాక వల్ల ఒరిగేదేమీ ఉండదు.

వ్యవస్థలో మార్పు కోసం రాజకీయాలు అత్యున్నత మార్గమైతే, ఎన్నికల్లో పోటీ చేసి గెలవటం ఆ మార్పుని సాధించటానికి అత్యున్నత అవకాశం అనటంలో సందేహం లేదు. కానీ రాజకీయాలంటే ఎన్నికలు మాత్రమే కాదు, అలాగే ఎన్నికల్లో ప్రభావం చూపటానికి గెలుపు మాత్రమే మార్గం కాదు. ఎన్నికలను ఓ మార్గంగా కాకుండా 'ఎలాగోలా' అధికారమే లక్ష్యంగా చూస్తే అది ఇప్పుడున్న దోపిడీ రాజకీయానికి కొనసాగింపే అవుతుంది. ఆటగాళ్లు మారతారు తప్ప ఆటనియమాలు మారవు. దీంతో జనం జీవితాలూ మారవు. మనకున్న (ఎఫ్‌పీటీపీ) ఎన్నికల వ్యవస్థలో ఓ 10–15శాతం ఓట్లు నిలకడగా వచ్చినా మిగతా పార్టీలను దారికి తేవచ్చు.. కానీ ఈ రకమైన ఆలోచన, స్పష్టత– రాజకీయాల పట్ల వ్యవస్థీకృత నిజాయతీతో కూడిన స్పష్టత ఉంటేనే సాధ్యమవుతుంది. రజనీకాంత్, కమల్‌హాసన్ తమ రాజకీయ కార్యాచరణను ఇంకా స్పష్టంగా వెలువరించనందువల్ల వారి గురించి తేల్చిచెప్పలేంగానీ.. ఇప్పటివరకైతే వారి తీరు జనహితానికి తగిన స్థాయిలో లేదు.

రాజకీయాల్లోకి వస్తున్న హీరోలు తమ రాజకీయ వైఖరిని వివరించటమే ముఖ్యం అని కొంతమంది అంటున్నారు. కానీ దాని వల్ల కూడా జనానికి ప్రయోజనం పెద్దగా ఉండదు. కాంగ్రెస్, బీజేపీ, వామపక్షాలు, అస్తిత్వ రాజకీయ పార్టీలు సహా ఈ దేశంలో ఉన్న పలు పక్షాలకు బ్రాండెడ్ రాజకీయ వైఖరి ఉంది. కానీ జనం జీవితాల్లో మార్పునకు అదేమీ పెద్ద దోహదం చేయటం లేదు. ఆ పార్టీలన్నీ కాస్త అటూఇటుగా ఒకే తరహా రాజకీయానికి వేర్వేరు లేబుళ్లుగా మారాయి.

మేం గత 37 ఏళ్లుగా సేవా కార్యక్రమాలను చేస్తూనే ఉన్నాం, ఇప్పుడిక ఎన్నికల్లోకి రావాల్సిన సమయం వచ్చింది అని పైన పేర్కొన్న తమిళ హీరోలిద్దరిలో ఒకరు ఇటీవల జాతీయ మీడియాలో మాట్లాడుతూ చెప్పుకొచ్చారు. స్వయంకృషితో ప్రపంచంలోనే నెంబర్‌వన్ సంపన్నునిగా తన తరంలోనే నిలిచిచూపిన మైక్రోసాఫ్ట్ బిల్‌గేట్స్ తన సంపదలో సగాన్ని ప్రజలకు తిరిగి ఇచ్చేస్తున్నారు. వారెన్ బఫెట్ తన అపార సంపదలో కేవలం పదివేలో వంతును అట్టిపెట్టుకుని తన పేరు కూడా చూసుకోకుండా గేట్స్ ఫౌండేషన్‌కు తన మిగిలిన సంపదనంతా

విరాళంగా ఇచ్చేశారు. వారితో పోల్చుకుంటే.. సేవ చేశామంటున్న మన సినీహీరోలు చేసిన 'సేవ' ఎంత? ఇంతచేసినా.. గేట్స్, బఫెట్‌లు తమ దాతృత్వాలను ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశానికి అర్హతగా భావించలేదు. అయ్యా, జనం కోసం ఇప్పటిదాకా ఏమీ చేయకపోయినా, ఇక ముందు ఏదో చేయాలనుకుని రాజకీయాల్లోకి రావటం కూడా తప్పేమీ కాదు. కానీ నిజాయతీగా ఆ అంశాల్ని వెల్లడిస్తూ, గతాన్ని మరపించేలా ప్రజలకు చేయదలచుకున్న వాస్తవ మేలును వివరించే ధైర్యాన్ని ప్రదర్శించాలి. ఆసక్తి, అవగాహన, స్పష్టత, దార్శనికత, ప్రజల పట్ల చెదరని ప్రేమ నిండుగా ఉండాలి.

అగ్రశ్రేణి సినీహీరోలకు వేల, లక్షలమంది స్వచ్ఛందంగా పనిచేసే అభిమానులుంటారు. మిగతా సినీగోయర్లలా కాకుండా.. ఆ వీరాభిమానుల్లో పలువురికి సొంత ఆలోచనాశక్తి పరిమితంగానే ఉండే అవకాశముంది. హీరో ఒక్కడే వందలమందిని చితక్కొట్టటం, బక్క హీరో కూడా ఉక్కుమనిషిలా ఫోజులిస్తూ డైలాగులు చెప్పటం, పది అంతస్తుల భవనం మీద నుంచి దూకినా కాళ్లు విరగకుండా పరిగెత్తటం వంటివి నమ్ముతూ ఎంజాయ్ చూస్తూ ఆరాధించగలవారు తమ అభిమాన హీరో ఆలోచనల స్థాయిని దాటి వ్యవహరించలేక పోవచ్చు (సచిన్ టెండూల్కర్ ఇలాగే 2017 ఏడాది గొప్ప పార్లమెంటేరియన్ కాగలిగారు మరి). అందువల్ల సినీ నేపథ్యం నుంచి వచ్చే ప్రముఖులు.. విధానాల పట్ల మరింత స్పష్టతతో వ్యహరించటం అవసరం. ఎంతో ప్రజాస్వామిక పరిణతి ఉన్నట్టుగా భావించే అమెరికా సమాజంలో కూడా ఇంకా ఎంతో డొల్లతనం ఉందని సోషల్ మీడియా వచ్చాక బైటపడింది.

రాజకీయ శూన్యత ఉన్నప్పుడు ఎన్టీరామారావు తరహాలో సినీహీరోలు ఎన్నికల్లో అద్భుత విజయాలను సాధించవచ్చు. అధికారంలోకి రావొచ్చు. కానీ అది ప్రజలకు మేలు చేయాలని రూలేం లేదు. ఎన్టీఆర్‌కు రాజకీయ పరిణతి లేకున్నా.. ప్రజలకు వేగంగా మేలు చేయాలన్న తపన, పట్టుదల, డబ్బు తీసుకోకుండా టికెట్లిచ్చే నిజాయతీ, పదవులను తోసిరాజనగల మొండితనం, క్రమశిక్షణతో కష్టపడే తత్వం మెండుగా ఉన్నాయి. సమాజం నుంచి పలువురు విజ్ఞులు ఆయన శ్రేయోభిలాషులుగా పనిచేసిన సమయమది. దాంతో తెలుగువారికి ఎన్టీఆర్ చెప్పుకోదగిన మేలు చేయగలిగారు. భారతదేశంలో ఫెడరలిజాన్ని బలోపేతం చేయటంలో కీలకపాత్ర పోషించగలిగారు. కానీ ఎన్టీఆర్‌కు రాజకీయ అవగాహన మెరుగ్గా, వ్యవస్థీకృత మార్పు ప్రాధాన్యత తెలిసి ఉంటే.. ఇంకా చాలా చేయగలిగి ఉండేవారనటంలో సందేహం లేదు. ఆయన అవినీతి లేకుండా పని చేసినా.. ఆయన చుట్టూ చాలామంది అవినీతి గాడిదల్ని పెంచి పోషించారు. ఆ వైఫల్యాల కారణంగానే ఈవేళ తెలుగు రాష్ట్రాల్లో ఇంకా విద్య, వైద్యం, చట్టబద్ధపాలన వంటి కనీస స్థాయి సుపరిపాలన వేళ్లూనుకోలేదు. ఆయన స్థాపించిన తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో డబ్బు పంచుతూ, తాత్కాలిక తాయిలాల్ని ఎరవేస్తూ, ఆ తర్వాత ఫిరాయింపుల్ని ప్రోత్సహిస్తూ, ప్రజల స్వయంపాలనాశక్తిని కుంగదీస్తూ ఫక్తు ఎన్నికల రాజకీయ పార్టీలా తయారైంది. కాంగ్రెస్‌కు, తెదేపాకు మధ్య ఆనాడు ఎన్టీఆర్ చూసిన తేడా ఇప్పుడేమీ లేదు. దొందూ దొందే.

జయలలిత మరణంతో తమిళనాడు నవ్వులపాలు కావటం వల్లే తాను రాజకీయ ప్రవేశం చేస్తున్నట్టు రజనీకాంత్ పరోక్షంగా చెప్పుకొచ్చారు. తమిళ రాష్ట్రం నవ్వులపాలు కావటానికి బీజాలు జయలలిత, ఆమె పార్టీ అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీ రామచంద్రన్, డీఎంకే కురువృద్ధుడు కరుణానిధి వ్యక్తి ఆధారిత, అసంబద్ధ జనాకర్షక, అవినీతి రాజకీయాల్లోనే ఉన్నాయని మాత్రం గుర్తెరిగినట్టు ఎక్కడా కనిపించటం లేదు. మన దేశంలో చట్టబద్ధపాలన సక్రమంగా ఉండి ఉంటే, న్యాయవ్యవస్థ సక్రమంగా పనిచేసి ఉంటే, ప్రచారమే రాజకీయం – ప్రచారమే ఎన్నికలు అనే ప్రస్తుత దశలో మీడియా తన బాధ్యతల్ని సరిగ్గా నిర్వర్తించి ఉంటే .. జయలలిత, కరుణానిధిల అప్రజాస్వామికత, అవినీతి, పాలనా వైఫల్యాలు చాలా ప్రస్ఫుటంగా, అతి సామాన్యులకు కూడా అర్థమయ్యేలా రుజువై ఉండేవి. జయలలిత మరణం తర్వాతి రాజకీయ శూన్యతకు కొత్త నిర్వచనాలు వచ్చేవి.

మరోవైపు, వ్యక్తిగత నిజాయతీ, బలమైన నాయకత్వం, స్థిరమైన పాలనలో నరేంద్రమోదీ కన్నా గొప్పగా ఎవరూ చేయలేరు. ఈ లక్షణాలకు సంబంధించి అందరికీ అర్థమయ్యే తాజా ఉదాహరణ ఆయన. కానీ మోదీ పాలన పలు మౌలికరంగాల్లో పాస్ మార్కుల స్థాయిలో కూడా లేదన్నది వాస్తవం. సరైన ప్రత్యామ్నాయం లేకపోవటం, మీడియాను గుప్పెట్లో పెట్టుకోవటం సహా సాంప్రదాయ రాజకీయ ఎత్తుగడలను నిస్సిగ్గుగా వినియోగిస్తుండటం ద్వారా మోదీ ప్రాభవాన్ని నిలుపుకుంటున్నారు. కాస్త అటూ ఇటుగా ఇదే తరహాలో తమిళ హీరోలు కూడా తమ రాష్ట్రంలో రాజకీయ శూన్యతను ఆసరాగా చేసుకుని వ్యక్తిగత నిజాయతీ, బలమైన నాయకత్వం, జనాకర్షక పాలన అంటూ రాజకీయాలు చేస్తే.. ఓట్లు, సీట్లు, అధికారం కూడా రావొచ్చేమోగానీ ప్రజలు మళ్లీ నిరాశకు గురవుతారు. సాంప్రదాయ రాజకీయం మూసలోనే ఎత్తుగడలు వేయటం కూడా చేతకాకపోతే.. విఫలమైనా ఆశ్చర్యపోనక్కర్లేదు. సాంప్రదాయ రాజకీయ ఆటుపోట్లను తట్టుకునే శక్తి సినీరంగం నుంచి వచ్చిన వారిలో అరుదుగా మాత్రమే కనిపిస్తుంటుంది. విజయ్‌కాంత్ కళ్ల ముందు కనిపిస్తున్న ఉదాహరణ. ఏదోరకరకంగా పెద్ద విజయమే సాధించి సినీహీరోలు అధికారంలోకి వచ్చి పాతరాజకీయ ఎత్తులుజిత్తులను ఔపోశన పట్టి పదవిలో పాతుకుపోయినా.. వారేమీ రాజకీయరంగంలో హీరోలు అయిపోరు. నిజమైన మార్పును సాధించకుండా అవినీతి డబ్బుతో, తాయిలాలతో, విభజనలతో మభ్యపెట్టి ఎన్నికల్లో నెగ్గి, నేతలను కొని పదవులను అలంకరించేవారి జాబితాలో చేరిపోతారు. వ్యవస్థలు బలపడి ప్రజల్లో పరిణతి, ధైర్యం పెరిగే వరకూ.. వంచనను కొనసాగించే వెసులుబాటు మాత్రం ఉంటుంది. సరైన రాజకీయమూ చేయక, ఉన్న రాజకీయంలోనూ ఇమడలేక, అరుదుగా ఇమిడినా చరిత్ర హీనులుగా హీరోల పరిస్థితి తయారవకుండా ఉండాలంటే, ప్రజలకు నిజంగా మేలు జరగాలంటే.. ఎలాగోలా అధికారంలోకి రావాలనే యావ లేకుండా, మంచి రాజకీయానికి స్పష్టమైన, ఆచరణాత్మక ప్రణాళికతో రాజకీయాల్లోకి రావటమే మార్గం. అపార ప్రజాదరణ

ఉన్న హీరోలు ఓట్ల శాతంలో తెచ్చే తేడాలను ప్రాచుర్య పార్టీలు నిర్లక్ష్యం చేయలేవు కాబట్టి.. వారి ఎజెండాను కూడా పరిగణలోకి తీసుకోకతప్పదు. కానీ ముందు మన బంగారం మంచిదై ఉండాలి.

తెలుగు రాష్ట్రాలు కేంద్రంగా భారతదేశంలో వ్యవస్థీకృత మార్పు కోసం కృషి చేస్తున్న లోక్‌సత్తా చెబుతున్న అంశాలు సాకారం కావటానికి పలు అభివృద్ధి చెందిన దేశాల్లో 300-400 ఏళ్లు పట్టింది. అందులోనూ ఇండియాలో ఉన్నంత సంక్లిష్ట భిన్నత్వం ఆ దేశాల్లో లేదు. మనదేశం దాదాపు ఐరోపా ఖండంతో సమానం. ఆ ఖండంలోని దేశాలన్నీ కలిస్తే ఓ భారత్ అవుతుంది. కానీ అన్ని అవరోధాలున్నా.. ఈవేళ యువశక్తి, సాంకేతికత అనే అస్త్రాలు మనకున్నాయి. వీటితో చాలామార్పుల్ని మనదేశం వేగంగా, ఈతరంలోనే సాధించుకోవచ్చు. వీటన్నిటినీ బేరీజు వేసే లోక్‌సత్తా ఆచరణాత్మకంగా సంస్కరణల్ని ప్రతిపాదించి వాటికోసం పనిచేస్తోంది. పాశ్చాత్యదేశాల్లోలా వేచి చూసే సమయం ప్రపంచీకరణలో మనకు లేదు అని గుర్తించి వ్యవహరించే విజ్ఞతను, రాజకీయ సంకల్పాన్ని ప్రదర్శించకుండా.. మూడు, నాలుగు శతాబ్దాలు మనం వెనకబడే ఉందాం, దానంతటదే జరిగే అభివృద్ధినే, ఏదోకరమైన మార్పునే గొప్పగా చెప్పుకుంటూ ఎప్పటికెయ్యది అన్నట్టు తాత్కాలిక తాయిలాలతో ఎన్నికల్లో గెలుస్తుంటాం అంటే- ఆ నష్టం ఊహించలేనంత భయంకరంగా ఉంటుంది. కోట్లమంది ప్రజలు ఎదిగే అవకాశాలను కోల్పోతూ నివారించదగ్గ బాధలతో కన్నీళ్లు కారుస్తుంటారు.

నిజమైన నాయకుడు ప్రజలకు నాలుగడుగులు ముందుండాలా, వందడుగులు ముందుండాలా? అని ఆలోచించడు. ప్రజలను ఆచరణాత్మకంగా ఎంత ముందుకు తీసుకెళ్లవచ్చు అని ఆలోచించి ఆ స్థాయిలో ప్రయత్నం చేస్తాడు. అలాంటి నాయకత్వాన్ని అందించకుండా సినీహీరోలు రాజకీయాల్లోకి రావటం వల్ల ప్రజలు నష్టపోతారు, చివరికి ఆ హీరోలకు కూడా నష్టం జరుగుతుంది. రజనీకాంత్, కమల్‌హాసన్, ఉపేంద్ర, సురేష్ గోపీ, పవన్ కళ్యాణ్.. తదితరులందరికీ వర్తిస్తుందిది.

జనసేన వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్‌తో మీరు కలిసి పనిచేయొచ్చుకదా అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌ను తరచూ అడుగుతున్నారు. లోక్‌సత్తా సోషల్ మీడియా సైట్లలో ఈ విషయాన్ని నిరంతరం చర్చిస్తూ పోస్టులు పెడుతున్నవారున్నారు. పవన్ కళ్యాణ్ రాజకీయ విధానాల పట్ల స్పష్టత లేకపోయినా, ఆయన నిజాయతీ, మార్పు కోసం ఏదో చేయాలనే తపన, కులాలకతీతంగా వ్యవహరించాలనే ధోరణి పట్ల లోక్‌సత్తా ఎప్పుడో సానుకూలంగా స్పందించింది. కలిసి పనిచేయటానికి అభ్యంతరం లేదని స్పష్టంచేసింది. 2014లో మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానానికి జేపీ పోటీచేస్తే మద్దతిస్తానని చెప్పిన పవన్.. ఆ తర్వాత రాజకీయ పొత్తుల పేరుతో వెనక్కు తగ్గినా లోక్‌సత్తా ఏమీ ప్రతికూలంగా స్పందించలేదు. ఆ ఎన్నికల్లో జేపీ ఓటమి వల్ల తెలుగు ప్రజలు, భారతదేశం కూడా నష్టపోయిందని పవన్ అభిమానులు కూడా బాధపడుతుంటారు. ఓట్లు, సీట్లు రాకపోయినా, పార్టీలకతీతంగా తన లక్ష్యాల కోసం కృషి చేసే క్రమంలో.. ఎన్నికల తర్వాత కూడా లోక్‌సత్తా పవన్‌తో కలిసి పనిచేయాలని కోరుకుంది. ఆ విషయాన్ని పవన్‌కి కూడా తెలియచేసింది. ఒంటి చేత్తో చప్పట్లు సాధ్యం కాదు కాబట్టి.. లోక్‌సత్తా, జనసేన కలిసి పనిచేయటం గురించి పవన్ కళ్యాణ్‌నే అడగటం మేలు.


ఇక రాజకీయాల్లో అంటరానివారు ఉండరని కమల్ హాసన్ ఇటీవల చెబుతున్నారు. ఏ పార్టీతోనైనా కలుస్తామంటున్నారు. ఆయన ఎన్నికల వ్యూహంతో ఆ మాట అంటుండొచ్చు.. కానీ లోక్‌సత్తా తొలి నుంచీ ఎన్నికలతో సంబంధం లేకుండా కూడా సమస్యలపై, లక్ష్యాలకై పార్టీలకతీతంగా పనిచేస్తోంది. దాదాపు నాలుగు దశాబ్దాలకుపైగా కేవలం భారతదేశ నిర్మాణం కోసం తానే రాసుకుని, తానే ప్రచారం చేసుకుంటూ, నిరంతరం పనిచేస్తూ ఒక్క ఎంపీ కూడా లేకున్నా పలు రాజ్యాంగ సవరణల్ని, చట్టాల్ని, 2జీ స్పెక్ట్రం కేసులో లైసెన్సుల రద్దు చేయించటం, ప్రకృతి వనరుల కేటాయింపులో వేలం పద్ధతిని తేవటం సహా పలు కీలక విధానమార్పుల్ని సాధించిన జేపీ.. పవన్ కళ్యాణ్ వంటి సినీహీరోల సహకారం గురించి ఎందుకు అంత ఆలోచించటం అని విమర్శలు వచ్చినా సరే, జనహితం దిశగా మార్పును వేగవంతం చేసేందుకు తలవంచటానికి వెనుకంజ వేయకూడదన్నది లోక్‌సత్తా పంథా. లోక్‌సత్తా ప్రతిపాదిస్తున్న సురాజ్య ఉద్యమం కావచ్చు, మిగిలిన లక్ష్యాలు కావచ్చు.. దేశంలోని ప్రతి రాష్ట్రానికీ వర్తిస్తాయి. అందుకే రజనీకాంత్, కమల్ హాసన్‌లతో కూడా వీలున్నంత మేర కలిసిపనిచేయటానికి సిద్ధంగా ఉంటుంది. తమిళనాడుతోపాటు తెలుగు రాష్ట్రాలు, దేశంలోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా ప్రభావం చూపగలిగినవారు ఆ హీరోలు.

రాజు తత్వవేత్త అయినా, తత్వవేత్త రాజు అయినా చట్టాలు అవసరం లేనంత సుపరిపాలన వస్తుందని భావించి ప్లేటో మహాశయుడు 'రిపబ్లిక్' అనే పుస్తకాన్ని రాశారు. కానీ తన వాదన తప్పని కాలక్రమంలో ఆయన గుర్తించారు. తత్వవేత్త రాజు అయినా, అధికారంలోకి వచ్చాక ఆ ప్రభావానికి లంగి తాత్వికతను నిలుపుకోలేక పోవచ్చు. ఒకవేళ నిలుపుకున్నా, రాజయ్యాక తత్వవేత్తగా మారినా కూడా.. ప్రజలకు సుపరిపాలన అందించటం కేవలం ఆయనొక్కడికే సాధ్యం కాదు. నిస్సహాయంగా వైఫల్యాల్ని భరించాల్సి వస్తుంది (వ్యక్తిగతంగా నిజాయతీపరులైన అనేకమంది నాయకులు పాలనలో విఫలమవటాన్ని ఇప్పుడు కూడా చూస్తున్నాం). అందుకే తన చివరి దశలో 'చట్టాలు' (ది లాస్) అనే పుస్తకాన్ని ప్లేటో రాశారు. అయితే, రిపబ్లిక్ గురించి జరిగిన ప్రచారం.. చట్టాలు అనే పుస్తకం గురించి జరగలేదు. అందుకే.. తత్వవేత్తలు, ఆధ్యాత్మికవేత్తలే అయినా, నిఖార్సయిన నిజాయతీపరులే అయినా, క్లాస్ హీరోలైనా, మాస్ హీరోలైనా సరైన వ్యవస్థల నిర్మాణం కోసం ఆచరణాత్మక విధానాలు, సంస్కరణలతో రాజకీయాల్లోకి వస్తేనే, గ్లామర్‌ను, డబ్బును ఈ దిశగా ఉపయోగిస్తేనే ప్రజలకు, వారికి కూడా ప్రయోజనకరం. ❍

# నిజమైన స్వయంపాలనను 102 ఏళ్ల క్రితం అర్థం చేసుకుని పోరాడిన గొప్ప భారతీయుడు

### (బనారస్ హిందూ యూనివర్సిటీలో గాంధీజీ సుప్రసిద్ధ ప్రసంగం)

*దక్షిణాఫ్రికాలో అహింసాపోరాటం చేసి గణనీయ ప్రభావం చూపిన అనంతరం గాంధీజీ 1915లో భారత్‌కు తిరిగి వచ్చారు. అదే సమయంలో బనారస్ హిందూ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో తన రాజకీయ ఆలోచనలను వెల్లడించారు. అది సత్యాన్వేషణ ఆలోచనలను ప్రజల ముందుంచే అసాధారణ రాజకీయ సంభాషణ తప్ప.. వాగాడంబరాల ఉపన్యాసం కాదు. బ్రిటీషువాళ్లున్నా, పోయినా, అధికారంలో ఎవరున్నా మనల్ని మనం పరిపాలించుకోవాలంటే కొన్ని మౌలికమైన దిద్దుబాట్లు అవసరమని ఆనాడే గాంధీజీ సురాజ్య గళాన్ని వినిపించారు. నిజమైన స్వయంపాలనను సుమారు 102 ఏళ్ల క్రితం అర్థం చేసుకుని అందుకోసం ఆ గొప్ప భారతీయుడు పోరాడటం జాతీయోద్యమానికి ఘననివాళి. "స్వరాజ్యమంటే కొంతమంది పెద్దలు గద్దెనెక్కటం కాదు.. ఎక్కడో మారుమూలనున్న సామాన్యునికి కూడా తన జీవితం మీద తనకు అధికారం ఏర్పడటం" అని గాంధీజీ ఆ తర్వాత కూడా విస్పష్టంగా చాటుతూ వచ్చారు. ప్రజాస్వామ్యం గురించి గాంధీజీ చెప్పిన మాటల సారాంశాన్ని అర్థం చేసుకోవటంలో, ఆచరణలోకి తేవటంలో దశాబ్దాలుగా స్వతంత్ర భారతదేశంలో మనం విఫలమవటం విషాదకరం, మన ప్రజల పాలిట శాపం. అధికారాన్ని స్థానికం చేసి ప్రజల్లో నిజమైన స్వయంపాలన సామర్థ్యాన్ని పెంపొందించటమే ఇప్పుడు మన ముందున్న కర్తవ్యం. స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలతో కేంద్రం-రాష్ట్రం-స్థానిక ప్రభుత్వాలు అనే మూడంచెల ఫెడరల్ విధానం, తలసరి గ్రాంట్ కేటాయింపు వంటి సంస్కరణలతో ప్రజల సాధికారతకు వ్యవస్థీకృత ఏర్పాట్లు చేసేందుకు లోక్‌సత్తా తన వంతు ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలోనే 1916లో బనారస్ హిందూ యూనివర్సిటీలో గాంధీజీ చేసిన ప్రసంగ సంభాషణను స్థూలంగా తెలుగులో లోక్‌సత్తా టైమ్స్ పాఠకుల కోసం అందిస్తున్నాం..*




(బనారస్ హిందూ విశ్వవిద్యాలయ ప్రారంభం సందర్భంగా ప్రసంగించవలసిందిగా గాంధీజీని పండిత మాలవీయ ఆహ్వానించారు. యూనివర్సిటీ ప్రధాన ప్రాంగణానికి పునాది రాయి వేయటానికి వైస్రాయ్ లార్డ్ హార్డింజ్ ప్రత్యేకించి విచ్చేశారు. ఆయన ప్రాణరక్షణ కోసం పోలీసులు అదనపు జాగ్రత్తలు తీసుకున్నారు. ఎటుచూసినా పోలీసు వలయం. వైస్రాయ్ ప్రయాణించే మార్గంలోని ఇళ్లన్నీ పహారాలోకి వచ్చేశాయి. బనారస్ దిగ్బంధంలోకెళ్లింది.

భారతదేశంలోని సుప్రసిద్ధులు వచ్చారు. వారిలో చాలామంది ఉపన్యాసాలిచ్చారు. ఫిబ్రవరి 4, 1916న గాంధీజీ వంతు వచ్చింది. విరిసీవిరియని ఆలోచనల టీనేజ్ యువత ఎక్కువగా ఉన్న సభనుద్దేశించి ఆయన మాట్లాడారు. ధగధగలాడే ఆభరణాలతో సర్వాలంకార భూషితులైన యువరాజ వంశీయులతో వేదిక మిరుమిట్లుగొలుపుతోంది. దర్భాంగ మహారాజు అధ్యక్ష స్థానంలో ఆసీనులై ఉన్నారు.

చిన్నపాటి ముతక ధోతీ, కథియవాడి గడియారం, తలపాగా ధరించిన గాంధీ మాట్లాడటానికి లేచి నిలబడ్డారు. తన చుట్టూ ఉన్న పోలీసుల భద్రతా ఏర్పాట్లు, విలాసవంతమైన వాతావరణం ఆయన్ను ఎంతగానో బాధించాయి. సభికుల వైపునకు తిరిగారు. ఎటువంటి భేషజాలూ లేకుండా మనసులోని ఆలోచననే బైటికి చెబుతానని, అదే తన ఉపన్యాసమని మనవి చేశారు.)

నేను ఇక్కడికి చేరుకోగలగడానికి ముందు జరిగిన సుదీర్ఘ ఆలస్యానికి వినమ్రంగా క్షమాపణ చెప్పాలనుకుంటున్నాను. ఆలస్యానికి నేనుగానీ ఇతరులుగానీ కారణం కాదని, ఇందులో మానవ ప్రమేయం లేదని తెలుసుకుంటే మీరంతా వెంటనే నా క్షమాపణను అంగీకరిస్తారు. వాస్తవానికి నేను ప్రదర్శనలో జంతువులాంటి వాడిని. మన ప్రమేయం లేకుండా జరుగుతుండే అనివార్య ఘటనల వల్ల తలెత్తే ఇబ్బందుల్ని నా నిర్వాహకులు దాటవేస్తుంటారు. ఇందుకోసం పాపం

వారు మితిమీరిన దయాభరితంగా వ్యవహరిస్తుంటారు. కానీ ఈవేళ అనుకోకుండా జరిగిన పలు ఘటనల విషయంలో అలాంటి ఏర్పాట్లు లేవు. మీకు, నాకు, నిర్వాహకులకు, నన్ను తీసుకొచ్చినవారికి అందరికీ అనుకోనివి ఇవి. అందుకే ఈ ఆలస్యం.

మిత్రులారా, ఇప్పుడే ప్రసంగించి కూర్చున్న శ్రీమతి బీసెంట్ అసమాన ప్రసంగ ప్రవాహంలో కొట్టుకుపోయి మన యూనివర్సిటీ పరిపూర్ణ స్థాయికి చేరుకుందని నమ్మబోకండి. ఇంకా ఉనికిలోకి రావాల్సిన, ఎదగాల్సిన విశ్వ విద్యాలయంలోకి ముమ్ముందు రావాల్సిన యువజనులంతా కూడా వచ్చేశారు, ఓ పెద్ద సామ్రాజ్యంలో సంపూర్ణ పౌరులుగా రూపుదిద్దుకున్నారు అనుకోబోకండి. ఆ తరహా అభిప్రాయాలలో కొట్టుకుపోవద్దు. ఈ సాయంత్రం వేళ నేను మాట్లాడాల్సింది ప్రధానంగా మిమ్మల్ని, అంటే విద్యార్థి ప్రపంచాన్ని ఉద్దేశించే! ఏ ఆధ్యాత్మిక జీవనం విషయంలో ఈ దేశం ఖ్యాతిని గడించిందో, ఏ ఆధ్యాత్మిక జీవనం విషయంలో ఈ దేశానికి సాటిలేదో, దాన్ని పెదవుల ద్వారానే వ్యాపింపచేయవచ్చు అని ఒక్క క్షణం మీరు అనుకున్నా.. మీ ఆలోచన తప్పు అని చేతులు జోడించి చెబుతున్నాను. నన్ను నమ్మండి. భారతదేశం ఏదోకరోజు ప్రపంచానికే దిశానిర్దేశం చేస్తుందని ఆశిస్తున్నట్టు మీరు కేవలం మాటల ద్వారా ఎప్పటికీ సందేశాన్ని ఇవ్వలేరు. నా మట్టుకు నాకు ప్రసంగాలు, ఉపన్యాసాలు అంటే విసుగొచ్చేసింది. గత రెండు రోజులుగా ఇక్కడ ఇస్తున్న ప్రసంగాలను మాత్రం ఆ విభాగంలో చేర్చకుండా మినహాయిస్తున్నాను. ఎందుకంటే, అవి అవసరమైనవి! కానీ ఉపన్యాసాల-తయారీలో మన వనరులు దాదాపు ఖాళీ అయ్యాయని చెప్పటానికి నేను సాహసిస్తున్నాను. మనకు వీనుల విందు, కనువిందు చేస్తే చాలదు.. మన హృదయాలను తాకాలి, మన చేతులను, కాళ్లను కదిలించగలగాలి.

భారతీయ స్వభావంలోని నిరాండబరతపై మన పట్టును కాపాడుకోవాలంటే.. మన కాళ్లు, చేతులు మన హృదయాలకనుగుణంగా ఏకరీతిలో స్పందించటం ఎంత అవసరమో గత రెండు రోజులుగా మనకు చెబుతున్నారు. కానీ అవి తొలిపలుకుల్లాంటివే. ఈ గొప్ప కళాశాల నీడలో, ఈ పవిత్ర నగరంలో నాకు విదేశీ అయిన భాషలో నా దేశస్తులనుద్దేశించి మాట్లాడాల్సి రావటం తీవ్ర బాధాకరం, అవమానకరం అని స్పష్టంగా చెప్పదలచుకున్నాను. నాకు తెలుసు– ఈ రెండు రోజుల్లో వరస ప్రసంగాలకు హాజరైనవారిని పరీక్షించటానికి నన్ను ఎగ్జామినర్‌గా నియమిస్తే, పలువురు ఫెయిలవుతారు. ఎందుకంటే, ఆ ప్రసంగాలు వారిని తాకలేదు.

డిసెంబర్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభల్లో నేను పాల్గొన్నాను. సభికులు ఇంకా ఎక్కువసంఖ్యలో ఉన్నారు. మీరు నమ్ముతారో లేదో.. బొంబేలోని ఆ సభల్లో ఎక్కువమంది శ్రోతల్ని ప్రభావితం చేసిన ప్రసంగాలన్నీ కేవలం హిందుస్తానీలో చేసినవే! జాగ్రత్తగా వినండి, అందరూ హిందీ మాట్లాడే బనారస్‌లోకాదు.. బొంబేలో సంగతి నేను చెబుతున్నది. బొంబే ప్రెసిడెన్సీ యాసలు ఒకపక్క, హిందీ మరోపక్క ఉన్నా కూడా.. ఇంగ్లీష్‌కి, భారతీయ సోదర భాషకి మధ్య ఉన్నంత పెద్ద విభజన వాటి మధ్య కనిపించదు. హిందీలో మాట్లాడిన వక్తల భావాలను కాంగ్రెస్ శ్రోతలు మెరుగ్గా అర్థం చేసుకోగలిగారు. ఈ యూనివర్సిటీకి వచ్చే యువతకు వారి స్థానిక భాషలో చదువు చెప్పేందుకు చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నా. మన భాషలంటే మనల్ని మనం సమీక్షించుకోవటం. అత్యుత్తమ ఆలోచనల్ని వ్యక్తం చేసే శక్తి మన భాషలకు లేదు అంటే.. మనం ఎంత త్వరగా మనుగడను కోల్పోతే మనకు అంత మంచిది అంటాను. ఇంగ్లీష్ ఎప్పటికైనా భారతదేశ జాతీయ భాష అవుతుందని కలలుగనే వారెవరైనా ఉన్నారా? ఎందుకు దేశం మీద ఈ వైకల్యాన్ని రుద్దుతున్నాం? ఇంగ్లీష్ పిల్లతోనో, పిల్లవాడితోనో మన పిల్లలు పోటీపడితే.. సమానత్వం ఏ స్థాయిలో ఉంటుందో ఒక్కసారి ఊహించుకోండి.

కొంతమంది పూణె ప్రొఫెసర్లతో సన్నిహితంగా మాట్లాడే సదవకాశం నాకు లభించింది. ఇంగ్లీష్ భాష ద్వారా పరిజ్ఞానాన్ని పెంచుకున్న ప్రతి భారతీయ యువతా తన జీవితంలో కనీసం ఆరు విలువైన సంవత్సరాలను కోల్పోయినట్టని వారు నాకు తేల్చిచెప్పారు. మన స్కూళ్లలో, కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యతో ఆ సంవత్సరాలను గుణించండి. ఎన్ని వేల సంవత్సరాలను ఈ దేశం కోల్పోయిందో మీకే అర్థమవుతుంది. 'చొరవ లేదు' అన్నది మన మీదున్న ఆరోపణ. మన జీవితంలో విలువైన సంవత్సరాలను ఒక విదేశీ భాషలో ప్రావీణ్యం సంపాదించుకోవటానికే వెచ్చిస్తుంటే.. మనకు చొరవ ఎలా వస్తుంది? ఈ ప్రయత్నంలో కూడా మనం విఫలమయ్యాం. హిగ్గిన్‌బాథమ్ తరహాలో తన శ్రోతల్ని ప్రభావితం చేయటం నిన్న, ఈరోజు ఏ వక్తకయినా సాధ్యమైందా? సభికులను ఆకట్టుకోలేకపోవటం ఆ వక్తల తప్పు కాదు. కావలసిన దానికన్నా ఎక్కువ విషయాన్నే వారు మన కోసం తమ ప్రసంగాల ద్వారా అందించారు. కానీ వారి మాటలు మన ఇంటి దాకా రావు. ఇంగ్లీష్ చదువున్న భారతీయులే ముందున్నారు, నాయకత్వం వహిస్తున్నారు, దేశానికి అన్ని పనులు చేస్తున్నారు.. అని చెప్పుకోవటం నేను విన్నాను. అలాకాకుండా ఇంకోలా అయితే భయంకర

ఉపద్రవమే! మనకు అందుతున్న చదువు.. ఆంగ్ల విద్య మాత్రమే. కచ్చితంగా దాని పట్ల మనం ఎంతోకొంత సానుకూలంగా స్పందించాలి. కానీ ఒక్కసారి ఊహించండి– గత యాభై ఏళ్లుగా మన స్థానిక భాషల్లో మనకు చదువు అందుతుందనుకోండి, ఇప్పుడు ఎలా ఉండేవాళ్లం? మనకు ఏమి సమకూరేది?.. మనకు స్వతంత్ర భారతదేశం ఉండేది, చదువుకున్న స్వదేశీయులుండేవారు, సొంత దేశంలోనే విదేశీయుల్లా కాకుండా భారతదేశ అంతరాత్మతో మాట్లాడుతుండేవాళ్లం. అలాంటి స్వదేశీ విద్యావంతులు అత్యంత నిరుపేదల మధ్య పనిచేస్తుండేవారు. ఈ యాభై ఏళ్లలో వారు సాధించింది దేశ వారసత్వ సంపదగా ఉండేది. ఈవేళ మన భార్యలు కూడా మన అత్యుత్తమ ఆలోచనలో భాగస్వాములు కాలేకపోతున్నారు. ప్రొఫెసర్ బోస్, ప్రొఫెసర్ రేని చూడండి. వారి పరిశోధనలు సామాన్య ప్రజల ఉమ్మడి ఆస్తి కాకపోవటం అవమానకరం కాదా?

ఇప్పుడు ఇంకో అంశాన్ని చూద్దాం.

స్వయంపాలనపై కాంగ్రెస్ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, ముస్లిం లీగ్ తమ బాధ్యతను నెరవేరుస్తాయని, ఆచరణాత్మకమైన సూచనలను అందిస్తాయని నేను నిస్సందేహంగా నమ్ముతున్నాను. అదేసమయంలో నేను దాపరికం లేకుండా అంగీకరిస్తున్నాను– వాళ్లు ఎంతమేర చేయగలరు అనే దాని మీద నాకు అంత ఆసక్తి లేదు. నాకున్న ఆసక్తంతా– ఈ దేశ విద్యార్థి ప్రపంచం ఏం సాధిస్తుంది? సామాన్య ప్రజలు ఏం సాధిస్తారు? అనే అంశాల మీదే! కాగితాల్లో వక్కాణించటం ద్వారా మనకు స్వయంపాలన రాదు. ఎన్ని ప్రసంగాలైనా మనల్ని స్వయంపాలనకు తగురీతిలో సిద్ధం చేయలేవు. మన ప్రవర్తన మాత్రమే మనల్ని స్వయంపాలనకు అర్హులుగా తయారుచేస్తుంది. మనల్ని మనం పరిపాలించుకోవటానికి మనం ఏ విధంగా ప్రయత్నిస్తున్నాం మరి?

నాలో ఆలోచిస్తున్న విషయాల్నే ఈ సాయంత్రం వేళ బైటికి చెబుతున్నాను. ప్రసంగం చేయదలచుకోలేదు. దాచుకోకుండా ఉన్నదున్నట్టు మాట్లాడటాన్ని.. తన అంతరంగాన్ని వివరిస్తున్న వ్యక్తి ఆలోచనలను పంచుకోవటంగానే భావించండి. సభామర్యాదల్ని నేను అతిక్రమించినట్టు అనిపిస్తే.. నేను తీసుకుంటున్న స్వేచ్ఛకు క్షమించండి. నేను గత సాయంత్రం విశ్వనాథ ఆలయాన్ని సందర్శించాను. ఆ వీథుల్లో నుంచి నడుస్తున్నప్పుడు నన్ను కదిలించిన ఆలోచనలే ఇవి. ఈ గొప్ప దేవాలయానికి ఎక్కడినుంచో ఓ అపరిచితుడు వస్తే.. హిందువులుగా మనమేంటో అని ఆలోచనలో పడక తప్పదు. అతను మన తీరుని ఖండిస్తే.. అన్యాయం అనగలమా? మన స్వభావానికి ఈ సమున్నత దేవాలయం సంకేతం కాదా? ఒక హిందువుగా మనసు నిండా భావోద్వేగంతో మాట్లాడుతున్నాను. మన పవిత్ర దేవాలయం వీథులు అంత మురికిగొట్టుగా ఉండటం సరైనదేనా? చుట్టూ ఉన్న ఇళ్లను.. ఏదోలా అన్నట్టు కట్టేశారు. వీథులు మెలికలతో ఇరుకుగా ఉన్నాయి. మన దేవాలయాలు విశాలతకు, పరిశుభ్రతకు నమూనాలు కాకపోతే, మన స్వయంపాలన ఏ రకంగా ఉంటుంది? తమ ఇష్టానుసారమో లేక తప్పదనో ఆంగ్లేయులు భారతదేశం నుంచి మూటాముల్లెతో వెళ్లాక.. మన దేవాలయాలు పవిత్రతకు, పరిశుభ్రతకు, శాంతికి నిలయాలుగా ఉండాలిగా?

మనం స్వయంపాలన గురించి ఆలోచించే ముందు అవసరమైన కసరత్తు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్న మాటలతో నేను పూర్తిగా ఏకీభవిస్తాను. ప్రతి నగరంలో రెండు విభాగాలున్నాయి. కంటోన్మెంట్, ప్రధాన నగరం. నగరం చాలావరకు దుర్గంధం వెదజల్లే కొట్టంలా ఉంది. మనం నగర జీవనం అలవాటు లేని ప్రజలం. కానీ మనకు నగర జీవనం కావాలంటే, పల్లెసీమల్లోలా ఇష్టమొచ్చినట్టు వ్యవహరించటం సాధ్యం కాదు. భవనాల అంతస్తుల్లో ఉన్నవారు తమ మీద ఉమ్మి వేస్తారనే భయంతో భారతదేశ బాంబేలో రోడ్ల మీద నడవాలి అన్న ఆలోచనే ఇబ్బందికరంగా ఉంటుంది. నేను రైలు ప్రయాణాలు చాలా ఎక్కువగా చేస్తుంటాను. మూడో తరగతి ప్రయాణీకుల కష్టాల్ని చూస్తుంటాను. కానీ వారి కష్టాలకు రైల్వే యంత్రాంగాన్ని ఏ రకంగానూ నిందించలేం. పరిశుభ్రతకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలు కూడా మనకు తెలియవు. రైల్వే పెట్టెలో ఎక్కడబడితే అక్కడ ఉమ్మి వేస్తుంటాం. మళ్లీ ఇక్కడే పడుకుంటామన్న స్పృహ కూడా ఉండదు. దాన్ని ఎలా ఉపయోగిస్తామన్న ఆలోచన సైతం బరువను కుంటాం. ఫలితంగా రైలుపెట్టెలు వర్ణించనలవికాని రోతగా తయారవుతున్నాయి. ఇక మనలాంటి సామాన్య సహోదరులకు పైన ఉన్నత తరగతి ప్రయాణికులు ఉంటారు. వాళ్లలో విద్యార్థులను కూడా చూశాను. కొన్నిసార్లు వాళ్లు సైతం భిన్నంగా ఏమీ ప్రవర్తించరు. వాళ్లు ఇంగ్లీష్‌లో మాట్లాడగలరు. నార్ఫోక్ జాకెట్లు వేసుకుంటారు. కాబట్టి లోపలికి దూసుకొచ్చి సీటు కోసం దబాయిస్తారు.

నేను అంతటా అన్వేషణ వెలుగును ప్రసరింపచేశాను. మీతో మాట్లాడే అవకాశాన్ని నాకు ఇవ్వటంతో, నా హృదయం మొత్తాన్నీ ఇక్కడ పరుస్తున్నాను. స్వయంపాలన దిశగా మన పురోగతిలో భాగంగా మనం ఆ విషయాలన్నిటినీ సరిదిద్దుకోవాలి. మీకు మరో సన్నివేశాన్ని

ఇప్పుడు పరిచయం చేస్తాను. నిన్న కార్యక్రమానికి అధ్యక్షత వహించిన (హిజ్ హైనెస్) మహారాజా వారు భారతదేశంలో పేదరికం గురించి మాట్లాడారు. మిగతా వక్తలు కూడా దాని మీద గొప్ప వక్కాణింపునిచ్చారు. కానీ వైస్రాయ్ పునాది రాయి వేసిన ఆ గొప్ప మంటపంలో మనం ఏం చూశాం? అది అత్యంత ఘనమైన ప్రదర్శన అనటంలో సందేహం లేదు. ఆ ఆభరణాల ప్రదర్శన.. పారిస్ నుంచి పనిగట్టుకుని వచ్చిన విఖ్యాత జ్యూయెలర్‌కు కన్నుల విందు చేసే ప్రదర్శన. ఆభరణాలతో మెరిసిపోతున్న సంపన్న సంస్థానాధిపతులను, కోట్లాది పేద ప్రజలను నేను పోలుస్తాను. ఈ సంపన్నులకు చెప్పాలని నాకనిపిస్తున్నది– "మీరు మీ ఆభరణాలను స్వచ్ఛందంగా త్యజించి భారత్‌లోని మీ దేశ ప్రజల కోసం ధర్మకర్తలుగా వ్యవహరించకపోతే భారత్‌కు విముక్తి ఉండదు". రాజ–చక్రవర్తికి విధేయతను ప్రకటించటానికి మన ఆభరణాల పెట్టెలను కొల్లగొట్టి తల నుంచి బటనవేలు దాకా అలంకరించుకోవాలని రాజ–చక్రవర్తి లేదా లార్డ్ హార్డింజ్ కూడా కోరుకోరని చెప్పగలను. అటువంటిదేమీ తాను కోరుకోవటం లేదని స్వయంగా జార్జి చక్రవర్తి చెప్పిన సందేశాన్ని నా ప్రాణాన్ని ఫణంగా పెట్టయినా తేవటానికి సిద్ధం.

అయ్యా, బ్రిటిష్ ఇండియాలో కావచ్చు, మన గొప్ప సంస్థానాధిపతులు పాలిస్తున్న భారతదేశంలో కావచ్చు.. ఏ గొప్ప నగరంలో గొప్ప భవంతి నిర్మాణం గురించి విన్నా నాకు వెంటనే అసూయ కలుగుతుంది. "మన వ్యవసాయదారుల నుంచి వచ్చిన డబ్బు గదా ఇది" అనేస్తాను. డెబ్బయి అయిదు శాతానికి పైగా దేశ జనాభా వ్యవసాయంలో ఉన్నారు. హిగ్గిన్‌బాథమ్ తన భాషలో గత రాత్రి అతికినట్టు చక్కగా చెప్పారు– ఒకటి పండే చోట రెండు పండించిన కష్టజీవులు వారు. ఆ కష్టం ఫలితాలన్నిటినీ వారి నుంచి మనం లాగేసుకున్నా, ఇతరులు లాగేసుకోవటానికి అనుమతించినా.. మనకు స్వయంపాలన స్ఫూర్తి పెద్దగా ఉండదు. మన విముక్తి రైతు ద్వారా మాత్రమే వస్తుంది. న్యాయవాదులో, డాక్టర్లో, సంపన్న భూస్వాములో దాన్ని సాధించలేరు.

చివరిదే అయినా ఇప్పుడు, ఓ ముఖ్యాంశం. ఈ రెండు మూడు రోజుల్లో మన మెదళ్లని కుదిపేసిన అంశం గురించి ప్రస్తావించటం నా విద్యుక్త బాధ్యత. వైస్రాయ్ బనారస్ వీధుల గుండా వెళ్తున్నప్పుడు మనందరిలో ఎంతో ఉత్కంఠ నెలకొంది. అనేక ప్రాంతాల్లో డిటెక్టివ్‌లను ఏర్పాటుచేయటం కనిపించింది. మనల్ని భయభ్రాంతులకు గురిచేశారు. మనలో మనం ప్రశ్నించుకున్నాం– "ఎందుకీ అపనమ్మకం? బతికుండి చచ్చే కంటే లార్డ్ హార్డింజ్ చావటం మేలు కదా?". కానీ ఓ బలశాలి సామ్రాజ్యానికి ప్రతినిధి అలా చేయకపోవచ్చు. మన మీద డిటెక్టివ్‌లను రుద్దటం అవసరమని ఆయన అనుకుంటూండవచ్చు. మనం పళ్లు నూరవచ్చు, ఆదుర్దా పడొచ్చు, మన పట్ల వ్యవహరిస్తున్న తీరుకి ఆగ్రహోదగ్రులం కావచ్చు.. కానీ తన అసహనంలో ఈవేళ భారతదేశం సాయుధ అరాచకవాదుల్ని సృష్టించిందని మనం మర్చిపోకూడదు. నా మట్టుకు నేను అరాచకవాదిని. కానీ మరోరకంగా! మనలో ఒక వర్గం అరాచకవాదులున్నారు. ఆ వర్గంతో మాట్లాడే అవకాశం వస్తే.. భారతదేశం గెలవాలంటే, వారి అరాచకవాదానికి భారత్‌లో స్థానం ఉండదని చెబుతాను. మనం దైవాన్ని నమ్మి దైవభీతితో ఉంటే.. మనం ఎవరికీ భయపడాల్సిన పన్లేదు. మహారాజాలు, వైస్రాయిలు, డిటెక్టివ్‌లు, చివరికి జార్జి చక్రవర్తికి కూడా.

అరాచకవాదికి దేశం పట్ల ఉన్న ప్రేమ కారణంగా అతన్ని గౌరవిస్తాను. తన దేశం కోసం మరణించటానికి సిద్ధపడే అతని ధైర్యాన్ని గౌరవిస్తాను. కానీ అదేసమయంలో అతన్ని అడుగుతాను– చంపటం గౌరవనీయమైన పనా? హత్య చేసే కత్తిని చేబూనటం శ్లాఘనీయ మరణానికి అర్హతవుతుందా? నేను దాన్ని తిరస్కరిస్తాను. ఏ పవిత్ర గ్రంథంలోనూ అటువంటి ధోరణులను ప్రోత్సహించే రాతలు లేవు. బ్రిటీష్‌వారు వైదొలిగితేనే భారతదేశానికి విముక్తి, వారిని బైటికి గెంటటం అవసరం అని నేను అనుకుంటే.. వారు వెళ్లితీరాల్సిందే అని ప్రకటించటానికి నేనేమీ సందేహించను. ఆ విశ్వాసం కోసం మరణించటానికి కూడా సిద్ధపడతాను. అది, నా ఉద్దేశంలో, ఘనమైన మరణం. బాంబులు విసిరేవ్యక్తి రహస్య కుట్రలు పన్నుతాడు, అందరిలోకీ రావటానికి భయపడతాడు, పట్టుబడ్డప్పుడు తప్పుదారిపట్టిన తన మహోత్సాహానికి మూల్యం చెల్లిస్తాడు.

"మనం ఇలా చేయకపోతే, కొంతమంది బాంబులు వేసి ఉండకపోతే.. మనం సాధించింది ఎప్పటికీ సాధించి ఉండేవాళ్లం కాదు అని (బెంగాల్) విభజన ఉద్యమాన్ని ఉటంకిస్తూ" నాకు చెప్పారు. (ఈ సమయంలో అనిబిసెంట్ జోక్యం చేసుకుని 'దయచేసి ఆ మాటలు ఆపండి' అన్నారు). బెంగాల్‌లో లియాన్ నిర్వహించిన సమావేశంలో నేను ఇదే చెప్పాను. నేను చెబుతున్నది అవసరమని అనుకుంటున్నాను. ఆపేయమంటే ఆపేస్తాను. (ఛైర్మన్ వైపునకు తిరిగి) మీ ఆదేశాల కోసం చూస్తున్నాను. నా ఆలోచనలను ఉన్నదున్నట్టుగా చెప్పటం వల్ల నేను దేశానికి, సామ్రాజ్యానికి సేవ చేయటం లేదు అనుకుంటే.. నేను మాట్లాడటం ఆపేస్తాను. ('కొనసాగించండి' అని అరుపులు). (దీంతో ఛైర్మన్ 'మీ లక్ష్యమేంటో చెప్పండి' అని గాంధీనుద్దేశించి అన్నారు). నేను కేవలం (మరో ఆటంకం).. నా స్నేహితులారా, ఈ

అంతరాయాన్ని నిరసించకండి. నేను మాట్లాడటం ఆపేయాలని ఇప్పుడు శ్రీమతి అనీబిసెంట్ సూచిస్తున్నారు అంటే.. ఆమె భారతదేశాన్ని ఎంతగానో ప్రేమిస్తున్నారు. నేను యువజనుల ముందు నా ఆలోచనలను బాహాటంగా చెప్పటం ద్వారా పొరపాటు చేస్తున్నానని ఆమె అభిప్రాయం. అయినా కూడా, ఇరుపక్షాల్లో ఉన్న పరస్పర అనుమానాల నుంచి భారత్‌ను విముక్తి చేయాలనుకుంటున్నాను. మన లక్ష్యాన్ని చేరుకోవాలంటే, పరస్పర ప్రేమ, నమ్మకం ఉన్న సామ్రాజ్యం ఉండాలి. మనం ఇళ్లల్లో బాధ్యతారహితంగా మాట్లాడుకునేకంటే ఈ కళాశాలలో మాట్లాడుకోవటం మెరుగైన విషయం కాదా? ఈ విషయాల్ని బాహాటంగా మాట్లాడు కోవటం మరింత మెరుగని భావిస్తాను. ఈ రకంగా చేయటం ద్వారా గతంలో అద్భుత ఫలితాల్ని సాధించాను. విద్యార్థులకు తెలియనిదేదీ లేదని నాకు తెలుసు. కాబట్టి, అన్వేషణను మనవైపే మళ్లిస్తున్నాను. నేను నా దేశాన్ని ఎంతగానో ప్రేమిస్తాను కాబట్టే.. ఈ ఆలోచనల్ని మీతో పంచుకుంటున్నాను, భారత్‌లో అరాచకత్వానికి తావులేదని విన్నవిస్తున్నాను. పాలకులకు ఏం చెప్పాలనుకుంటున్నామో వాటిని నిర్మొహమాటంగా, బహిరంగంగా చెబుదాం. మనం చెప్పింది వారికి నచ్చకపోతే, పర్యవసానాల్ని ఎదుర్కొందాం. కానీ దూషించటం మనం చేయొద్దు.

పలురకాలుగా దూషణలకు గురవుతున్న ఇండియన్ సివిల్ సర్వీస్ సభ్యునితో ఇటీవల మాట్లాడాను. ఆ సర్వీసులోని సభ్యులతో నేను పంచుకోగలిగిన అంశాలు తక్కువే అయినా, అతను నాతో మాట్లాడిన తీరును ప్రశంసించకుండా ఉండలేకపోయాను. "మిస్టర్ గాంధీ, సివిల్ సర్వీసెస్‌లో ఉన్న మేం చెడ్డవాళ్లమని, ఏ ప్రజలను పరిపాలించటానికి వచ్చామో వారిని అణచివేయాలనుకుంటున్నామని ఎప్పుడైనా అనుకున్నారా?" అని ఆయన అడిగారు. "లేదు" అని సమాధానం చెప్పాను. "అలాంటపుడు ప్రజల్లో చెడ్డపేరున్న సివిల్ సర్వెంట్లకు మద్దతుగా అవకాశం వచ్చినప్పుడు ఓ మంచి మాట చెప్పండి" అని కోరారు. ఆ సందర్భం ఇప్పుడు, ఇక్కడ వచ్చింది. అవును, ఇండియన్ సివిల్ సర్వీస్‌లోని పలువురు సభ్యులు అహంకారపూరిత దాష్టీకాలకు పాల్పడుతుంటారని నిర్వంద్వంగా చెప్పొచ్చు. వాళ్లు క్రూరంగా, కొన్నిసార్లు మతిలేకుండా వ్యవహరిస్తారు. ఇలా అనేక విశ్లేషణాల్ని వారి వ్యవహారశైలిపై ఉపయోగించవచ్చు. ఈ విషయాలన్నిటితోపాటు ఇంకోటి కూడా మనం గుర్తించాలి. భారత్‌లో కొన్నేళ్లపాటు గడిపాక వారిలో కొందరు కొంతమేర దిగజారిపోయారు. అది దేన్ని సూచిస్తోంది? ఇక్కడకు రాకముందు వాళ్లు పెద్దమనుషులు. ఇక్కడికొచ్చాక వాళ్లు తమ నైతికతను కొంత కోల్పోయారంటే, అది మనం కూడా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశం.

మీరే ఆలోచించండి, నిన్న మంచిగా ఉన్న వ్యక్తి నాతో కలిసున్నాక చెడ్డగా మారాడంటే, అతను దిగజారిపోవటానికి అతనే కారణమా? నేనా కారణం?.. భారత్‌లోకి అడుగుపెట్టాక వాళ్లను చుట్టుముట్టే స్వార్థపూరిత పొగడ్తలు, తప్పుడు ధోరణులు వారిని దిగజారుస్తున్నాయి. ఆ స్థితిలో మనలో చాలామంది కూడా అలాగే అవుతారు. కొన్నిసార్లు నిందను తీసుకోవటం మంచిది. మనం స్వయంపాలనను అందుకోవాలంటే, నిందను స్వీకరించక తప్పదు. మనకు స్వయంపాలనను పళ్లెంలో పెట్టి అందించటమనేది ఎప్పటికీ జరగదు. బ్రిటీష్ సామ్రాజ్య, బ్రిటీష్ దేశ చరిత్రను చూడండి. స్వేచ్ఛను ప్రేమిస్తుంది, కానీ తమంతట తాము స్వేచ్ఛను తీసుకోలేనివారికి మాత్రం స్వేచ్ఛను ఇవ్వదు. కావాలంటే బోయర్ యుద్ధం నుంచి పాఠం నేర్చుకోండి. కేవలం కొన్ని సంవత్సరాల క్రితం వరకు ఆ సామ్రాజ్యానికి శత్రువులుగా ఉన్నవారు ఇప్పుడు స్నేహితులుగా మారారు....

(ఈ సమయంలో వేదిక మీద ఆందోళన రేగి అంతరాయం ఏర్పడింది. దిగిపొండి అని చెప్పటంతో, గాంధీ తన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపాల్సివచ్చింది). ❍

## ఉన్నత విద్యాసంస్థల్లో 1.30 లక్షల మంది బోగస్ అధ్యాపకులు

ఉన్నత విద్యాసంస్థల్లో దేశవ్యాప్తంగా 1.30 లక్షలమంది బోగస్ అధ్యాపకులు ఉన్నట్టు తేలింది. బోధన సిబ్బంది వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేయటం వల్ల ఈ దోపిడీ బైటపడింది. దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో 14 లక్షల మంది బోధన సిబ్బంది ఉండగా, వారిలో పలు పేర్లు బోగస్‌వని ఫిర్యాదులు చాలాకాలంగా వస్తున్నాయి. అయితే ప్రభుత్వం మాత్రం ఇటీవలే స్పందించింది. సాధారణ ప్రజల కంటే అనేక రెట్లు ఎక్కువ ఆదాయాన్ని పొందే ప్రభుత్వోద్యోగుల చేత పౌర సేవల చట్టం వంటి ఏర్పాట్లతో సేవ చేయించటం కూడా చేతకాని ప్రభుత్వాలు బోగస్ ఉద్యోగులకు కూడా జీతాలిస్తూండటం అత్యంత బాధ్యతారాహిత్యమని, చట్టబద్ధ దోపిడీ అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ అన్నారు. ❍



# చైనాలో ఉంటే మార్కాపురం వంటివి ఎక్కువ అభివృద్ధిని సాధించేవి

**భా**రత్‌లో కంటే చైనాలో ఉంటే నెల్లూరు, ఒంగోలు, మార్కాపురం, చీమకుర్తి, దోర్నాల లాంటి పట్టణాలు, ఊళ్లు ఎక్కువ అభివృద్ధిని సాధించేవని జేపీ అన్నారు. ప్రజల అభివృద్ధికి కీలకమైన మునిసిపాలిటీలు, పంచాయతీలను మనదేశంలో ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారన్నారు. నియంతృత్వ దేశమైనా చైనాలో మనవద్ద కంటే స్థానిక ప్రభుత్వాలకు ఎక్కువ అధికారాలు, నిధులు ఉన్నాయన్నారు. స్థానిక నిర్ణయాల కోసం రాష్ట్ర పాలకులు, దేశ పాలకుల దాకా వెళ్లాల్సిన అవసరం అక్కడ లేదన్నారు. ఎక్కడికక్కడే ప్రజలు నిర్ణయాలు తీసుకునే మంచి ఏర్పాటు అక్కడుందన్నారు. ప్రభుత్వం చేయాల్సిన మౌలిక వసతులు, మంచి విద్య, ఆరోగ్యం వంటి పనుల విషయంలో కూడా చైనాకు మనకంటే ఎక్కువ స్పష్టత ఉందన్నారు. అందుకే ఒకప్పుడు మనకంటే వెనకబడి ఉన్న చైనా దేశం.. ఇప్పుడు మనం సమీప భవిష్యత్తులో అందుకోలేనంత ఎత్తుకు ఎదిగిందన్నారు. అక్కడ మంచి విద్య ప్రతి బిడ్డకూ అందే ఏర్పాటు ఉందన్నారు. లోక్‌సత్తా విస్తృతంగా ప్రచారం చేసిన 'పీసా' పాఠశాల విద్య సర్వేలో మనదేశానికి 74దేశాల్లో 73వ స్థానం వస్తే.. చైనా నెంబర్‌వన్‌గా నిలిచిందన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా నెల్లూరు, ప్రకాశం జిలాల్లో జేపీ పలు కార్యక్రమాలలో పాల్గొని ప్రజలతో మాట్లాడారు. జనం జీవితాల్ని ప్రభావితం చేసే మౌలిక అంశాలను ప్రస్తావిస్తూ చర్చిస్తూ పరిష్కారాలను ప్రతిపాదించారు. భాగస్వాములు కావాలని సూచించారు.

జనాభా ప్రాతిపదికన మార్కాపురం లాంటి పట్టణానికి ఏడాదికి రూ.285కోట్ల నిధుల్ని కేటాయించాల్సి ఉందని జేపీ స్పష్టంచేశారు. ఈ డబ్బే గనక ప్రజలకు స్థానిక ప్రభుత్వాల ద్వారా అందుబాటులో ఉంటే, చాలా పనులు వెంటనే పూర్తవుతాయన్నారు. అవినీతి జరిగితే వెంటనే గుర్తించి పట్టుకోవచ్చన్నారు. పైనుంచి రాష్ట్ర ప్రభుత్వం కూడా దుడ్డు కర్ర పట్టుకుని అవినీతిపరుల పదవుల్ని పీకేసి ఆస్తుల్ని జప్తు చేసి వారిని జైలుకు పంపొచ్చన్నారు. అంతేతప్ప ప్రజలకు తమను తాము పరిపాలించుకోవటం చేతకాదు, స్థానిక ప్రభుత్వాల్లో అవినీతి జరుగుతుంది అనే వంకలతో నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేయకుండా ఆపటం సహించరానిదన్నారు. ఈ ప్రజలే రాష్ట్ర, దేశ పాలకులను కూడా ఎన్నుకుంటున్నారని, పైన జరిగే అవినీతి కంటే దిగువన తక్కువ జరిగే అవకాశముందని అన్నారు. కేంద్రం, రాష్ట్రం పెత్తనం వల్ల ప్రజల రోజువారీ జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని, తాము పన్నుల రూపంలో కట్టిన డబ్బు, తమ పేరు మీద తెచ్చిన అప్పులను ఎలా ఖర్చు చేస్తున్నారో వారికి అర్థం కూడా కావటం లేదని అన్నారు. అధికార వికేంద్రీకరణతో స్థానిక ప్రభుత్వాలను బలోపేతం

**జన్మభూమి కమిటీల్లా కేంద్రం స్వచ్ఛభారత్ కమిటీలు వేస్తే ఊరుకుంటారా?**

రాష్ట్ర ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో స్థానిక ప్రభుత్వాలను ఉన్నకొద్దీ నిర్వీర్యం చేయాలని చూస్తోందని జేపీ అన్నారు. జన్మభూమి కమిటీలతో రాష్ట్రం స్థానిక ప్రభుత్వాల పట్ల వ్యవహరిస్తున్నట్టు.. కేంద్రం కూడా స్వచ్ఛభారత్ కమిటీలు వేసి రాష్ట్రాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తే ముఖ్యమంత్రి ఊరుకుంటారా? అని ప్రశ్నించారు.

### భూములపై హక్కు ప్రయత్నం మంచిదే

భూములకు రిజిస్ట్రేషన్‌తోపాటు హక్కు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న ఆటోమ్యూటేషన్ కార్యక్రమం మంచిదేనని, అయితే భూములను సమగ్రంగా సర్వే చేయించి దూరదృష్టితో పారదర్శకంగా వ్యవహరించినప్పుడే విజయవంతమవుతుందని జేపీ అన్నారు. రాష్ట్రంలో సర్వే సెటిల్‌మెంట్ జరగాలన్నారు. స్వతంత్రం వచ్చి 70ఏళ్లు దాటినా ఇంతవరకూ భూసర్వే జరగకపోవడం వల్ల భూములకు సంబంధించి అనేక వివాదాలు కొనసాగుతున్నాయన్నారు. కలెక్టరేట్‌ను వేరొకరి పేరున రిజిస్ట్రేషన్ చేస్తున్నా అడిగేవారు లేరన్నారు.

చేస్తేనే పరిపాలన గాడిన పడి, పన్నుల డబ్బు సద్వినియోగ మవుతాయన్నారు. ప్రభుత్వం పన్నుల రూపంలో వసూలు చేస్తున్న డబ్బులో మౌలిక వసతులకు వెచ్చిస్తే చిన్న పట్టణాలు అభివృద్ధి చెందుతాయన్నారు. విద్య, ఆరోగ్యం, చిన్న పట్టణాల అభివృద్ధితో అందరికీ ఉపాధి అవకాశాలు లభించి ఎదిగే అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఈ లక్ష్యాల సాధన కోసమే సురాజ్య యాత్రను ప్రారంభించా మన్నారు. విద్య, ఆరోగ్యం, మహిళలకు రక్షణ, లంచాల్లేని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత, వ్యవసాయంలో లాభాలు అంశాలతో వెంటనే అమలు చేయగల పరిష్కారాలను ప్రజల భాగస్వామ్యంతో పార్టీలకతీతంగా సాధించేందుకు ఈ యాత్ర ద్వారా కృషి చేస్తున్నామన్నారు.

లోక్‌సత్తా ఉద్యమ ఏపీ, తెలంగాణ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి కల్లూరి బాలసుబ్రమణ్యం, సీఏ ప్రసాద్, అల్లు శివరమేష్ రెడ్డి, రఫీ, అహ్మద్, రాజగోపాల్‌రెడ్డి, ప్రజాసైన్స్ కార్యదర్శి మాల్యాద్రి, బుచ్చిరాజు, నారాయణ, శ్రీనివాసులు, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ❍

## వంతెన కట్టండి




చిలకలూరిపేట పట్టణంలో బ్రహ్మంగారి గుడి వద్ద ఓగేరు వాగుపై వంతెన నిర్మాణం చేయాలని కోరుతూ లోక్‌సత్తా నేతలు గుంటూరు కలెక్టర్ కార్యాలయానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రి ప్రత్తిపాటికి, స్థానిక అధికారులకు విజ్ఞాపనలు అందచేశామని, జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా ఇప్పుడు తీసుకొస్తున్నామని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు మాదాసు భానుప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్ గ్రీవెన్స్‌సెల్‌లో వినతిపత్రాన్ని అందించారు. ఓగేరు వాగుకు అవతలివైపున ఉన్న పొలాల్లో పనులు చేసుకునేందుకు పట్టణానికి చెందిన రైతులు మూడు కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని, బ్రహ్మంగారి గుడి ప్రాంతంలో బ్రిడ్జి వల్ల వందలమంది రైతులు, రైతు కూలీలకు ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. లోక్‌సత్తా పార్టీ చిలకలూరిపేట నియోజకవర్గ నాయకులు మురికిపూడి ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, కృష్ణప్రసాద్, సుబ్బారెడ్డి, బి.వెంకటకృష్ణ, ఎం.సాంబయ్య, కె.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల సురాజ్య యాత్రలో జేపీ కూడా ఈ వంతెన కట్టాలని స్పష్టంచేశారు. ❍



# స్థానిక అధికారాలు లేకపోతే దోమల్ని కూడా ఏం చేయలేం!

దోమలు లేకుండా చేసుకోవటానికి కూడా తగిన నిధులు, అధికారాలు కడప నగరంలో లేవని జేపీ అన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా కడప మునిసిపల్ స్టేడియం, ఇండోర్ స్టేడియంలలో జేపీ కలియతిరిగారు. హాకీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో మాట్లాడారు. వాకింగ్ చేస్తున్న వారిని పలకరించి సురాజ్య గొడవను ఆహ్లాదకరంగా వివరించి వారి మద్దతును పొందారు. కాసేపు షటిల్ ఆడి ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. స్టేడియం విస్తీర్ణం మరింత పెరగాల్సిన అవసరముందని, క్రీడాకారులు శిక్షణా సమయంలో గాయపడకుండా తగు ఏర్పాట్లు చేయాలని అభిప్రాయపడ్డారు.

తాను రాత్రి బస చేసిన కడప ఆర్ అండ్ బీ వసతి గృహంలో దోమల బాధను జేపీ ఈ సందర్భంగా ఏకరువు పెట్టారు. చాలా సమయం నిద్రపోకుండా దోమలవేటలో గడిపానని, ఆదమరిచి నిద్రించినప్పుడు కుట్టిన దోమల వల్ల దిండు రక్తసిక్తమైందని అన్నారు. పొద్దున్నే లేచాక.. ఎలా నిద్రపోయావని కారు డ్రైవర్‌ను అడిగితే మంచి నిద్రే పట్టిందని చెప్పాడని, దోమలు కుట్టలేదా అంటే మౌనం వహించాడని అన్నారు. ఏ జ్వరమో వచ్చి సురాజ్య యాత్ర ప్రయాణాలకు ఆటంకం వస్తుందని తాను భయపడుతున్నానని, ఇలాంటి సమస్యలన్నిటికీ మూలం అధికార కేంద్రీకరణ పాలనా వ్యవస్థలో ఉందని అన్నారు.

స్థానికంగా చిన్న చిన్న పనులకు కూడా ఉన్నతాధికారులు, మంత్రులు, ముఖ్యమంత్రి, ఎంపీలు, ప్రధానమంత్రి అంటూ బతిమిలాడుకోవాల్సి వస్తోందని, మన వెనకబాటుతనానికి అధికార కేంద్రీకరణ కూడా పెద్ద కారణమని జేపీ స్పష్టంచేశారు. మనం పన్నుల రూపంలో కట్టే డబ్బులో కనీసం సగం స్థానికంగా వినియోగమయ్యే ఏర్పాటు ఉండాలన్నారు. ఇలాంటి ఏర్పాట్లు ఉంటే దోమల దగ్గర్నుంచి అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, లంగ్‌స్పేస్‌లలాంటి క్రీడామైదానాలను చక్కగా అభివృద్ధి చేసుకోవచ్చని, పిల్లలు, పెద్దలకు మంచి ఆరోగ్యాన్ని అందించవచ్చని అన్నారు. కడప నగరంలో ఉన్న నాలుగు లక్షల జనాభా పేరు మీద రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.1200 కోట్లు ఖర్చు చేస్తోందని, అందులో సగం డబ్బుని సోమశిల, పోలవరం వంటి ప్రాజెక్టులకు, రహదారుల నిర్మాణం వంటి వాటి కోసం రాష్ట్ర ప్రభుత్వం తన వద్ద అట్టిపెట్టుకుని, మిగిలిన రూ.600 కోట్లను కడపలో స్థానిక ప్రభుత్వాలకు, ప్రజల కమిటీలకు ఇచ్చేయాలని అన్నారు. ఇందుకోసమే సురాజ్య యాత్ర చేస్తున్నామని చెప్పారు.

స్థానికంగా కేటాయింపులు ఉంటే.. ఏ పనికి ఎంత ఖర్చవుతుంది, ఎవరు అవినీతికి పాల్పడుతున్నారు స్పష్టంగా తెలుస్తుందని జేపీ అన్నారు. చైనా లాంటి దేశంలో కూడా చాలా పనులు స్థానికంగానే అయిపోతాయన్నారు. చైనాలో కడప లాంటి నగరం ఉంటే.. అక్కడ ఏదైనా నిర్మించాలంటే ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి లాంటి వారి దగ్గరకు వెళ్లాల్సిన పని ఉండదని, నగరంలోనే అన్ని అనుమతులూ నిర్ణీత వ్యవధిలో వచ్చేస్తాయని అన్నారు. మంచి విద్య, ఆరోగ్యం, లంచాల్లేని సేవలతోపాటు స్థానికంగా తమ వనరులు తమ వద్దే ఉండాలని ప్రజలు, ముఖ్యంగా యువత కోరాలన్నారు. తమ కెరీర్‌లను చూసుకుంటూనే సమాజం కోసం కొంత సమయం వెచ్చించేందుకు, సరైన దిశలో పరిష్కారాల్ని సాధించేందుకు యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదు కావాలని సూచించారు.

పౌరసమాజ నేతలు, పీఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మారంరెడ్డి శ్రీకాంత్, లోక్‌సత్తా, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ❍



# వెయ్యికి ఒక్క రూపాయి ఇస్తున్నారు!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక్కో పౌరుని పేరు మీద ఏడాదికి రూ. 30,000 ఖర్చు చేస్తోందని, కానీ అందులో రూ. 32 మాత్రమే నిజంగా ప్రజలుండే స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేస్తోందని జేపీ అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు నిధుల బదిలీ కోసం గతంలో ఎన్టీరామారావు, బిజూపట్నాయక్, కరుణానిధి, ఫరూక్ అబ్దుల్లా వంటి వారు పోరాడారని, వారు ఆశించినదానికన్నా ఇప్పుడు ఎక్కువ వస్తోందని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో నుంచి రాష్ట్రాలకు 51 శాతం నిధులు వస్తున్నాయన్నారు. కానీ రాష్ట్రానికి వచ్చిన నిధుల నుంచి స్థానిక ప్రభుత్వాలకు వెయ్యికి ఒక్క రూపాయి మాత్రమే బదిలీ అవుతున్నాయన్నారు. ఈ పరిస్థితి మారాలన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా జేపీ అనంతపురం జిల్లాలో పలు కార్యక్రమాల్లో యువత, రైతులు, ఇతర ప్రజలతో మమేకమయ్యారు. సురాజ్య లక్ష్యాలైన విద్య, వైద్యం, లంచాల్లేని ప్రభుత్వ కార్యాలయాలు, వ్యవసాయం, చట్టబద్ధపాలన, స్థానిక ప్రభుత్వాలు తదితర అంశాల మీద వారికి వివరాలు చెబుతూ, సమస్యలకు పరిష్కారాలను వింటూ, వివరిస్తూ మార్పు దిశగా వారిని చైతన్యవంతుల్ని చేశారు.

ప్రభుత్వాలు రోజుకు దేశవ్యాప్తంగా రూ. 11,000 కోట్లు ఖర్చు చేస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క పౌరుని మీదా ఏడాదికి రూ. 30,000 ఖర్చు చేస్తున్నా సాధారణ సేవలు కూడా సక్రమంగా అందటం లేదని జేపీ అన్నారు. అనంతపురం ప్రజల అవసరాలను అమరావతిలోనో, ఢిల్లీలోనే నిర్ణయిస్తే ఇలాగే జరుగుతుందన్నారు. ఇక్కడి అవసరాలేమిటో అక్కడెక్కడో కూర్చున్నవారికి స్పష్టంగా తెలియవని, వాళ్లేదో దైవదూతల్లా మనకు సాయం చేసే లోగా కొత్త సమస్యలు వస్తాయని అన్నారు. ప్రభుత్వంలో ఎవరేం చేస్తున్నారో అర్థంకాని పాలన నడుస్తుందన్నారు. దీన్ని మార్చాలంటే రాష్ట్ర ప్రభుత్వం చేసే ఖర్చులో సగం స్థానికంగా ప్రజలుండే గ్రామాలకు, పట్టణాలకు రావాలన్నారు. అంటే ఒక్కో పౌరుని పేరు మీదా రూ. 15,000ను స్థానిక స్థాయికి బదిలీ చేయాలన్నారు. అలా అనంతపురం నగరానికే ఏడాదికి రూ. 600కోట్లు రావాలన్నారు. మిగిలిన రూ. 600కోట్లు రాష్ట్రం ఇతర ఖర్చులకు తన వద్ద అట్టిపెట్టుకోవచ్చన్నారు. స్థానికంగా పంచాయతీలకు, మునిసిపాలిటీలకు 10శాతం నిధులను కేటాయించటంతో మొదలుపెట్టినా అనంతపురం నగరానికి రూ. 120 కోట్లు వస్తాయన్నారు. ఈ డబ్బు ఉంటే, రోడ్లు, వీధిదీపాలు, పాఠశాలలు, పారిశుద్ధ్యం, ఆసుపత్రులు వంటి రోజువారీ పనుల నిర్వహణ కోసం పైస్థాయిలో ఉన్న అధికారులు, నేతల కోసం ఎదురుచూడకుండానే వెంటనే స్థానికంగానే చేసేసుకోవచ్చన్నారు. ఇక్కడ అవినీతి జరిగితే చర్యలకు పైన దుడ్డుకర్ర పట్టుకోవచ్చన్నారు. ఇందుకోసం జిల్లాలో ఉన్నతాధికారి వ్యవస్థను ఏర్పాటు చేయవచ్చన్నారు. ఊహించటానికే అద్భుతంగా ఉన్న ఈ మార్పు.. పూర్తిగా ఆచరణసాధ్యమన్నారు. ఒక్క కలంపోటుతో చేసేయొచ్చన్నారు.

మన పన్నుల డబ్బుతోనే ప్రభుత్వాలు నడుస్తాయి తప్ప పాలకులెవ్వరూ జేబుల్లో నుంచో, తమ బ్యాంకు ఖాతాల్లో నుంచో ఇవ్వరని, అందుకే ప్రతి రూపాయినీ సద్వినియోగం చేసుకోవమెలాగో ప్రజలు, ముఖ్యంగా యువత తెలుసుకోవాలన్నారు. ఇందుకోసమే సురాజ్య యాత్ర అన్నారు. లోక్‌సత్తా నేతలు రామ్మోహనరావు, బాబ్జీ, బాబు, రెడ్డెప్ప, శ్రీనివాసులు, కొండయ్య, శ్రీనాథ్, నాగరాజు, నిజాంవలి, అమర్‌నాథ్, అమర్‌యాదవ్, నాగరాజు, సుధాకర్, మధు, సత్యనారాయణ, గోవిందు, ఆదిశేషు, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ❍

## పై నుంచి ఫోన్ రాని పోలీస్ స్టేషన్ లేదు

రోజూ ఏదో ఒక కేసుకు సంబంధించి పైవారి నుంచి ఫోన్ రాని పోలీస్ స్టేషన్ రాష్ట్రంలో లేదని జేపీ అన్నారు. చట్టబద్ధపాలన అంటే ఇది కాదన్నారు. పోలీసులు గొడ్డునుబాదినట్టు బాది ఒప్పించే నేరాలను మినహాయిస్తే, కేవలం నూటికి ఆరు కేసుల్లోనే శిక్షలు పడుతున్నాయన్నారు. పౌరసేవల చట్టం తెచ్చి పోలీసు స్టేషన్లలోనూ అమలు చేయాలన్నారు. నేరపరిశోధనను రాజకీయాల నుంచి వేరు చేయాలన్నారు.

## డొక్కపగలగొట్టి మరీ పన్నులు పిండుతున్నారు.. సేవలేవీ?

"జీఎస్టీ అని, అదని, ఇదని ప్రజల నుంచి రకరకాల రూపాల్లో డొక్కపగలగొట్టి మరీ పన్నుల డబ్బు వసూలు చేస్తున్నారు. తప్పించుకుంటే ఖబడ్దార్ అని బెదిరించి మరీ లాక్కుంటున్నారు. కానీ అందుకు తగ్గ సేవలేవీ?.. చదువు సరిగా ఉండదు, ఆరోగ్యం అందదు, మహిళలకు భద్రత లేదు, వ్యవసాయం చేయటమే పాపం, లంచాల్లేని ప్రభుత్వ కార్యాలయముండదు, చిన్న పనికి కూడా కమిషనర్, ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి దాకా వెళ్లాలి.. ఇంకెందుకు ప్రజలు కట్టాలి పన్నులు?.. మీ జీతాలు, మీ సౌకర్యాలు, విలాసాల కోసమా పన్నులు కడుతున్నది? పరిపాలన అంటే దోచుకోవడమా?" అని జేపీ ప్రశ్నించారు.

# ధరలు మన ఇష్టమొచ్చినట్టు ఉండాలనటానికి.. రైతులేమన్నా మన బానిసలా?



పంటలకు ధరలు వచ్చే అవకాశాలకు గండికొడుతూ రైతులను అప్పుల ఊబిలోకి నెడుతున్నది పాలకులేనని జేపీ అన్నారు. మార్కెట్‌లో కూరగాయల ధరలు పెరిగాయని ఆత్మహత్యలు చేసుకున్నవారు లేరని, కానీ పండించిన పంటలకు ధరలు రాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ఉల్లిపాయలు, టమాటాల ధరలు పెరిగితే గగ్గోలు పెడుతూ కూరగాయల దండలతో ఆందోళనలు చేస్తుంటారని, పంటల ధరల్ని మన ఇష్టమొచ్చినట్టు నిర్ణయించుకోవటానికి రైతులేమన్నా మన బానిసలా? అని ప్రశ్నించారు.

కర్నూలు జిల్లా ఆదోని వ్యవసాయ మార్కెట్‌లో సురాజ్య యాత్రలో భాగంగా రైతులతో జేపీ మాట్లాడారు. పత్తి, వేరుసెనగ ఉత్పత్తిదారుల కష్టసుఖాలను పంచుకున్నారు.

ఎర్రగుడి గ్రామానికి చెందిన రైతు అశోక్ మాట్లాడుతూ, తనకు ఐదెకరాల పొలం ఉండగా అప్పుల వల్ల రెండెకరాలు అమ్ముకున్నానని తెలిపారు. మూడు ఎకరాల్లో వేరుసెనగ వేస్తే ఎకరాకు రూ.20వేలు ఖర్చయ్యాయని, పంట అమ్మకానికి తెస్తే ఎకరాకు రూ.10వేలు కూడా రావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆ తర్వాత పత్తి మార్కెట్‌కు జేపీ వెళ్లారు. ఈ ఏడాది పత్తి పంట బాగా దెబ్బతిందని, అయినా డిమాండ్ లేదని రైతులు వాపోయారు. మార్కెట్‌కు తెస్తే గిట్టుబాటు ధర కూడా లేదన్నారు. దీని వల్ల అప్పులే మిగిలాయన్నారు. ఈ విషయాల్ని చెబుతూ పలువురు రైతులు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇతర వర్గాలకు భిన్నంగా ప్రత్యేకించి రైతుల కోసం ప్రభుత్వాలు చేయాల్సింది ఏమీ లేదని, వారికి ఆదాయం వచ్చే మార్గాలకు గండికొట్టకుండా ఉంటే చాలని జేపీ అన్నారు. వ్యవసాయ విధానాలను మార్చి.. రైతులకు ఆదాయం చుట్టూ వాటిని తిప్పేందుకే సురాజ్య యాత్ర చేస్తున్నామన్నారు. విధానాలను మారిస్తే రైతులకు ఆదాయం ఎలా పెరుగుతుందో 2010-11లో లోక్‌సత్తా రైతు సంఘాలతో కలిసి చేసిన ఉద్యమాలే రుజువు చేశాయన్నారు. రైతులు కులాలు, పార్టీల్ని పక్కనపెట్టి కాస్త అవగాహనతో కలిసివస్తే కచ్చితంగా ప్రభుత్వాల విధానాల్ని మార్చగలమన్నారు. తన వంతు పూర్తి సహాయసహకారాల్ని రైతులకు అందిస్తానన్నారు. కేవలం వ్యవసాయంలో ఆదాయాన్ని పెంచటం కోసమే కాకుండా.. విద్య, ఆరోగ్యంలో మార్పు కోసం కూడా సురాజ్య యాత్ర ద్వారా కృషి చేస్తున్నామని, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు లేకుండా చేయటానికి విధానాల్ని ప్రతిపాదిస్తున్నామని, ఇవన్నీ కూడా రైతులకు మేలు చేసేవేనని అన్నారు. పట్టాదారు పాసుపుస్తకాన్ని లంచం లేకుండా తెచ్చుకున్నవారు ఒక్కరన్నా ఉన్నారా? అన్న ప్రశ్నకు అందరూ లంచం ఇచ్చామనే చెప్పారు.

రైతులు బాగుంటేనే వ్యవసాయం బాగుంటుందని, దేశ జనాభాల్లో సగానికిపైగా ప్రజలు ఈ రంగం మీద ఆధారపడినా పాలకులు కదలకపోవటం దారుణమని జేపీ అన్నారు. గత మూడేళ్లలోనే పాలకుల ఎగుమతులు, దిగుమతుల విధానాల వల్ల రైతులకు రూ.4లక్షల కోట్లకు పైగా నష్టం వాటిల్లిందన్నారు. రెండు లక్షల జనాభా ఉన్న ఆదోని పట్టణంలోని ప్రజల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రూ.600కోట్లు ఖర్చు చేస్తోందని, కానీ చిన్న సమస్యలు కూడా పరిష్కారం కావటం లేదని అన్నారు. ఆ డబ్బంతా ఎక్కడి పోతోందని ప్రశ్నించారు. రైతుల పేరుతో ఏడాదికి రూ.2,500కోట్ల సెస్సు వసూలు చేస్తున్నారని, కానీ ధరలు పడిపోతే ఒక్క నాయకుడు కూడా కనిపించడని అన్నారు. రైతుల పేరుతో వసూలు చేసిన డబ్బును, రుణమాఫీ వంటి పథకాల డబ్బును కలిపి ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలన్నారు. రైతులు ఐక్యంగా, ఆత్మవిశ్వాసంతో, ఆలోచనతో కదలాలని, యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో మొబైల్ ద్వారా నమోదైతే నిరంతరం కలిసి పనిచేయవచ్చని సూచించారు.

అట్లా నాయకులు ఆదినారాయణరెడ్డి, రవిచంద్ర, శ్రీనివాసులు, డేవిడ్, అంజి, రైతు సంఘం నాయకుడు కృష్ణారెడ్డి, లోక్‌సత్తా 2.0 ఉద్యమ సంస్థ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ❍

# ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన జేపీ చర్చా గోష్ఠి

- అవినీతిరహిత పాలన అందినప్పుడే ప్రజాస్వామ్యం, అభివృద్ధి
- సామాన్యులకు విద్య, ఆరోగ్యం చేరువ కావాలి
- కులం, మతం పేరుతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారు
- హార్దిక్ పటేల్ మద్దతు కోసం జాతీయ పార్టీలు ఎగబడటం.. రిజర్వేషన్లను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకోవటంలో భాగమే
- ఎవరో వస్తారని యువత ఎదురు చూస్తూ కూర్చోకూడదు, ప్రజల ఆకాంక్షలకు తగ్గ విధానాల అమలుకు ప్రభుత్వాలూ చొరవ చూపాలి: జేపీ



దేశంలో అవినీతిరహిత పాలన వచ్చినప్పుడే అన్ని విధాలా అభివృద్ధి సాధ్యమవుతుందని జేపీ అన్నారు.

కడప జిల్లా రాజంపేట బోయినపల్లిలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సురాజ్య యాత్ర కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు. విద్యార్థులతో పలు అంశాలపై, సమస్యలపై చర్చించి పరిష్కారాలను ప్రతిపాదించారు.

జేపీ మాట్లాడుతూ, నిరుద్యోగులకు 45 ఏళ్ల వరకు నిరుద్యోగ భృతి ఇస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెబుతుంటే, 45 ఏళ్ల తర్వాత పింఛను ఇస్తానని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ చెబుతున్నారని, నిరుద్యోగ భృతి-పింఛను-పక్కనే బ్రాందీ షాపు ఫార్ములాతో ప్రజల్ని నాశనం చేసే రాజకీయం కొత్త రంగు పులుముకుంటోందని అన్నారు. దీనికితోడు కులం, మతం పేరుతో ప్రజల్ని చీలుస్తున్నారన్నారు. గుజరాత్‌లో హార్దిక్ పటేల్ అండ కోసం జాతీయ పార్టీలు ఎగబడ్డాయంటే.. రిజర్వేషన్లను ఓటు బ్యాంకు రాజకీయాలకు వినియోగించాలనుకోవటమే కారణమన్నారు. దేశంలో అత్యధిక సంఖ్యాక ప్రజలకు సరైన విద్య అందించకుండా ఒక కులాన్ని మరో కులంపైకి, ఒక మతాన్ని మరో మతంపైకి ఎగదోస్తూ ఓట్లు దండుకుంటున్నారన్నారు. దేశంలో పాఠశాల విద్య అధ్వాన్నంగా ఉందన్నారు. విద్యాహక్కు చట్టం వల్ల ప్రజల జేబులకు ఇంకా చిల్లులు పడుతున్నాయని, ప్రభుత్వ పాఠశాలల్ని పోషించటానికి పన్నులు కడుతూ, మరోపక్క తమ పిల్లల్ని ప్రైవేటు పాఠశాలల్లో చదివించటానికి ఫీజులు చెల్లిస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలలో ఒక్కో విద్యార్థి మీదా ఏడాదికి రూ. 60,000 ఖర్చు చేస్తున్నా సరైన చదువు అందటం లేదన్నారు. జనం సొమ్ము ఇంత వృధాగా పోతున్నా, భావితరాలకు చదువు రాకపోతున్నా పాలకులు, అధికారులకు మాత్రం పట్టటం లేదన్నారు. వారికి విద్యావ్యవస్థ పునాదులు, ప్రణాళికల కన్నా అమరావతి పునాదులు, డిజైన్లే ఎక్కువైపోయాయన్నారు. మహిళల రక్షణకు చట్టబద్ధపాలన కొరవడిందన్నారు. పోలీసులు చట్టాన్ని పరిరక్షించటం కంటే నాయకుల ఇళ్ల వద్ద, కార్యక్రమాల వద్ద బందోబస్తుల కోసమే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారన్నారు. పోలీసు ఉద్యోగమంటే లాంగ్‌జంప్, హైజంప్ కాదని, చట్టాన్ని, న్యాయాన్ని పరిరక్షించేలా సమర్థంగా వ్యవహరించటమని, ఈ స్పృహ ఇప్పటికీ మనదేశంలో లేదని అన్నారు.

ప్రజలు, ముఖ్యంగా యువత ఆలోచనతో, అవగాహనతో పోరాటాలు చేస్తే ప్రభుత్వాలు స్పందించకతప్పదని, లోక్‌సత్తా ఇదే రీతిలో 3 రాజ్యాంగ సవరణల్ని, ఐదారు చట్టాలను, పలు విధాన మార్పులను సాధించిందని జేపీ వివరించారు. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడకుండా యువత స్పందిస్తుండాలన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు జేపీ తనదైన శైలిలో ఇచ్చిన సమాధానాలు అందరినీ ఉత్తేజపరిచాయి.

ప్రజలను సోమరిపోతులుగా చేయటం తప్ప తమ కాళ్ల మీద తాము నిలబడేలా చేయటానికి నాయకులు ప్రయత్నించటం లేదని జేపీ అన్నారు. చెప్పుకోదగిన ఓ 50దేశాలతో పోలిస్తే మనదేశం 48వ స్థానంలో ఉందన్నారు. ఇతర దేశాల్లో మాదిరిగా మనదేశంలో చట్టబద్ధపాలన లేదన్నారు. కేసులు తీసేయండి, కేసులు పెట్టండి

అని నాయకుల నుంచి పోలీసులకు ఫోన్‌లు రావటం మనదేశంలోనే చూస్తామన్నారు.

**విద్యార్థులు అడిగిన మరికొన్ని ప్రశ్నలకు జేపీ జవాబులు :**

**(?) జీవితంలో మీరు కోల్పోయినవి, సాధించనివి ఏమైనా ఉన్నాయా**

జేపీ: జీవితంలో వ్యక్తిగతంగా కోల్పోయిన అంశాలు ఏమీ లేవు. అయితే అప్పుడున్న పరిస్థితుల్లో ఐఏఎస్ కావడం ద్వారా దేశంలో మార్పు తేవచ్చని ఆశించాను. అందుకే వైద్యవృత్తి నుంచి ఐఏఎస్‌కు వెళ్లాను. నర్సీపట్నంలో సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో ఓ చిన్న ఉద్యోగి తన మనవడిని చదివించు కోవడానికి నా కాళ్ల మీద పడటంతో చాలా బాధపడ్డాను. ఇంతటి దేశంలో చదువుకోవడానికి ఇంత బాధపడాలా అని సిగ్గుతో తలచుకుని వేదన చెందాను.

**(?) 99శాతం మంది డబ్బులకు, మద్యానికి అమ్ముడు పోతున్నారు. కారణం ఏమిటి**

దేశంలో 99శాతం మంది డబ్బు, ఇతరత్రా ప్రలోభాలకు లంగి తమ అమూల్యమైన ఓట్లను పనికిరాని రాజకీయ పార్టీలకు, నేతలకు వేస్తున్నారనే ఉద్దేశంతోనే 1996లో లోక్‌సత్తా ఉద్యమాన్ని, ఆ తర్వాత పార్టీని ఏర్పాటు చేశాం. అయితే అనుకున్న స్థాయిలో ఓట్ల పట్టును సాధించకపోవటంతో ఎన్నికల్లో పోటీ నుంచి వైదొలిగాం. ఓటర్లలో కనీసం 10శాతం మంది నిలకడగా లోక్‌సత్తాకు ఓట్లు వేసినా రాజకీయ వ్యవస్థను మార్చగలిగేవాళ్లం. కానీ మహానగరాల్లో 10శాతం ఓట్లు ఉన్నా, పట్టణాల్లో 4శాతం, గ్రామస్థాయిలో 1శాతమే లోక్‌సత్తాకు వస్తున్నాయి. ఇప్పుడు సురాజ్య యాత్ర కూడా మరోరూపంలో వ్యవస్థను మార్చటానికే.

**(?) ఇంత ఖర్చు చేస్తున్నా పేదవాడికి అన్నం దొరికే పరిస్థితి లేదు. కారణం ఏమిటి**

వ్యక్తిగత జీవితంలో ప్రభుత్వాలు సాయం చేయటమంటే ప్రజల్ని మోసం చేయటమే. ప్రభుత్వాలు విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, చట్టబద్ధపాలన, లంచాల్లేని సేవలు వంటి ఉమ్మడి అవసరాలను సరిగా తీరిస్తే.. వ్యక్తిగతంగా అందరికీ ఎదిగే అవకాశాలు వాటంతటవే వస్తాయి. కానీ ఆ పనిచేయకుండా, అందరికీ చేస్తున్నట్టు పాలకులు నటిస్తూ ఓట్లు కొట్టేస్తున్నారు. సమస్య మాత్రం తీరటం లేదు. ఈ ఉచ్చులో మనం చిక్కుకోకూడదు. ఎన్ని చేసినా ఇతరుల మీద ఆధారపడే పరిస్థితుల్లో కొద్దిమంది ఎప్పుడూ ఉంటారు. వారికి ఉచితంగా ఇచ్చినా మనం అభ్యంతరం చెప్పనక్కర్లేదు.

**(?) విద్యావ్యవస్థ అంత దారుణంగా ఉంది. పరిష్కారమేంటి**

విద్య, వైద్య వ్యవస్థలు రాష్ట్రంలో, దేశంలో అత్యంత దారుణంగా ఉన్నాయి. దీంతోపాటు రిజర్వేషన్‌ను కూడా రాజకీయ నేతలు జటిలం చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్, ఐపీఎస్‌ల పిల్లలకు ఆయా కులాల్లో రిజర్వేషన్లు లేకుండా చేయాలి. అలాగే పేదరికం వల్ల అవకాశాలు అందనివారికి కొంత వెసులుబాటు కల్పించాలి. విద్య, వైద్యరంగాల్లో లోక్‌సత్తా సమగ్ర పరిష్కారాలను ఎఫ్‌డీఆర్‌ఇండియాడాటార్గ్‌లో చూడవచ్చు.

కళాశాల వైస్ ఛైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్ఎంవి నారాయణ, కో ఆర్డినేటర్ ప్రసాద్, పీపుల్ అగనెస్ట్ కరప్షన్ వ్యవస్థాపకుడు ఎం.శ్రీకాంత్‌రెడ్డి, హైకోర్టు న్యాయవాది జగన్నాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుబ్బారెడ్డి, లోక్‌సత్తా నేతలు బండారు రామ్మోహనరావు, ఎల్. సతీష్ కుమార్, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ❍

# క్రమశిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం కీలకం



విద్యార్థులు అడిగి మరీ ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవటం నేర్చుకోవాలని, అప్పుడే విద్య పట్టుబడుతుందని జేపీ అన్నారు. క్రమశిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం ఉంటే ఉపాధి నైపుణ్యాలు లభిస్తాయని, మానసిక వికాసంతో సంతోషంగా జీవించగలరని అన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా కడప శంకరాపురంలోని శాంతినికేతన్ పాఠశాలను జేపీ సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు.

1/3, 1/4లో ఏది పెద్దది అని జేపీ ప్రశ్నించగా పలువురు విద్యార్థులు వెంటనే సమాధానం చెప్పలేకపోయారు. ఉపాధ్యాయుల నుంచి వెంటపడి చదువును నేర్చుకోవాలని, అలాగే చుట్టూ ఉన్న సమాజంలో సమస్యలకు నేర్చుకున్న జ్ఞానాన్ని పరిష్కారంగా ఉపయోగించుకోవటం అలవరచుకోవాలని జేపీ ఈ సందర్భంగా సూచించారు.

పాఠశాల కరస్పాండెంట్ ఎలియాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సావిత్రి, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, లోక్‌సత్తా ఉద్యమ ఏపీ, తెలంగాణ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, పీపుల్ అగనెస్ట్ కరప్షన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం. శ్రీకాంత్‌రెడ్డి, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ❍

# చిన్నేరు చిన్నబోతోంది..
# సేద్యం ఎండిపోతోంది!



**చి**న్నేరు, దబ్బలగుట్టపల్లె జలాశయ నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని జేపీ డిమాండ్ చేశారు. ఎన్నికలప్పుడు హామీ ఇచ్చి గెలిచాక ఏరు దాటాక తెప్ప తగలేసినట్టు వ్యవహరిస్తున్నారన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా చిత్తూరు జిల్లా తంబళ్లపల్లెలో పర్యటించిన జేపీ.. చిన్నేరు జలాశయం నిర్వాసితుల కష్టనష్టాల్ని, చేనేత కార్మికుల బాధల్ని, వ్యవసాయరంగం తీరుని పరిశీలించారు.

గత ఏడేళ్లలో ఐదుసార్లు చిన్నేరు జలాశయం నిండినా ఆయకట్టులో సెంటుభూమి సాగు కాలేదని రైతులు ఈ సందర్భంగా జేపీకి తెలిపారు. నిర్మాణంలో నాణ్యత లోపించి కాలువల్లో నీరు పారే పరిస్థితి లేదన్నారు.

కాలువల భూముల నిర్వాసితులకు ఇప్పటికీ పరిహారం అందలేదని గుండ్లపల్లె గ్రామ రైతులు ఈ సందర్భంగా జేపీకి మొరపెట్టుకున్నారు.

మండలంలోని 1000కుటుంబాలకుపైగా ఉన్న చేనేత కార్మికుల కష్టాలను ఎవరూ పట్టించుకోలేదని, మౌలిక సదుపాయాలు, ఆరోగ్య కార్డులు, పక్కా గృహాలు, 'ముద్ర' రుణాలు, ఇతర రాయితీ రుణాల మంజూరులో నిర్లక్ష్యం జరుగుతోందని కార్మికులు జేపీకి వివరించారు.

నియోజకవర్గాన్ని కరవు ఛాయలు వీడకుండా కొనసాగుతున్నాయని పలువురు వాపోయారు. సమస్యల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి అన్ని విధాలా ఆదుకోవాలని జేపీకి విజ్ఞప్తి చేశారు.

జలశయాలను పరిశీలించి కాలువలు, కట్ట మరమ్మతులు, లీకేజీలను నివారించే విధంగా అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని జేపీ అన్నారు. కాలువల గేట్లను పునరుద్ధరిస్తే సుమారు 1200 ఎకరాల ఆయకట్టు త్వరగా సాగులోకి వస్తుందన్నారు. జలాశయం పనులను, మండల కేంద్రంలో విద్యుత్తు ఉపకేంద్రం, ప్రధాన రహదారి, డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల పనులను కూడా శాసనసభ్యుడు పరిశీలించి చర్యలు చేపట్టాలన్నారు. 1956లో నిర్మించిన పారిశ్రామిక శిక్షణా సంస్థ నుంచి ఏడాదికి 120మంది విద్యార్థులు బైటికి వస్తున్నారని, వారి భవిష్యత్తు దృష్ట్యా పాలిటెక్నిక్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరతానన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నేతలు, గ్రామస్తులు, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ❍

# అధిక ఫీజులతో అల్లాడుతున్నారు

**ఉ**న్నత చదువుల సంగతి అలావుంచితే, పిల్లల ఎదుగుదలకు పునాది వేసే పాఠశాల విద్యకు అధిక ఫీజులు చెల్లించలేక పేద, మధ్యతరగతి కుటుంబీకులు అల్లాడుతున్నారని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ జగన్‌మోహన్ మెట్ల అన్నారు. కాస్త చెప్పుకోదగిన దేశాల్లో ఒక విద్యార్థి చదువు మొదలుకొని ఉపాధి వరకు ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటుందన్నారు. ఉచిత చదువుతోపాటు మౌలిక వసతుల కల్పనకు అయ్యే ఖర్చులన్నీ అక్కడి ప్రభుత్వాలే భరిస్తాయన్నారు. సంపూర్ణ అక్షరాస్యత సాధించే దిశగా చర్యలంటున్న తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తాము అందిస్తున్న చదువులు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో మాత్రం గుర్తించటం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి మీద రూ. 40,000–50,000 వరకు ఖర్చు చేస్తున్నా పనికొచ్చే చదువులు అందటం లేదన్నారు. కేజీ టూ పీజీ వరకూ ఉచితవిద్య అంటూ ప్రచారం చేసి కేసీఆర్ ప్రభుత్వం చివరకు అమలులో ఘోరంగా విఫలమైందన్నారు. విద్యార్థుల ఫీజు రీఇంబర్స్‌మెంట్ విషయంలోనే రెండున్నరేళ్లపాటు నాన్చుడు ధోరణితో సర్కారు వ్యవహరించిందని, ఇప్పుడు ప్రైవేటు పాఠశాల ఫీజుల విషయంలోనూ అసమర్థంగా వ్యవహరిస్తోందని అన్నారు. సగటు మనిషి సంపాదన ఇంటి అద్దెకు, స్కూలు ఫీజులకే సరిపోతోందని, ఆరోగ్య సమస్యలు వస్తే అప్పులే గతి అవుతున్నాయని, విద్య, ఆరోగ్యాల్ని బాగుచేయలేనప్పుడు ఇక బంగారు తెలంగాణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఏమి తినాలి, ఎలా బతకాలి అనే చర్చను నిరంతరం కొనసాగిస్తూ ప్రజల్ని ఓటు వేసే యంత్రాలుగా చూసిన పాత రాజకీయ సంస్కృతినే ప్రస్తుత తెలంగాణ పాలకులు కూడా అనుసరిస్తున్నారని జగన్ అన్నారు. అందరికీ అందుబాటులో నాణ్యమైన విద్య, ఆరోగ్యం ఎజెండాను రాజకీయానికి కేంద్రబిందువు చేసేందుకు అన్ని పార్టీలూ, సమాజం ఏకాభిప్రాయంతో పనిచేయాలన్నారు. ❍

# స్థానికంగా నిధులు, పౌర సేవల చట్టం ఉంటే.. పేటకు ఇన్ని సమస్యలుండేవి కావు



కేంద్రం నుంచి రాష్ట్రానికి 50శాతం నిధులు వస్తున్నరీతిలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా స్థానిక ప్రభుత్వాలకు 50 శాతం నిధుల్ని బదిలీ చేయాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పనులు జరిగేందుకు పౌర సేవల చట్టాన్ని తీసుకురావాలని జేపీ అన్నారు. చిన్న పట్టణాల అభివృద్ధిలో ఈ అంశాలు కీలకపాత్ర వహిస్తాయన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా చిలకలూరిపేటలోని ఆర్యవైశ్య కళ్యాణమంటపంలో 'హక్కుగా పౌరసేవలు-సుపరిపాలన' అంశంపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో జేపీ పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గనటానికి వివిధ వర్గాల ప్రజలు పెద్దఎత్తున ఆసక్తి చూపటంతో వేదిక ప్రాంతమంతా కిక్కిరిసిపోయి చర్చ సుదీర్ఘంగా సాగింది. పాల్గన్న ప్రతి ఒక్కరూ సురాజ్య సంస్కృతికనుగుణంగా పరిష్కారంలో భాగమయ్యేందుకు ప్రయత్నించారు.

పలువురు వక్తలు స్థానిక సమస్యలను ఎక్కువగా ఏకరువు పెట్టారు. విద్య, వైద్యం, మంచినీటి సౌకర్యం, దోమల బెడద వంటి సమస్యలను ప్రస్తావించారు. ప్రభుత్వాస్పత్రుల్లో కనీస వైద్యం అందటం లేదని, 108 వాహనం కూడా లేక పేదలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రక్తనిధి కేంద్రం ఏర్పాటు విషయంలో జరిగిన జాప్యం కారణంగా మరణించిన వ్యక్తుల వివరాలను కందా భాస్కరరావు జేపీ దృష్టికి తీసుకొచ్చారు.

దీనిపై స్పందిస్తూ.. లక్షా 15వేల జనాభా ఉన్న చిలకలూరిపేట పట్టణంలో ఒక్కొక్కరి పేరు మీదా రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.30,000 ఖర్చు పెడుతున్నా మౌలికవసతులు సక్రమంగా ఉండటం బాధాకరమని జేపీ అన్నారు. ఎక్కువమంది ప్రస్తావించిన సమస్యలన్నీ చాలా తేలిగ్గా, స్థానికంగా, అధికారుల స్థాయిలోనే పరిష్కారమయ్యేవేనని, అధికారాలన్నీ ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి చేతుల్లో, రాజధానుల్లో కేంద్రీకృతం చేసుకునే వికృత రాజకీయం వల్లే ఈ సంక్షోభం కొనసాగుతోందని అన్నారు. ఎన్నికల్లో ఎవరు గెలిచినా జనం జీవితాలు మారకపోవటానికి ఈ దుర్రాజకీయం, దుష్పరిపాలనే కారణమన్నారు. దీన్ని మార్చటంకోసమే స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాలను బదిలీ చేయాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా సేవలందించేందుకు పౌర సేవల చట్టం తేవాలని సురాజ్య ఉద్యమం చేస్తున్నామన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గత ఏడాది బడ్జెట్‌నే తీసుకుంటే చిలకలూరిపేట ప్రజల పేరు మీద రూ.360 కోట్ల ఖర్చు కనిపిస్తుందని, అంత డబ్బు ఖర్చవుతున్నా స్థానికంగా చిన్న పనులు కూడా ఎందుకు జరగటం లేదో ఆలోచించాలని జేపీ అన్నారు. అందులో సగం డబ్బు.. అంటే రూ.180 కోట్లు పేట ప్రజలకు ఇచ్చి మీ పనులు మీరు చూసుకోండి అంటే కేవలం రెండు మూడేళ్లలో అద్భుతంగా పరిస్థితులు మారతాయన్నారు. దీనికి రాజకీయ నాయకులు కాస్త మంచి బుద్ధిని, ఆలోచనను ప్రదర్శించటం మినహా చేయాల్సింది ఏమీ లేదన్నారు. ప్రపంచంలో అన్ని దేశాలూ ఇలా స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసుకుని ప్రభుత్వ కార్యాలయాలను ప్రక్షాళన చేసుకున్నాయని, అందుకే అక్కడ పౌరసత్వం అంటే ఏమిటో ప్రజలకు అర్థమై వేగంగా ఎదగగలిగాయని అన్నారు. స్వతంత్రం వచ్చాక కంటే రాకముందు భారత్ ఆసియాలో అగ్రస్థానంలో ఎందుకుందో ఆలోచిస్తే మన పాలకులు ఎంత అధ్వాన్న విధానాలను అనుసరిస్తున్నారో అర్థమవుతుందన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అక్కడ జరిగే పనుల జాబితాలో సిటిజన్ ఛార్టర్ల బోర్డులుండాలని, ప్రతి పనికీ గడువు ఉండాలని, ఆ గడువులోగా ప్రజలకు పనిచేసి పెట్టకపోతే రోజుకు రూ.250-300 కనీస పరిహారంగా చెల్లించాలని అన్నారు. ఈ రకంగా తయారుచేసిన పౌర సేవల చట్టం ముసాయిదాను ఇప్పటికే తెలుగు రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వాలకు అందించామన్నారు. సురాజ్య లక్ష్యాల కోసం కొంత అవగాహనతో ప్రజలంతా గట్టిగా పట్టుబట్టాలన్నారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదై తేలిగ్గా, సంఘటితంగా లక్ష్యాలను సాధించుకోవాలన్నారు.

బండారు రామ్మోహనరావు, భీశెట్టి బాబ్జీ, మాదాసు భానుప్రసాద్, దుర్గాదేవి, నాగశ్రీ, సాదిక్, ఆంజనేయులు, వైబీఐ శివరామకృష్ణ సమావేశాన్ని సమన్వయం చేశారు. ❍

# ఏడాదికి రూ.30,000 ఖర్చు.. వైద్యానికి మాత్రం రూ.300లే కేటాయింపు!

పేదలకు కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం అందించటం వల్ల ప్రయోజనముండదని, ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేస్తే కార్పొరేట్ వైద్యమే పేదల ముంగిటకు వస్తుందని జేపీ అన్నారు. వైద్యులు గ్రామాలలో పనిచేయటం లేదని దుష్ప్రచారం చేసే కంటే, వారికి సరైన జీతభత్యాలు, వసతులు వంటి ప్రోత్సాహకాలను కల్పించటం మీద ప్రభుత్వం దృష్టి పెడితే ప్రజలకు మంచి వైద్యం అందుతుందన్నారు. మనదేశంలో డాక్టర్ చదువును అత్యంత సంక్లిష్టమైనదిగా తయారుచేశామని, ఏళ్ల తరబడి కష్టపడి ప్రాణాలను కాపాడే నైపుణ్యాలతో డిగ్రీని పొందినా, ప్రజలకు సేవచేయాలన్నా కోరిక ఉన్నా కూడా అవకాశాలు లేకుండా చేశామని అన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో డాక్టర్లకు ఇస్తున్న జీతభత్యాలు చూస్తే ముమ్ముందు ప్రజలకు వైద్యసదుపాయాలు అందుబాటులో ఉంటాయా? అని భయపడాల్సి వస్తోందన్నారు. కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇచ్చే జీతాల్లో మూడో వంతు కూడా ప్రభుత్వ డాక్టర్లకు ఇవ్వటం లేదన్నారు. తాను రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో ప్రభుత్వాస్పత్రుల్ని చూస్తూ వస్తున్నానని, ప్రతి చోటా సమగ్రంగా వివరాల్ని సేకరిస్తున్నానని, చాలాచోట్ల ప్రభుత్వం పెట్టే ఒక్క రూపాయి ఖర్చుకు ఐదు రెట్లు, కొన్ని చోట్ల పదిరెట్లు పని జరుగుతోందని అన్నారు. ఒక చిన్న ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకయ్యే వ్యయంలో మూడోవంతు, నాలుగోవంతు ఖర్చుతో సేవలందిస్తున్న పెద్ద ప్రభుత్వాస్పత్రులున్నాయన్నారు. ప్రాథమిక వైద్యాన్ని బలోపేతం చేసే చర్యలు సరిగా లేకపోవడం, వైద్యం, ఆరోగ్యం పట్ల అవగాహన, చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేకపోవడం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆరోగ్య రంగానికి జబ్బుపై పాలకులు వెంటనే మేలుకోవాలన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా ప్రకాశం జిల్లా పెద్దదోర్నాలలోని ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, రోగులతో జేపీ మాట్లాడారు. స్థానిక వైద్యశాలల పనితీరుపై ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాసరావు, తదితరులతో చర్చించారు.

దోర్నాల ప్రభుత్వ వైద్యశాలలో చుట్టుపక్కలున్న 60,000 జనాభాకు వైద్యం అందిస్తున్నారని, ఈ వైద్యశాలకు అన్ని ఖర్చులూ కలిపి 1కోటీ 10లక్షల రూపాయలు మాత్రమే ఇస్తున్నారని జేపీ అన్నారు. ప్రతి పౌరుని పేరు మీదా ఏడాదికి రూ.30,000 ఖర్చు చేస్తున్న ప్రభుత్వం ఈ ప్రాంతంలోని ప్రజల వైద్యం కోసం తలసరి రూ.300 మాత్రమే ఇస్తోందన్నారు. ప్రపంచంలో ఏదేశంలో లేనంత తక్కువ మంది సిబ్బంది వైద్యరంగంలో మనదేశంలో ఉన్నారన్నారు. ఈ ఒక్క రంగాన్ని బాగుచేస్తే 2కోట్ల ఉద్యోగాలు మనకు వస్తాయన్నారు. ఈ అంకెల్ని ఆషామాషీగా చెప్పటంలేదని, జాతీయ ఆరోగ్య మిషన్ రూపశిల్పిగా అవగాహనతో చెబుతున్నానన్నారు.

వైద్యశాల ప్రక్షాళనకు కృషి చేయాలని ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం నాయకులు పూర్ణకంటి తిరుమలయ్య, కందుల కాశిరెడ్డిలు జేపీకి వినతిపత్రాల్ని అందచేశారు. తమకు గుర్తింపు ఇవ్వకూడదంటూ కొందరు అల్లోపతి వైద్యులు చేస్తున్న ఆందోళనలు, ఇతరత్రా సమస్యలపై గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరాజు, వెంకటేశ్వర్లు తదితరులు విజ్ఞాపన పత్రం ఇచ్చారు.

వైద్యాధికారులు సురేష్, చెంచయ్య, జగదీష్, లోక్‌సత్తా, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ❍



### మన ప్రజలు అల్పసంతోషులు

లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా చేసినప్పుడు తాను రెండు మూడేళ్ల పిల్లవాడనని, ఆ సమయంలో టీచర్‌గా పనిచేస్తున్న తన తల్లికి ఏదో సమస్య వచ్చి కలెక్టరేట్ వద్ద వేచి ఉంటే గమనించిన జేపీ వెంటనే పిలిపించి మాట్లాడారని డాక్టర్ సురేష్ ఈ సందర్భంగా తెలిపారు. ఆ సమస్యను 10 నిముషాల్లో పరిష్కరించాలని లిఖితపూర్వక ఆదేశమిచ్చారన్నారు. ఆరోజు జేపీ చేసిన సాయం వల్లే తాను డాక్టర్ కాగలిగానని, ఎప్పుడు అవకాశమొచ్చినా జేపీకి కృతజ్ఞతలు చెప్పాలని తన తల్లి చెబుతుండేవారన్నారు. అనుకోకుండా ఈరోజు ఆ అవకాశం వచ్చిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. దీనిపై జేపీ స్పందిస్తూ, సురేష్ చెబుతున్న సంగతేమిటో తనకు గుర్తు కూడా లేదన్నారు. మన ప్రజలు అల్పసంతోషులని, జీతం తీసుకుంటున్నందుకు తన బాధ్యత నెరవేర్చానని, ఆ మాత్రానికే సురేష్ ఎంతో కృతజ్ఞతను తెలియచేస్తున్నారని అన్నారు.

# ఆలస్యంగా మేలుకోవటమే పోలవరానికి శాపమైంది

పోలవరం అంతర్రాష్ట్ర బహుళార్థ ప్రాజెక్టని, ఇది త్వరగా పూర్తికావటం వల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు లాభం చేకూరుతుందని జేపీ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం దగ్గర్నుంచీ పోలవరాన్ని ఆలస్యం చేశారని, విభజన జరిగాక నూతన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఆలస్యంగా మేలుకోవటం వల్ల ప్రాజెక్టుకు ఇప్పుడు అనేక అవరోధాలు ఎదురవుతున్నాయని అన్నారు. ప్రత్యేక హోదా పారిశ్రామిక రాయితీలు, పోలవరంపై మేలుకోవాలని 2014 సంవత్సరాంతం నుంచే లోక్‌సత్తా చంద్రబాబు ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చిందని గుర్తు చేశారు. ఇటీవల తాను పోలవరం ప్రాజెక్టును సందర్శించినప్పుడు ఆలస్యంగానైనా పనులు వేగంగా జరగటాన్ని చూసి సంతోషించానని, మళ్లీ కేంద్ర, రాష్ట్రాల మధ్య విభేదాలు రావటం దురదృష్టకరమని అన్నారు. కాంట్రాక్టర్లకు కొమ్ముకాయటం, కులరాజకీయాలను పక్కనపెట్టి.. పోలవరాన్ని వేగంగా పూర్తి చేయటం కోసం ముఖ్యమంత్రి కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతుండాలన్నారు. పోలవరంపై పార్టీలకతీతంగా అందరూ ఏకం కావాలన్నారు.

గుంటూరు జిల్లా సురాజ్య యాత్రలో భాగంగా జేపీ నగరంలోని వివిధ వర్గాలను కలుసుకున్నారు. మీడియాతో మాట్లాడారు.

కేంద్రంలో, రాష్ట్రాల్లో పరిపాలన ఏరకంగా చూసినా సంతృప్తికరంగా లేదని జేపీ అన్నారు. పాలకుల నుంచి ప్రజలకు అందాల్సిన విద్య, వైద్యం, భద్రత, మౌలిక వసతులు, లంచాల్లేని సేవలు వంటి కనీస స్థాయి పనులు కూడా జరగటం లేదన్నారు. ఇవి లేకుండా ఉపాధి అందదని, ప్రభుత్వోద్యోగాలకు వయసు పెంపు, నిరుద్యోగ భృతి, పింఛన్లు వంటి గిమ్మిక్కులతో యువతకు ఒరిగేదేమీ ఉండదని అన్నారు. ప్రభుత్వోద్యోగాలు అన్నిటినీ భర్తీ చేసినా ప్రతి లక్షమందిలో 99,900మందికి ఉద్యోగాలు అందవని, వీరికి గౌరవప్రదమైన ఆదాయం లభించేలా చేయటానికి విద్య, వైద్యం వంటి మౌలికరంగాలను బాగుచేయటం తప్ప మార్గంలేదని అన్నారు. ఇందుకోసమే సురాజ్య యాత్ర అన్నారు. సురాజ్య యాత్ర ఆరు లక్ష్యాలనూ సులభంగా, ఆచరణసాధ్యంగా, ఖర్చు లేకుండానే ప్రభుత్వాలు చేయవచ్చని, ఇందులో ఏ పార్టీ, సంస్థా కూడా అభ్యంతరం చెప్పే అంశం లేదని అన్నారు. కానీ వీటి ద్వారా ప్రజల జీవితాలు మాత్రం గణనీయంగా మెరుగుపడతాయని అన్నారు.



కేంద్ర, రాష్ట్ర తేడా లేకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు విపరీతమైపోతున్నాయని, కొత్తపుంతలు తొక్కుతూ ప్రజల్ని పీడిస్తున్నాయని జేపీ అన్నారు. ప్రజలకు సర్కారీ ఆఫీసుల్లో లంచాలు, వేధింపుల బెడద లేకుండా సిటిజన్ ఛార్టర్లను ప్రతి కార్యాలయంలో బోర్డుల రూపంలో పెట్టి నిర్ణీత గడువులోగా సేవలందించకపోతే దరఖాస్తుదారులకు రోజుకు రూ.300 కనీస పరిహారం చెల్లించాలన్నారు. ఇలాంటి 'పౌర సేవల' చట్టాన్ని తయారుచేసి ఇప్పటికే కేంద్రం, తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు పంపామన్నారు. దేశంలో అత్యధికశాతం నేరాలకు శిక్షలు పడటం లేదని, పోలీసులు పెట్టే చిత్రహింసలు భరించలేక అమాయకులు నేరాలు ఒప్పుకుంటున్న సందర్భాలే ఎక్కువగా ఉంటున్నాయని గుర్‌గావ్, ఒడిషాలలో ఘటనలను ఉదహరిస్తూ చెప్పారు. మన సమాజం, కుటుంబ వ్యవస్థలో ఉన్న బలం వల్లే ఇంకా శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి తప్ప పాలకుల చట్టబద్ధపాలన వల్ల కాదన్నారు. విద్య, ఆరోగ్యంలో మనం ప్రపంచంలోనే అథమస్థితిలో ఉన్నామన్నారు. కేవలం ఆరోగ్య ఖర్చులకు తాళలేక ఏడాదికి దేశంలో 6కోట్లమంది పేదలవుతున్నారన్నారు. రైతుల ఎడతెగని కడగండ్లు పాలకుల పాపమే తప్ప ప్రకృతి శాపం కాదని సోదాహరణంగా వివరించారు. స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చకపోతే ముందు పరిస్థితులు తీవ్రంగా మారి సామాజిక, ఆర్థిక, రాజకీయ కల్లోలాన్ని సృష్టిస్తాయని హెచ్చరించారు.

లోక్‌సత్తా 2.0 ఉద్యమసంస్థ ఏపీ, తెలంగాణ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, సురాజ్య ఉద్యమ కన్వీనర్ ఎం. భానుప్రసాద్, కొత్తా సూర్య, కొణిశెట్టి దుర్గాదేవి, మోదుగుల శ్రీనాథ్‌రెడ్డి, జేవీ సురేష్, వైబీఐ కన్వీనర్ శివరామకృష్ణ, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు. ❍

# ప్రభుత్వ జోక్యం ఉండి ఉంటే.. ఈపాటికే చేపల రైతులు గుల్లయ్యేవారు



ఆంధ్రప్రదేశ్‌కు చేపలు, రొయ్యలు వంటి ఉత్పత్తుల ఎగుమతుల వల్ల గణనీయంగా ఆదాయం వస్తోందని, ఆ రంగంలో ప్రభుత్వ జోక్యం ఉండి ఉంటే ఈపాటికే సమస్యలు మొదలై ఉండేవని జేపీ అన్నారు. రేపు అధికారంలోకి ఏ మతిలేని నాయకుడో వచ్చి చేపలను కూడా అత్యవసర వస్తువుల జాబితాలో చేరిస్తే ఇప్పుడు వేల రూపాయల ఆదాయం కాస్తా వందల్లోకి పడిపోతుందని అన్నారు. ఒక్క కలంపోటుతో రైతులకు వచ్చే లాభాలకు ప్రభుత్వాలు గండికొడుతున్నాయన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా నెల్లూరు జిల్లా ముత్తుకూరు మత్స్య కళాశాల విద్యార్థులతో సమావేశమై వ్యవసాయం చుట్టూ పలు అంశాలను చర్చించారు. స్పందనలు, ప్రశ్నలతో విద్యార్థులు, అక్కడికి వచ్చిన రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు.

వ్యవసాయాన్ని నాశనం చేస్తున్నది పాలకుల విధానాలే తప్ప ప్రకృతి వైపరీత్యాలు కాదని జేపీ అన్నారు. స్వతంత్రం వచ్చిననాటి నుంచి ఒక పరంపరలా రైతుల్ని నాశనం చేస్తున్నారని సోదాహరణంగా చెప్పారు. 1980లలో కేంద్రంలో ఇందిరాగాంధీ అధికారంలోకి వచ్చాక.. మన వద్ద బాగా ఉత్పత్తి అవుతున్న పొడుగు పింజ రకం పత్తికి అంతర్జాతీయంగా డిమాండ్ వచ్చిందని, క్వింటాకు రూ. 1500తో మన రైతులకు రెట్టింపు ధర వచ్చే అవకాశం లభించిందని, అదే సమయంలో మనదేశంలోకి పత్తి దిగుమతులను అనుమతిస్తున్నట్టు కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. ఆ ఒక్క ఉత్తర్వుతో పత్తి ధరలు.. ఉన్న ధర కంటే తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రపంచీకరణ తరుణంలో పాలకులు పైనుంచి తీసుకునే నిర్ణయాలు రైతుల్ని మరింత కుంగదీస్తున్నాయన్నారు. ఇదే తరహా పరిస్థితి 2011లో కూడా దేశంలో, తెలుగు నాట నెలకొందని, అప్పుడు లోక్‌నత్తా చొరవ తీసుకుని అన్ని పార్టీలనూ, రైతు సంఘాలనూ ఏకం చేసి

### రూ.2,500కోట్ల పన్నులు ఏమవుతున్నాయి?

సరైన విద్య లేకపోవడం, ఆరోగ్యం అందకపోవడం, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల వల్ల కూడా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అవినీతిని పెంచి పోషిస్తున్న పాలకులు రైతుల పన్నుల డబ్బును కూడా సద్వినియోగం చేయడంలేదని, ఆంధ్రప్రదేశ్‌లోనే ఏడాదికి రూ. 2,500కోట్లు రైతుల నుంచి వివిధ రకాల పన్నుల రూపంలో వసూలు చేస్తూ కూడా సరైన మార్కెటింగ్ వసతుల్ని కల్పించటం లేదని అన్నారు. ధర తగ్గితే పంటలను నిల్వ చేసి అమ్ముకునేందుకు వీలుగా గోదాముల్ని నిర్మించటం, ధరను స్థిరీకరించేందుకు ఏర్పాట్లు చేయటానికి కాకపోతే ఆ పన్నుల డబ్బు వసూలు చేస్తున్నది మరెందుకు? అని ప్రశ్నించారు. ఈ అంశాలన్నిటినీ లోతుగా ఆలోచించాలన్నారు.

### పెద్ద నోట్ల రద్దుతో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం

పెద్ద నోట్ల రద్దును ప్రకటిస్తున్న సమయంలో తాను మద్దతిచ్చానని, ఆ తర్వాత కూడా గట్టిగా సమర్థించానని జేపీ అన్నారు. అయితే పాత నోట్ల బదులు కొత్త నోట్లను ఇచ్చేందుకు ముద్రణ కూడా చేయకుండా నోట్ల రద్దును అమలు చేస్తారన్న ఆలోచన కూడా తనకు కలగలేదన్నారు. అంత అసమర్థంగా నిర్ణయాన్ని తీసుకున్నారన్నారు. అలాగే నోట్ల రద్దు ఒక చిన్న తొలి అడుగేనని, ఆ తర్వాత అవినీతి అంతానికి పౌర సేవల చట్టం, పన్ను, ఎన్నికల సంస్కరణలు వంటి చర్యలు తీసుకుంటారని ఆశించానన్నారు. కానీ అవేమీ చేయలేదన్నారు. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు కష్టాలు, ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం తప్ప పెద్ద నోట్ల రద్దు వల్ల పెద్ద మంచేమీ జరగలేదన్నారు.

### సమస్యలపై వినతి

ముత్తుకూరు పర్యటనలో జేపీకి పలువురు సమస్యలపై విన్నవించారు. తమకు కోర్సు పూర్తయిన వెంటనే మత్స్య అభివృద్ధి పోస్టులకు అర్హత లభిస్తుందని, కానీ ప్రభుత్వం పోస్టులను విడుదల చేయటం లేదని మత్స్యకళాశాల విద్యార్థులు తెలిపారు. దీనికి జేపీ స్పందిస్తూ.. ఆక్వా పరిశ్రమకు తగ్గట్టుగా కళాశాలను విస్తరించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం గల విద్యార్థులు ఒకేరకంగా ఆలోచించకుండా సమాజానికి ఉపయోగపడే ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తూ ఉపాధి పొందాలన్నారు.

### గ్రామీణ వైద్యులకు అండగా ఉంటా

టీఎన్‌సీపీఏ జిల్లా ప్రతినిధి జి.రత్నం ఆధ్వర్యంలో తెలుగునాడు కమ్యూనిటీ పారామెడికల్ అసోసియేషన్ సభ్యులు జేపీని కలిశారు. జీవో 465 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తమను గుర్తించినా దాన్ని రద్దు చేయాలని కొందరు అల్లోపతి వైద్యులు డిమాండ్ చేస్తున్నారని, తమకు మద్దతిచ్చి ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరారు. ఈ విషయాన్ని తప్పక ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జేపీ హామీ ఇచ్చారు.

దేశంలో ఇబ్బడిముబ్బడిగా ఉన్న ఆహారధాన్యాలను ఎగుమతి చేయటంపై ఉన్న నిషేధాన్ని తొలగించేలా కేంద్రప్రభుత్వాన్ని ఒప్పించిందన్నారు. దేశంలో ముక్కిపోతూ, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉన్న ఆహారధాన్యాల ఎగుమతి వల్ల విలువైన విదేశీ మారక ద్రవ్యం లభించటమేకాక రైతులకు మేలు జరిగిందని, ఇప్పటికీ బియ్యం ఎగుమతుల్లో భారత్ అగ్రస్థానంలో కొనసాగుతోందని అన్నారు. దేశవ్యాప్తంగా ఒకే మార్కెట్ ఉందని కేంద్రం చట్టం చేసినా కూడా తెలుగునాట అధికారంలో ఉన్న అదే పార్టీ ప్రభుత్వం పొరుగు రాష్ట్రాల్లో డిమాండ్ ఉన్నా ఇక్కడి రైతులు అమ్ముకోకూడదని అధికారిక ఉత్తర్వులు జారీ చేసిందని, దీన్ని ధిక్కరిస్తూ తాను రైతు సత్యాగ్రహ యాత్ర చేసి కర్ణాటక, మహారాష్ట్రలలో బియ్యం అమ్మానని వివరించారు. అరెస్టు చేయమని సవాలు చేసినా అందుకు ప్రభుత్వం ధైర్యం చేయలేకపోయిందన్నారు. ఆ తర్వాత వారం రోజుల్లో పొరుగున డిమాండ్ ఉన్న రాష్ట్రాలకు ధాన్యం తీసుకెళ్లి అమ్ముకోవటం ప్రారంభమైందని, దీనివల్ల తెలంగాణ, కోస్తా, రాయలసీమ ప్రాంతాల రైతులకు ఒక్క బీపీటీ వెరైటీ ధాన్యంలోనే ఒక్క సీజన్‌లోనే రూ. 3,600 కోట్ల లాభం సమకూరిందని అన్నారు. రైతులే దేశానికి వెన్నెముక, రైతే రాజు అని తాను చెప్పనని, దేశంలో ప్రతి రంగంలో సేవలందించేవారూ దేశానికి వెన్నెముకలేనని అన్నారు. అయితే పాలకుల విధానాలు రైతుల నడ్డివిరిచేలా ఉండటం వల్ల అవి వ్యవసాయాన్ని నష్టపరుస్తున్నాయని, దీన్ని మార్చగలిగితే దేశంలో అత్యధిక జనాభా ఆధారపడిన వ్యవసాయం తెరిపిన పడుతుందన్నారు. ఇందుకోసమే వ్యవసాయ విధానాల తీరుతెన్నుల మీద రైతులు, సమాజం దృష్టి పెట్టాలన్నారు.





గ్రామీణ రంగం సంక్షోభంలో పడితే పట్టణాలు మరింత సంక్షోభానికి గురవుతాయని, గ్రామాలను వేరు చేసి భారతదేశం ఉండదని జేపీ అన్నారు. ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించి రైతులకు ఖర్చు భారం లేకుండా పంటలు పండించే ఏర్పాటు, ఎక్కడైనా అమ్ముకునే అవకాశం అందిస్తే చాలు రైతులకు ఆదాయం పెరగటంతోపాటు ఉపాధి అవకాశాలు కూడా ఇబ్బడిముబ్బడిగా పెరుగుతాయన్నారు. మత్స్యరంగంలో ఏడు బిలియన్ డాలర్ల ఉత్పత్తి జరుగుతున్నా ప్రభుత్వాల చొరవ లేక అభివృద్ధి జరగటం లేదని, మనదేశంలో కూడా మాంసం, చేపల వినియోగం వంటివి పెరిగితే దేశీయ మార్కెట్ కూడా వృద్ధి చెందుతుందని, అందుకు దోహదం చేయకపోగా మాంసం తినటం, అమ్మటం నేరాలన్నట్టు ప్రభుత్వం సంకేతాలిస్తూ ఉపాధి, ఆదాయ అవకాశాలకు గండికొడుతోందని అన్నారు.

రైతుకు ఆదాయం చుట్టూ వ్యవసాయ విధానాలు తిరగాలని, ఆదాయం తర్వాతే వ్యవసాయానికి ఏదైనా అని జేపీ అన్నారు. చేపలు సహా ఏ సాగు విభాగంలోనైనా ప్రకృతి ఆటుపోట్లు ఉంటాయని, కానీ ఆదాయం ఉంటే ఎన్ని సమస్యలచ్చినా రైతులు తంటాలు పడి లాభాలు సంపాదించుకోగలరని, అందుకు ముత్తుకూరు ప్రాంతంలో చేపల ద్వారా ఆదాయం సంపాదించుకుంటున్న పలువురు వ్యవసాయదారుల జీవితాలే నిదర్శనమని అన్నారు. రైతులు.. ప్రభుత్వాల కంటే, పరిశోధనా సంస్థలకంటే ముందున్నారని, వారిని అందుకునేలా విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. రైతులకు ఆదాయం పెంచే విధానాలను రూపొందించాలన్నారు. వ్యవసాయాన్ని, పరిశ్రమలను సంధానం చేయాలన్నారు. బీఎఫ్ఎస్సీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు.

కళాశాలలో జేపీకి స్వాగతం పలుకుతూ వేసిన చిత్రం పలువురిని ఆకట్టుకుంది.

కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హరిబాబు, ప్రజా సైన్స్ వేదిక రాష్ట్ర బాధ్యుడు మాల్యాద్రి, జిల్లా బాధ్యుడు బాబునాయుడు, గాలి శ్రీనివాసులు, లోక్‌సత్తా, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ❍

# 'ఉపాధిలో సరికొత్త సవాళ్లు'.. జీవితకాలంపాటు నేర్చుకునే సామర్థ్యాన్నిచ్చే విద్య




కండబలం ద్వారా ఉపాధిని పొందే రోజులు పోయాయి, యంత్రాల ద్వారా సృజనాత్మకతతో పనిచేసే శక్తిని సంతరించుకుంటేనే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ సురాజ్య యాత్రలో కళాశాల విద్యార్థులకు, ముఖ్యంగా ఇంజినీరింగ్‌లోవారికి వివరిస్తున్నారు. రాబోయే కాలంలో 70శాతం ఉద్యోగాలు ఎలా ఉంటాయో తెలియదని, జీవితకాలంపాటు నేర్చుకునే సామర్థ్యాన్ని అందించే విద్య కావాలని చెబుతూ.. అలాంటి విద్యకు-ప్రభుత్వ బాధ్యతకు మధ్య సంబంధాన్ని తెలియచేస్తున్నారు. నాణ్యమైన విద్య, ఆరోగ్యం వంటి పనుల్ని ప్రభుత్వాల చేత సక్రమంగా చేయించటం కోసం కొంత సమయాన్ని యువత, ఇతర ప్రజలు కేటాయించాలని సూచిస్తున్నారు. అలా అవగాహనతో, సంఘటితంగా, తెలిగ్గా ఉమ్మడి లక్ష్యాలను సాధించుకోవటానికే సురాజ్య ఉద్యమంలో భాగంగా యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్ వెబ్ ప్లాట్‌ఫారాలను అందిస్తున్నారు. ఉపాధి రంగానికి సంబంధించి ఈనాడు పత్రికకు రాసిన కాలమ్‌లో ఈ వాస్తవాలను అకడమిక్‌గా వివరించారు సియంట్ లిమిటెడ్ ప్రతినిధి డా. పి.శ్రీనివాసరావు. అందులో కొన్ని అంశాలు:

ప్రస్తుతమున్న ఉద్యోగాలు 47శాతం ఆటోమేషన్‌కి గురవుతాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరం అంచనా వేసింది. మార్పు అనివార్యం. 'ఆటలో అందరికంటే బాగా ఆడాలంటే ముందుగా ఆట నియామాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి' అంటాడు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్. సరికొత్త సవాళ్లను అవగతం చేసుకుని ముందుకు సాగితేనే సాంకేతిక విద్యార్థుల మనుగడ సాధ్యం. అందుకే ఇండస్ట్రీ 4.0 (నాలుగో పారిశ్రామిక విప్లవం)కు అనుగుణంగా విద్యార్థులు తమనుతాము తీర్చిదిద్దుకోవాలి.

మెషినరీ, ప్రింటింగ్, ఎలక్ట్రానిక్స్, ఆప్టిక్స్, డేటా ప్రాసెసింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఆటోమోటివ్, రబ్బర్, ప్లాస్టిక్ పరిశ్రమలు, ఫర్నిచర్, పేపర్ ఇండస్ట్రీ, గ్లాస్, సిరామిక్స్, స్టోన్స్, బిల్డింగ్ మెటీరియల్స్, టెక్స్‌టైల్స్, ఫార్మా, కెమికల్ మొదలైన పరిశ్రమలన్నీ నాలుగో పారిశ్రామిక విప్లవం వల్ల ప్రభావితమవుతున్నాయి.

అత్యాధునిక సాంకేతిక పరిణామాలకు మూల స్తంభాలుగా తొమ్మిదింటిని చెప్పవచ్చు. 1. బిగ్‌డేటా 2. అటానమస్ రోబోట్స్ 3. సిమ్యులేషన్ 4. యూనివర్సల్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్ 5. ఇండస్ట్రియల్ ఐవోటీ 6. సైబర్ సెక్యూరిటీ 7. క్లౌడ్ కంప్యూటింగ్ 8. 3డీ ప్రింటింగ్ 9. ఆగ్‌మెంటెడ్ రియాలిటీ.

ఫలితంగా వచ్చే విప్లవాత్మక మార్పుల్లో ఆటోమేటెడ్ ప్రొడక్షన్, ప్రిడెక్టివ్ మెయిన్‌టినెన్స్, కనెక్టెడ్ మెషీన్స్, 3డీ ప్రింటింగ్, స్మార్ట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్, నెట్‌వర్క్‌డ్ సప్లయ్ చెయిన్ మొదలైనవి ఉన్నాయి.

భిన్నమైన ఆలోచనలు ఉన్నవారే నూతన సవాళ్లను అందుకుని నిలదొక్కుకోగలుగుతారు. భావవ్యక్తీకరణ మాత్రమే కాకుండా భావోద్వేగాలను నియంత్రించుకోగల విచక్షణ కూడా అవసరమే. అత్యాధునిక నైపుణ్యాల్లో స్వీయప్రతిభ చూపటంతోపాటు ఇతరులకు శిక్షణనివ్వగల, వారి నైపుణ్యాలను మెరుగుపరచగల సామర్థ్యం కూడా పెంచుకోగలగాలి. ❍

# బెల్టుషాపులతో విచ్చలవిడి మద్యం

రాష్ట్రంలో మద్యం విచ్చలవిడిగా అమ్ముతున్నారని, బెల్టుషాపుల్ని యధావిధిగా కొనసాగిస్తున్నారని, మద్యనియంత్రణకు కఠిన చర్యలు తీసుకోకపోతే ఉద్యమం చేపడతామని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. మద్యం అమ్మకాల తీరు వల్ల జరుగుతున్న పెనునష్టాల్ని ఆయన రాష్ట్ర ఎక్సయిజ్ కమిషనర్ పి.లక్ష్మీనరసింహం దృష్టికి తీసుకొచ్చారు. సుప్రీంకోర్టు తీర్పుని సైతం గౌరవించకుండా అమ్మకాల్ని ఇష్టమొచ్చినట్టు చేస్తున్నారన్నారు. పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలను నాశనం చేస్తున్న మద్యాన్ని కట్టడి చేయాల్సిందిపోయి, ప్రభుత్వం ఆదాయ మార్గంగా మార్చుకోవడం దారుణమన్నారు. విద్య, వైద్య రంగాల్ని అధ్వాన్నం చేసి మద్యం ద్వారా రూ.13,000 కోట్ల ఆదాయం లక్ష్యంగా పాలన సాగుతోందని, రాష్ట్ర



ప్రజానీకంలో అత్యధికులు అధోగతిలోనే మగ్గటానికి ఇంతకంటే గొప్ప ఫార్ములా అక్కర్లేదని అన్నారు. ఇంకా ఇంకా అమ్మకాల్ని పెంచటానికి డిస్టిలరీలను పెంచుతున్నారని, ఎక్సయిజ్ అధికారులే లంచాలు తింటూ చట్టవిరుద్ధంగా మద్యం అమ్మకాల్ని చేస్తున్నా చర్యలు లేవని అన్నారు. ❍

# ఇందుకే చట్టబద్ధపాలనను సురాజ్య లక్ష్యాల్లో చేర్చాం

2జీ కుంభకోణంపై తీర్పు చూశాకైనా చట్టబద్ధపాలన గురించిన ఆలోచన రాజకీయ వ్యవస్థలో, ప్రజల్లో కలగాలని భీశెట్టి బాబ్జీ అన్నారు. నిర్దిష్ట వాదనలతో లోక్‌సత్తా 2010లో పిటిషన్ వేయటం వల్ల 122 అక్రమ లైసెన్సులు రద్దయి దేశ ఆదాయానికి నష్టం జరగలేదని, కానీ అవినీతిపై భయంకర ప్రకటనలు చేసిన, పార్లమెంటును స్తంభింపచేసిన, రోడ్ల మీద ఆందోళనలు చేసిన పార్టీలు, ప్రభుత్వాలు దోషులకు శిక్ష పడేలా మాత్రం చేయలేకపోయాయని అన్నారు. 2జీ కేసులో దేశానికి జరిగిన ఒకే ఒక్క మేలు లోక్‌సత్తా పిటిషన్ ద్వారానే జరిగిందన్నారు. బలవంతంగానో, చావబాదో నేరాల్ని ఒప్పించకపోతే మనదేశంలో శిక్ష పడేది నూటికి 6-10 కేసుల్లో మాత్రమేనన్నారు. ఈ పరిస్థితి మారకపోతే చివరకు న్యాయవ్యవస్థ మీద కూడా నమ్మకం పోయి దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగించలేదన్నారు. ఇందుకోసమే చట్టబద్ధపాలనను సురాజ్య ఉద్యమ ఆరు లక్ష్యాల్లో ఒకటిగా చేసి ప్రజల భాగస్వామ్యంతో పార్టీలకతీతంగా సాధించేందుకు లోక్‌సత్తా కృషి చేస్తోందన్నారు. దేశంలో పాలనలో ఆటగాళ్లు మారుతున్నా ఆటనియమాలు మారకపోవటం వల్ల జనం బతుకులు మారటం లేదన్నారు. విజయవాడలో జరిగిన లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో బాబ్జీ మాట్లాడారు. పార్లమెంటు సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీయకుండా తెదేపా, వైకాపా ఎంపీలు కాలక్షేపం చేసినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. కేంద్రం ఇచ్చిన హామీల మేరకు రాష్ట్రంలో తలపెట్టిన ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఎం, ఐఐఎస్ఈఆర్‌లలో పురోగతి నత్తనడకన ఉందన్నారు. సెంట్రల్, ట్రైబల్ విశ్వవిద్యాలయాల ప్రారంభం కనిపించటం లేదన్నారు. విశాఖ రైల్వే జోన్‌పై కేంద్రం నోరు మెదపడం లేదన్నారు. వీటన్నిటిపై ఎంపీలు ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నించాలన్నారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు దుర్గ, తుమ్మల లక్ష్మి, రవి, తేజ, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ❍

# 30శాతం గ్రామాల్లో సాగుభూమి 500 ఎకరాల్లోపే!



**తె**లంగాణ రాష్ట్రంలోని 30శాతం గ్రామాల్లో ఒక్కో చోట వ్యవసాయ భూమి 500 ఎకరాల్లోపే. ఈ గ్రామాల్లో సగటున 149 మంది రైతులే ఉన్నారు.

సమగ్ర రైతు సర్వే ఆధారంగా వ్యవసాయ శాఖ తాజాగా రూపొందించిన నివేదిక వివరాల ప్రకారం.. మొత్తం 10,733 రెవెన్యూ గ్రామాల్లో 45,10,990మంది రైతులకు 1,24,06,476 ఎకరాల భూమి ఉంది. ఈ లెక్కల ఆధారంగా రాష్ట్రంలోని 30శాతం గ్రామాల్లో 500 ఎకరాలలోపే సాగుభూమి ఉన్నట్టు వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ విభాగంలో సగటున ఒక్కో గ్రామంలో 323 ఎకరాలున్నట్టు తేలింది. అలాగే 501-1000 ఎకరాల వరకు ఉన్న గ్రామాలు 2820 ఉండగా.. ఈ విభాగంలో సగటున ఒక్కో గ్రామంలో 283మంది రైతులు, సాగుభూమి 695 ఎకరాలు ఉన్నట్టు తేలింది. 4501-5000 ఎకరాలున్న గ్రామాలు 62 మాత్రమే ఉన్నాయి. 5000 ఎకరాలకుపైగా ఉన్న గ్రామాలు 106 వరకు ఉన్నాయి. రాష్ట్రం మొత్తం మీద సగటున గ్రామానికి 420మంది రైతులు, 1156 ఎకరాల సాగుభూమి ఉన్నట్టు తేలింది.

| సాగుభూమి (ఎకరాల్లో) | గ్రామాల సంఖ్య | రైతుల సంఖ్య | ఎకరాల విస్తీర్ణం | గ్రామానికి రైతులు (సగటున) | గ్రామానికి ఎకరాలు (సగటున) |
|---|---|---|---|---|---|
| 1 - 500 | 3161 | 4,71,624 | 10,19,811 | 149 | 323 |
| 501 - 1000 | 2820 | 7,98,493 | 19,60,159 | 283 | 695 |
| 1001 - 1500 | 1966 | 9,63,814 | 25,18,549 | 490 | 1281 |
| 1501 - 2000 | 1135 | 6,86,968 | 18,76,208 | 605 | 1653 |
| 2001 - 2500 | 624 | 4,76,760 | 13,52,516 | 764 | 2167 |
| 2501 - 3000 | 385 | 3,34,179 | 9,91,120 | 867 | 2572 |
| 3001 - 3500 | 230 | 2,25,110 | 7,22,361 | 980 | 3143 |
| 3501 - 4000 | 144 | 1,56,168 | 5,29,464 | 1083 | 3672 |
| 4001 - 4500 | 99 | 1,10,280 | 4,19,136 | 1114 | 4234 |
| 4501 - 5000 | 62 | 89924 | 2,91,762 | 1450 | 4706 |
| 5000+ | 106 | 1,97,668 | 7,25,386 | 1865 | 6843 |

### 4 గ్రామాలకు ఒక ఏఈవో

ప్రభుత్వం ప్రతి 5వేల ఎకరాలకు ఒక ఏఈవోను నియమిస్తున్నది. ఈ లెక్కన సగటున 4 గ్రామాలకు ఒక ఏఈవో నియామకం జరగనుంది. రాష్ట్రంలో 5వేల ఎకరాల కంటే ఎక్కువగా వ్యవసాయ భూమి ఉన్న గ్రామాలు 106 వరకు ఉండగా.. ఈ విభాగంలో ఒక్కో గ్రామంలో సగటున 6,843 ఎకరాల భూమి ఉంది. కొన్ని గ్రామాల్లో 7వేలకు పైగా ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అంటే రెండేసి గ్రామాలకు ముగ్గురు చొప్పున ఏఈవోలను నియమించాల్సి ఉంటుంది. నిజామాబాద్ జిల్లాలోని ఓ గ్రామంలో ఏకంగా 38,832 ఎకరాల సాగుభూమి ఉంది. నిబంధనల ప్రకారమైతే ఈ ఒక్క ఊరికే ఏడుగురు ఏఈవోలను నియమించాల్సి ఉంటుంది. ❍

### తగ్గిన రైతుల సంఖ్య

వ్యవసాయ శాఖ వద్ద ఇప్పటి వరకు ఉన్న రికార్డుల ప్రకారం రైతుల సంఖ్య 55 లక్షలుకాగా, సమగ్ర సర్వేలో 45 లక్షలకు తగ్గటంపై గందరగోళం నెలకొంది. భూ రికార్డుల ప్రక్షాళన, ఇతర పరిశీలనలు పూర్తయితే స్పష్టత వస్తుందని భావిస్తున్నారు.

# జేపీ కారణంగా దేశ ఖజానాకు 3లక్షల కోట్ల ఆదాయం



ఎన్నికల రాజకీయాల్లో సఫలం అనిపించకపోయినా, దేశానికి మంచి చేయడంలో ఎప్పుడూ విఫలంకాని 'లోక్‌సత్తా' జయప్రకాష్ నారాయణ్ దేశాభివృద్ధి కోసం ఎన్నో ఆచరణాత్మకమైన మంచి సంస్కరణలను రూపొందించిన సంగతి అందరికీ తెలిసిందే. ఎన్నికల సంస్కరణలు, పాలనా సంస్కరణలు, న్యాయ సంస్కరణలు ఇలా ఎన్నో రంగాల్లో ఉన్న సమస్యలపై ఆయన కొత్త పరిష్కారాల కోసం నిరంతరం కృషి చేస్తుంటారు. ఆయన చేసే పనుల ఫలితాలు ప్రత్యక్షంగా ప్రజలకు తెలియకపోయినప్పటికీ, దేశానికి.. దేశ ప్రజలకు మాత్రం ఎంతో మేలు జరుగుతోంది.

ఉదాహరణకు 2జీ స్కాంపై జేపీ దేశంలోని కొందరు ప్రముఖులతో కలిసి సుప్రీంకోర్టులో కేసు వేశారు. కంపెనీలు అక్రమంగా పొందిన స్పెక్ట్రం లైసెన్సులను రద్దు చేయాలని, ఇకపై సహజ వనరులు ఏవైనా ప్రైవేటు వ్యక్తులకి, సంస్థలకి కేటాయించేందుకు బహిరంగ వేలం పద్ధతిని పాటించాలని వారు ఈ పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ వేసినవారిలో మొదటిపేరు ప్రశాంత్ భూషణ్ అని ఉన్నా, ఈ కేసు వాదించినందుకు జేపీ ఆధ్వర్యంలో నడిచే 'ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్' (ఎఫ్‌డీఆర్) ఆయనకు ఫీజు చెల్లించిందని చాలామందికి తెలియదు. ఈ కేసు వేయించింది, వాదనలను ప్రతిపాదించింది, ఈ కేసులో కక్షిదారులుగా చేరేందుకు కొంతమంది ప్రముఖులను ఒప్పించింది జేపీనే. అయితే ప్రచారంలో ముందుండే ప్రశాంత్ భూషణ్ తన పేరు ఫస్ట్ పెట్టుకున్నారు. మొత్తానికి ఎవరి పేరు ముందున్నా, ఈ కేసులో సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. 2జీ స్పెక్ట్రం కేటాయింపులను రద్దు చేసింది. ఇకపై స్పెక్ట్రం సహా అన్ని సహజ వనరులను వేలం పద్ధతిలోనే కేటాయించాలని తీర్పు ఇచ్చింది.

సుప్రీం తీర్పు ప్రకారం కేంద్రం 2జీ, 3జీ స్పెక్ట్రం, బొగ్గు గనులను వేలం వేస్తోంది. ఈ వేలం ద్వారా ఇప్పటివరకు కేంద్రానికి మూడు లక్షల కోట్లు ఆదాయం వచ్చింది. భవిష్యత్తులో మరింత ఆదాయం వచ్చే అవకాశముంది.

జేపీతో ఎన్నో విషయాల్లో విభేదించేవారయినా సరే, నిజాన్ని నిర్భయంగా ఒప్పుకునేవారు, మంచిని మంచిగా చూసేవారు, కాస్త ఆలోచన ఉన్నవారు మాత్రం 2జీ కేసులో ఆయన చొరవని అభినందించాల్సిందే.

(కొరడా న్యూస్‌డాట్‌కామ్) ❍

### 'గాలి' గనుల కుంభకోణం సమయంలోనే జేపీ చెప్పినా నెగ్గనివ్వలేదు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గాలి జనార్ధనరెడ్డి గనుల కుంభకోణంలో కూడా అప్పుడు శాసనసభ్యుడి (కూకట్‌పల్లి)గా ఉన్న డా॥ జేపీ వేలం పద్ధతి పెట్టాలని వాదించినా ఎవరూ పెద్ద పట్టించుకోలేదు. చర్చంతా కాంగ్రెస్ వారికివ్వాలా, తెదేపా వారికివ్వాలా అనే తప్ప ప్రజలకు ఆదాయాన్ని పెంచే దిశగా ప్రయత్నిద్దామన్న జేపీ వాదనను నెగ్గనివ్వలేదు. గాలి జనార్ధన రెడ్డి గనులను సందర్శించిన అఖిలపక్షం ప్రముఖులు.. అబ్బే, అక్కడ అవినీతేమీ లేదని బ్రేవ్‌మంటూ తేనుస్తూ క్లీన్‌చిట్ కూడా ఇచ్చేశారు. చివరకు 2జీ కేసులో జేపీ వాదన నెగ్గి కేవలం ప్రకృతి వనరుల కేటాయింపులోనే లోక్‌సత్తా వల్ల ఈదేశానికి లక్షల కోట్ల ఆదాయం సమకూరింది.

స్పెక్ట్రం అనే వనరు గురించి చాలామందికి తెలియనందు వల్ల చాలా తేలిగ్గా దోపిడీ చేసేశారు. చివరకు వేలం వేసే సమయంలో కూడా పలు సందేహాలు వ్యక్తమయ్యాయి. వేలం వేస్తే ఇప్పుడొచ్చిన రూ.10వేల కోట్లు కూడా రావేమో అని తమను ఒప్పించటానికి వచ్చిన జేపీతో అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ తదితర పార్టీల నేతలు సందేహాలు వ్యక్తం చేశారు. నష్టం రాదని తనకు నమ్మకముందని, ఒకవేళ వచ్చినా ఇక ముందు దేశంలో ప్రకృతి వనరులు నష్టపోకుండా కాపాడుకోవటానికి ఇది మెరుగైన మార్గం కాబట్టి వచ్చే వేలంపాటల్లో నష్టాన్ని తేలిగ్గా భర్తీ చేసుకోవచ్చని చెప్పి జేపీ వారిని ఒప్పించగలిగారు. ఆ వేలంలో అనేక రెట్లు అధికాదాయం వచ్చింది. అలాగే బొగ్గు గనుల వేలంలో దీర్ఘకాల ఆదాయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లక్షల కోట్లు వచ్చినా కొన్ని అనుబంధ సమస్యలు కొనసాగుతున్నాయి. అక్రమాలు, ఆశ్రితపక్షపాతం, అవినీతికి ఆస్కారం లేకుండా ప్రకృతి వనరుల కేటాయింపునకు ఏర్పడిన వేలం పద్ధతిని కాపాడుకుంటూనే, ఆదాయానికి భంగం రాకుండా ఆ లోపాల్ని సరిచేసుకోవటానికి అదనపు ఏర్పాట్లను చేసుకోవాలని లోక్‌సత్తా సూచించింది.

# స్థానిక దిశానిర్దేశానికి లిటిల్ జేపీలను తయారుచేసుకోవాలి

- ఎ. అన్నపూర్ణ



జనం కోసం జేపీ సురాజ్య ఉద్యమ యాత్ర ఉద్దేశాన్ని ప్రజలు, యువత ఎలా అర్థం చేసుకుంటున్నారో, వారికి ఎలాంటి దిశానిర్దేశం కనిపించిందో ప్రత్యక్షంగా తెలుసుకోవాలనుకున్నాను. కానీ వివిధ కారణాల వల్ల యాత్రలో పాలుపంచుకోవటం కుదరలేదు. జేపీ ప్రసంగించిన ప్రతిచోటా మాలాంటి లోక్‌సత్తా కార్యకర్తలు, ప్రతినిధులు, అభిమానులు ఉండి ఉంటే ప్రజలు, ముఖ్యంగా యువతీయువకుల అభిప్రాయాలు ఎలా ఉన్నాయో వెంటనే తెలుసుకోగలిగేవాళ్లం.. ఇదొక పార్శ్వమైతే, వినూత్నరీతిలోని సురాజ్య యాత్ర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా జనంలోకెళ్లింది. గతంలోలా ఒక ప్రసంగం జరిగిన ప్రాంతంలోనూ, పేపర్లు చదివి, టీవీలు చూసీ జనం స్పందన ఏమేరకు ఉంది అనే దానితోపాటు.. సోషల్ మీడియాలో లైవ్‌గా జేపీ ప్రసంగాల్ని, చర్చల్ని విన్న ప్రజానీకం, కొత్తతరం ఎలా స్పందించారనేది కూడా బేరీజు వేసుకోవాలిప్పుడు. మాబోటివాళ్లం పాత పద్ధతుల్ని కొంత సరిచేసుకోవాలని ఇవన్నీ చెబుతున్నాయి.

సరే, మొత్తమ్మీద తెలుసుకున్నాం. తర్వాత చేయాల్సింది ఏమిటి?

సురాజ్య యాత్ర గురించి స్పష్టత కలిగినవారిలో ఒక ఆలోచనాపరుడు/ఆలోచనాపరురాలు కావాలి. ఇలాంటివారిని గుర్తించాలి. ఆయా ప్రాంతాల్లో లిటిల్ జేపీల్లాగా అంకితభావంతో, కాస్త మేధస్సుతో స్పందించే వ్యక్తిగా వారిని తయారుచేయాలి. ఇది మాలాంటివారి ఆలోచన.

ఇటీవల జనసేనతో పొత్తులు అని గ్రేట్ ఆంధ్రా పత్రిక ద్వారా ఒకరు ప్రకటనలు చేస్తున్నారు. కొన్ని ఊరూ పేరూ తెలియని వీడియోల్లో జనసేన వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్‌కు జేపీ ఆలోచనా దిశానిర్దేశకులవుతారని ప్రచారం సాగుతోంది. ఇవి కొందరి సొంత ఆలోచనలు కావచ్చు. లేదా సలహాలు కూడా కావచ్చు. ఇలా జరిగితే బాగుండును అనే అభిప్రాయం కూడా కావచ్చు. ప్రత్యేకించి లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ చూడకపోయినా, ఎవరోకరు సమాచారం చేరవేస్తారు కదా! వీటిని పరిగణలోకి తీసుకోవాలా వదిలేయాలా అనేది వారి ఇష్టం. ఎన్నికల్లో పాల్గనడం గురించి మర్చిపోదాం. సమస్యల పరిష్కారం కోసం, అవినీతి లేకుండా ఉండే మంచి పరిపాలన కోసం, రాజకీయాల్లో మార్పు కోసం (ఓటుకు నోటు, తాయిలాలు వంటివి పోయి సమర్థులు, నిజాయతీపరులు చట్టసభలకు ఎన్నికయ్యేలా) లోక్‌సత్తా ఉద్యమ సంస్థ పనిచేస్తోంది. సంస్థ స్థాపన జరిగిందే ఇందుకు!

సాధారణంగా సామాజిక సేవ చేయాలనుకున్నవారు మన వద్ద యాభై సంవత్సరాల వయసు దాటినవారే అయిఉంటారు. అప్పుడు కొంత తీరిక లభిస్తుంది వారికి. రాజకీయాలు, సామాజిక సమస్యలు, ప్రయాణ సౌకర్యాలు, రోడ్లు, ప్రభుత్వాల పనితీరు పట్ల అవగాహన, ఉద్యోగం నుంచి వెసులుబాటు వంటివి కలిసి.. దేశం కోసం ఎంతోకొంత ఆలోచిద్దాం అని ప్రేరేపిస్తాయి. స్వతంత్ర పోరాటంలోలా యువతరం పెద్దసంఖ్యలో కదిలివచ్చే పరిస్థితి ఈరోజు లేదు. యువత తమ కెరీర్‌లను, సంపాదనను చూసుకుంటూనే సమాజం గురించి కొంతైనా ఆలోచించేలా ఉండే నమూనా కోసం లోక్‌సత్తా చాలా ఏళ్లుగా కృషి చేస్తోంది. పునాదైతే పడింది కానీ.. ఇంకా రావాల్సినంత మార్పు రాలేదు. సమాజసేవలో భాగస్తులు కావాలనే ఆలోచన కాస్త వయసు పైబడిన తర్వాత వచ్చినవారిలో కూడా పురుషులే ఎక్కువ. కానీ సమాజహితంలో పాలుపంచుకునే అవకాశం మహిళలకు కూడా బాగానే ఉంటుంది. దేశం కోసం చేసే పనుల్లో, సాధించే విజయాల్లో భాగస్వాములైతే వచ్చే ఆత్మసంతృప్తి ఎన్ని పూజలు చేసినా, మందిరాలు, మసీదులు, చర్చిలను సందర్శించినా, ఎంత ఆడంబరంగా, దర్జాగా బతికినా రాదు.

చాలామంది మహిళలకి సమాజం, ఎన్నికల రంగం గురించి అవగాహన ఉండదు. దీంతో వాళ్లు కాలాన్ని వృథా చేస్తారు. నాకు తెలిసినవారిలో కొంత మందిని ఈ మార్గంలోకి తీసుకురాగలిగినా మహిళలకు కొన్ని పరిమితులుంటాయని కూడా అంగీకరించక తప్పదు. మగవారంత స్వేచ్ఛగా స్త్రీలు పాల్గనటం కష్టమవుతుంది. అందరికీ కుటుంబంలో సహకరించేవారు ఉండరు. ఆ పరిమితుల కారణంగా, మనసులో సదుద్దేశం బాగానే ఉన్నా పూర్తిగా దృష్టి పెట్టలేరు. అయినా

కూడా చేసేవారు లోక్‌సత్తా సంస్థలో ఉన్నారు. అవసరం వచ్చినప్పుడు సహకారం అందిస్తారు. ఇది మనకు నిజంగా గర్వకారణం. అనేకసార్లు చెప్పినప్పుడు పొగడ్తలా అనిపించవచ్చు గానీ.. జేపీ దిశానిర్దేశంలోని సంస్థలో లభించే గౌరవంతో ఈ మాటలు మనసులో నుంచి బైటికి వచ్చేస్తాయి. స్వచ్ఛంద సంస్థలు చాలా ఊళ్లలో ఉంటాయి. దేశవ్యాప్తంగా లక్షల్లో ఉంటాయి. అందులోనివారూ కార్యకర్తలుగా పనిచేస్తుండవచ్చు. కానీ లోక్‌సత్తా లాంటి విస్తృత కృషి, బహిరంగ చర్చ ప్రమాణాలు, రాజకీయ సంస్కృతి ఎక్కడా కనిపించవు. మహిళలు, దళితులు, అణగారినవర్గాలు తగినంత సంఖ్యలో ఎన్నిక కాకపోతే.. అందుకోసం వారి జనాభాకు తగ్గట్టు స్థానాలను రిజర్వు చేసిన ఘనత లోక్‌సత్తా పార్టీకే దక్కుతుంది. దేశ రాజకీయాలను భ్రష్టుపట్టిస్తున్న వంశపారంపర్య రాజకీయాలకు భిన్నంగా.. అంతర్గత ప్రజాస్వామ్యంతో పార్టీ పదవులకు రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నికల్ని లోక్‌సత్తా నిర్వహించింది. ఇందుకోసం స్వతంత్ర ప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ ప్రక్రియ కొత్త కావటం, సమాజంలో చైతన్యం పరిమితంగా ఉండటం వల్ల కొన్ని లోపాలు దొర్లినా.. మొత్తమ్మీద రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యానికి లోక్‌సత్తా దేశంలోనే ఒక ఒరవడిని దిద్దింది. లోక్‌సత్తా నా సొంతం కాదు, ఇది ప్రజల ఆస్తి అని జేపీ పలుమార్లు ప్రకటించారు. ఇంత ప్రాధాన్యతనివ్వటం వల్లే రాజకీయ నేపథ్యం లేని కుటుంబాల నుంచి కూడా చదువుకున్న మహిళలు లోక్‌సత్తాలో వీలున్నంతమేర పనిచేస్తున్నారు.

సురాజ్య ఉద్యమ యాత్ర ద్వారా కొన్ని భావాలను అందుకున్న యువతను, ఇతర వర్గాల ప్రజలను థాట్ లీడర్లుగా, సమాజహితవాదులుగా తీర్చిదిద్దే, స్థానికంగా లిటిల్ జేపీలను తయారుచేసే బాధ్యతలను కాస్త వనరులు కలిగి, సమాజం కోసం ఎక్కువ సమయం కేటాయించగలిగే లోక్‌సత్తా సీనియర్లు తీసుకోవాలి. పురుషులు, మహిళలు కూడా! యువతలో ఆలోచనలను కలిగించటం, పరిష్కారశక్తిని పెంచటం, భవిష్యత్‌ను తీర్చుదిద్దుకోవడానికి మెళకువలను అందించటం, స్థానికంగా కార్యకలాపాలను సమన్వయం చేసుకునేలా చేయటం, ఎన్నికల్లో మంచి నాయకులను ఎన్నుకునేలా చేయటం వంటివన్నీ సురాజ్య యాత్ర అందించిన బాధ్యతగా సీనియర్లు చేయాలి.

సురాజ్య యాత్ర ఆంధ్రప్రదేశ్‌లో పూర్తయింది. సమీక్ష తర్వాత తెలంగాణలోనూ జరుగుతుంది. ఇక్కడి పరిస్థితులపై ఈలోగా లోక్‌సత్తా నేతలు లోతైన అధ్యయనం చేసి జేపీకి అందించాలి.

ఇంజినీరింగ్‌లో నాణ్యత పెంపునకు కృషి చేస్తాం.. అంటూ తెలంగాణ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి చెప్పారని ఆమధ్య వార్తాపత్రికలో చదివితే విచిత్రంగా అనిపించింది. ఆ చదువులో నాణ్యతకు కావలసింది మంచి ప్రొఫెసర్లు, మెరుగైన క్వాలిఫికేషన్లు ఉన్నవారు. కానీ అలాంటివారు పలు కళాశాలల్లో పనిచేయటానికి విముఖంగా ఉన్నారు. అంత మేధస్సు, నైపుణ్యం ఉన్నవారిని అధ్యాపక వృత్తిలోకి ఆకర్షించేలా ప్రభుత్వాలు వ్యవహరించలేకపోతున్నాయి. పైకి మాత్రం విద్య పట్ల ఎంతో ప్రేమను, గౌరవాన్ని ఒలకబోస్తుంటాయి. మరోవైపు ఇంజినీరింగ్‌లో చక్కగా రాణించాలంటే.. పాఠశాల స్థాయి నుంచి అందుకు పునాది పడాలి. కానీ అధ్వాన్న స్కూలు విద్యలో ఏపీతో తెలంగాణ బ్రహ్మాండంగా పోటీపడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని పలుచోట్ల ఈ అంశాల్ని జేపీ సాధికారికంగా బైటపెట్టారు.

ఏపీలో ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీల విద్యార్థులతో జరిగిన ఇంటరాక్షన్‌లో జేపీ అడిగిన ప్రశ్నలకు వారిచ్చిన జవాబులు చూస్తే ఎంతో బాధ, వారి పట్ల సానుభూతి కలుగుతాయి. తప్పువారిదా? కాదు (మనలో మన మాట, ప్రొఫెసర్లను ప్రశ్నించి ఉంటే?). లోపం గురించి కొంతైనా లోతుగా ఆలోచించాలి. ఏదోలా చదువు పూర్తి చేశాం అనుకుంటే పొరపాటు. రాబోయే కాలంలో 70శాతం ఉద్యోగాలు ఎలా ఉంటాయో కూడా తెలీని పరిస్థితి. ఇప్పుడు ఉద్యోగాలు చేసేవారికీ గ్యారంటీ లేదు. అలాంటి పరిస్థితుల్లో.. కాలేజీ నుంచి పట్టుమని పదిమంది కూడా ఉన్నత ప్రమాణాలున్నవారు తయారుకాకపోతే రేపు దేశం ఏమైపోతుంది? ప్రపంచ చరిత్రలో కనీవినీ ఎరుగనంత సంఖ్యలో ఏడాదికి 1కోటీ 30లక్షల మంది కొత్తగా మనదేశంలో ఉపాధి కోసం వస్తున్నారు. మన నాయకులకు ఎన్నికల్లో గెలుపు తప్ప మరేమీ పట్టటం లేదు. ఈ పరిస్థితుల్లో సురాజ్య యాత్ర ద్వారా గొప్ప రాజకీయ సంభాషణను జేపీ జనంలోకి తీసుకెళ్లేందుకు అన్ని మార్గాలు, మాధ్యమాల ద్వారా ప్రయత్నిస్తున్నారు. ఇదేదో స్థానిక సమస్యల పరిష్కార యాత్ర కాదు. అందుకోసమైతే కార్యక్రమాలు వేరే రకంగా ఉండేవి. ఇది ప్రజల మౌలిక సమస్యల పరిష్కారాన్ని వారి భాగస్వామ్యంతో సాధించటంతోపాటు ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేసే మహాప్రయత్నం. భవిష్యత్ ప్రజాస్వామ్య సంస్కరణలకు పునాది ఇది.

విద్యార్థులు, యువతకు ఇంట్లోనే నాలుగు మంచి మాటలు చెప్పేవారు లేరు. కానీ వారి కోసం జేపీ ఎంతో ఆలోచించి నోట్స్ తయారుచేసుకుని పరిమిత వనరుల్లోనే కష్టపడుతూ సురాజ్య యాత్ర చర్చల్ని నిర్వహిస్తున్నారు. ఈ కృషిని సద్వినియోగం చేసుకోవాలి. నేను ట్విట్టర్. ఫేస్‌బుక్, యూట్యూబ్ చూస్తున్నాను. చాలామంది స్పందిస్తున్నారు. సురాజ్య వీడియోలపై లోతుగా మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నారు. జేపీ ప్రసంగాల్ని, చర్చల్ని ఇష్టపడితే చాలదు.. అర్థం చేసుకోవాలి, స్థానికంగా భాగస్వాములు కావాలి. వీటన్నిటితోపాటు ఇతరులకూ షేర్ చేయాలి. యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్ వెబ్ ప్లాట్‌ఫారాలలో నమోదై యువత, ఇతర ప్రజలు చేసే కృషికి మాలాంటివారమంతా పూర్తి సహాయసహకారాలను అందిస్తాం. ❍

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

➤ తమ హక్కు అయిన పట్టా పాసుబుక్కుల కోసం లంచం ఇవ్వలేని చిన్న చిన్న రైతుకుటుంబాల వారు రోజుల తరబడి - చిన్న రెవెన్యూ ఉద్యోగుల 'లంచం రాయితీ'ల కోసం ఎం.ఆర్.వో ఆఫీసుల దగ్గర చెట్ల కింద వంటలు చేసుకుంటూ బతకడం నేను స్వయంగా చూశాను. కిందిస్థాయిలో మూగగా దోపిడీకి గురవుతున్న జనానికి ఆ అవినీతిపరుల నుంచి విముక్తి లభించనంత వరకు నోట్ల రద్దు జరిగినా, పట్టిసీమ, పోలవరం నీళ్లు తోడినా ప్రజలు సంతోషించరు. దేశంలో సంస్కరణలకు కంకణం కట్టుకున్న మోదీగారికి వారి అనుచరులు చెప్పాలి. తమరు చేస్తున్న సంస్కరణలు- రోజూ పట్టెడు కూడుకు యాతన పడేవారికి అర్థం కావు. వారిని అనుక్షణం దోచుకుంటున్న గణేష్‌లు, ఆజాద్‌లు (లంచగొండి ఉద్యోగులు) బారి నుంచి కాపాడండి. అప్పుడు వ్యవస్థ మీద విశ్వాసం పెరుగుతుంది.

- గొల్లపూడి మారుతీరావు, రచయిత, సినీనటులు

➤ రకరకాల ఆరోగ్యపరమైన సమస్యలతో అప్పులపాలై చితికిపోయిన కుటుంబాలు ప్రతిరోజూ పాదయాత్రలో తారసపడుతున్నాయి.

- వైఎస్ జగన్, వైకాపా అధ్యక్షుడు

➤ పేదరికం ప్రజల స్వయంకృతం కాదు. బలవంతంగా, వ్యవస్థ ద్వారా వచ్చింది. ఆ పేదరికం నుంచి బైటపడాలనే ప్రజలు కోరుకుంటారు. వారికి అండగా ఉండి ఎదిగే అవకాశాలనిచ్చేందుకు కొత్త ఆర్థిక విధానాలు, ఆలోచనలు కావాలి.

- మహ్మద్ యూనస్, బంగ్లాదేశ్ గ్రామీణ బ్యాంక్ వ్యవస్థాపకుడు, నోబెల్ గ్రహీత

➤ భారతదేశంలో సంపదసృష్టి జరుగుతున్నప్పటికీ అది ఎక్కువగా రాజకీయనేతల పరిధిలో ఉండిపోతోంది. ఇదొక్కటే సమస్య కాదు. ఇక్కడివారికి నైపుణ్యాలు, సామర్థ్యాలు తక్కువగా ఉంటున్నాయి. వ్యవసాయంలో ఆదాయం పడిపోతూ గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అంతరం పెరిగిపోతోంది. ఇలాంటి సమస్యలకు కార్పొరేట్ పరిష్కారం సరిపోదు. ఈ పరిస్థితి నుంచి మెరుగుపడాలంటే నిర్లక్ష్యానికి గురైన.. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన చేయటం వంటివి పెద్దఎత్తున జరగాలి. సంపదను అందరికీ సమానంగా పంచడం కాదు.. అవకాశాలను అందరికీ సమానంగా అందించడమే ప్రధానం. నిర్లక్ష్యానికి గురైన విద్య, వైద్య సేవలు అందరికీ అందించినప్పుడే ఆర్థిక తారతమ్యాలు తగ్గుతాయి. సహకార విధానమనేది భారత్‌లో ఎప్పటి నుంచో కొనసాగుతున్న మంచి విధానం. మళ్లీ అటువైపు మళ్లాల్సిన అవసరం ఉంది. గతంలో హైదరాబాద్ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందింది. ఇప్పుడు నవ్యాంధ్రలో కూడా రాజధానిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తున్నారు. రాజధాని వృద్ధితో నేరుగా వ్యవసాయదారులకు ప్రయోజనం కలగదు. వనరుల వినియోగంపై పన్నులు వేయటం కాకుండా ప్రజలను ఉత్పాదకులుగా మలచాలి. ఆ పని చేయకుండా అనుసరించే విధానాలు అసమగ్రంగా, అసమతుల్యంగా ఉంటున్నాయి.

- ఆచార్య సంజయ్ రెడ్డి, న్యూస్కూల్ ఆఫ్ సోషల్ రీసెర్చి, న్యూయార్క్

➤ దేశంలో సాధారణ పౌరులకు ఏ రంగంలోనూ అవకాశాలు లభించడం లేదు. రాజకీయాలు, సినిమాలు, క్రికెట్, వ్యాపారం- ఇలా అన్నిచోట్లా వారసత్వమే రాజ్యమేలుతోంది. నా ఇంటి పేరు గాంధీ కాకపోయి ఉంటే 29 ఏళ్లకే నేను ఎంపీని అయ్యేవాడినా?

- వరుణ్‌గాంధీ, బీజేపీ ఎంపీ

➤ నోట్ల రద్దుకు పూర్వం చలామణిలో ఉన్న నగదులో కనీసం యాభై శాతం 'నల్ల' ధనమేనని చెప్పవచ్చు. నోట్ల రద్దు పుణ్యమా అని ఆ నల్లధనంలో చాలా భాగం తెల్ల (చట్టబద్ధమైన) ధనం అయింది. పన్నుల వసూళ్లు తాత్కాలికంగా పెరగడానికి నోట్ల రద్దు ఇలా తోడ్పడింది. అయితే చిన్న వ్యాపార సంస్థలపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపింది. ఇది సుదీర్ఘకాలం కొనసాగే అవకాశముంది.

- భరత్ ఝున్‌ఝున్‌వాలా, ఆర్థికవేత్త

➤ లేబర్ బ్యూరో తాజా నివేదిక ప్రకారం వ్యవసాయ రంగంలో 8.46 మిలియన్ ఉద్యోగాలు తగ్గాయి. తయారీ, విద్యుత్ ఉత్పాదన, నిర్మాణ రంగంలో కూడా 2.81 మిలియన్ ఉద్యోగాలు తగ్గాయి. సేవారంగంలో కొత్తగా 6.65 మిలియన్ ఉద్యోగాలు వచ్చినా, తగ్గింది మొత్తం మీద 11.27 మిలియన్లు అని గుర్తించాలి. నిరుద్యోగం నుంచి బైటపడటం ఇప్పుడున్న సవాలు. అత్యధికం ఆధారపడిన వ్యవసాయ రంగం ద్వారా ఉపాధి లభించాలి.

-మాంటెక్‌సింగ్ అహ్లువాలియా, ప్రణాళికా సంఘం మాజీ అధ్యక్షుడు

➤ **ఉపాధి కల్పన మెరుగుపడాలంటే నూతన ఉత్పత్తులతో మన ఎగుమతుల సరళి మారాలి. మనదేశ జీడీపీలో 60శాతం వాటా సేవల రంగం ద్వారా సమకూరుతుండగా అందులో ఉపాధి కల్పన 30శాతానికే పరిమితమైంది. సేవల రంగం నుంచి 80శాతం ఆదాయం వస్తున్న పశ్చిమ దేశాల్లో ఉపాధి కల్పన కూడా 80శాతం ఉంది.**

**- ప్రొఫెసర్ అజిత్‌ఘోష్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్**

➤ బ్రిటీషు పాలనలో ఇతరత్రా విషయాలు ఎలా ఉన్నా, ప్రజలు ఆనందంగా, సంతృప్తిగానే బతికారు. ఈరోజుల్లోలా అప్పట్లో దోపిడీలు, గొలుసులు లాక్కెళ్లటాలు లేవు. తన నగలన్నిటినీ ధరించి ఒక మహిళ బంబాయి నుంచి పంజాబ్‌కు ఒంటరిగా ప్రయాణించగలిగేది. ఆమెను వేధించే, నగలు లాక్కునే సాహసాన్ని బ్రిటీషు కాలంలో ఎవరూ చేసేవారు కాదు.

– కేవల్ క్రిషన్ (104), రాజ్యాంగ సభ సభ్యుడు

➤ 'డబ్బు' ఇప్పుడు భారతదేశంలో కొత్త కులం! డబ్బుంటే కులంతో సంబంధం లేకుండా వివాహం చేసుకోవడానికి ఆసక్తి చూపేవారి సంఖ్య పెరుగుతోంది. తమ హోదాను పెంచుకోవడానికి అణగారిన కులం వారు, తమ ఆర్థికస్థాయిని పెంచుకోవడానికి అగ్రకులాల విభాగంలో ఉన్నవారు.. డబ్బు చుట్టూ వివాహాలు చేసుకుంటున్నారు. ఇలా కులాంతర వివాహాలు పెరిగినప్పటికీ కులాన్ని నిర్మూలించడం భారత్‌లో అంత తేలిక కాదు. అమెరికాలో వర్ణాంతర వివాహాలు ఇప్పటికీ 6.7శాతమే. అలాంటిది వివక్ష, అసమానతలు, హింస, అధ్వాన్న పాలనలో వేళ్లూనుకుని ఉన్న కులాన్ని తొలగించడానికి భారత్ ఇంకా ఎన్నో తరాలు ప్రయాణించాల్సి ఉంది. సొంత కులంలోనే సంబంధాలు కుదుర్చుకోవాలనుకునేవారు పట్టణ భారత్‌లో కూడా ఇంకా పెద్దసంఖ్యలోనే ఉన్నారు.

- ప్రొఫెసర్ అమిత్ ఆహుజా, రాజనీతి విభాగం, కాలిఫోర్నియా-శాంటా బార్బరా విశ్వవిద్యాలయం

(కర్టెసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, ది హిందూ, సోషల్ మీడియా) ❍



# ఎందరినో కదిలిస్తున్నది ఆరాటం.. ఒక్కడిలోనే కనిపిస్తున్నది పోరాటం

- సాంబశివరావు పెరవలి

ఎందరిలోనో కదిలిస్తున్నది ఆరాటం
ఒక్కడిలోనే కనిపిస్తున్నది పోరాటం
ఒకటే ధ్యేయం ఒకటే లక్ష్యం
మారాలీ ఈ దోపిడిరాజ్యం

॥ ఎంద ॥

గుండె లోతులో ఉన్నది ఆర్తి
పలుకకూడదు ఎన్నడూ సమాప్తి

జేపీ మన దిక్సూచి అయినాడురా
నీ విజ్ఞతతో ఇక నావ నడుపర

గాంధీజీ కలలుగన్న ఆ స్వరాజ్యం
స్వార్థపరుల చేతిలో నేడు స్వాహారాజ్యం

అందుకే అడుగు ముందుకేసి నిలువూ
అప్పుడు సురాజ్యం నీకు అవుతుంది సులువు

॥ ఎంద ॥

మంచివారితో చెయ్యరా దోస్తి
పట్టకూడదు దుష్టులతో నీవు కుస్తి

జేపీ మంచి మార్గం అక్షరదీపంతో అందించాడురా
నీ విశ్లేషణతో కొత్తబాట పట్టర

బ్రాందీకే విలువలన్న ఈ దుష్టరాజ్యం
సొంతలాభపనుల మోజులో చిక్కిన మహాభోజ్యం

అందుకే పన్నుడబ్బుతో పనులను నిగ్గదీసి అడుగూ
అప్పుడే సురాజ్యం నీకు చూయిస్తుంది వెలుగు

॥ ఎంద ॥

# రోడ్డు ప్రమాదాలు లేని సంవత్సరం కావాలి



రోడ్డు ప్రమాదాలు లేని 2018 సంవత్సరం కావాలని లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దోసపాటి రాము అన్నారు. 2017లో హైదరాబాద్ ఉప్పల్ చిలుకానగర్‌లో పాలకుల వైఫల్యం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో భూమిక (8) ప్రాణాలను కోల్పోయి వారి కుటుంబంలో విషాదం నింపిందన్నారు. 'అయామ్ నాట్ ఇడియట్..... ఐ ఫాలో ట్రాఫిక్ రూల్స్' ఎన్జీవో సంస్థ తరపున నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తాము చేస్తున్న కృషిలో చిన్నారి భూమిక కూడా పాలుపంచుకుందన్నారు. అంబర్‌పేటలో జరిగిన కార్యక్రమంలో నివాళులర్పించారు. రోడ్లను బాగుచేయటంతోపాటు పాఠశాల వేళల్లో భారీ వాహనాలు తిరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. లోక్‌సత్తా తరపున ట్రాఫిక్ నియమాలపై ప్రచారం నిర్వహిస్తామన్నారు.

# అందరికీ నాణ్యమైన విద్యను అందించటమే సావిత్రీబాయికి నివాళి

కుల, లింగ వివక్షలను అధిగమించటానికి విద్యను మించిన మార్గం లేదని సావిత్రీబాయి పూలే చాటారని, ఇప్పటికీ మన పాలకులకు ఈ జ్ఞానం అబ్బలేదని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. భర్త జోతిబా పూలే ప్రోత్సాహంతో ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రీబాయి ఎదిగారన్నారు. విజయనగరంలో నిర్వహించిన సావిత్రీబాయి జన్మదినోత్సవ కార్యక్రమంలో బాబ్జీ పాల్గొన్నారు. ఎలయన్స్ వైస్ గవర్నర్ సముద్రాల గురుప్రసాద్, అధ్యక్షుడు పెన్మెంటి సూర్యనారాయణ, మహిళా క్లబ్ అధ్యక్షురాలు సుభద్రాదేవి, తెలుగునాడు డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షురాలు విమలారాణి, శుభకర సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు పులిపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.



# కేంద్రీకృత పాలన వద్దు - స్థానిక స్వయంపాలన కావాలి



దేశంలో, రాష్ట్రంలో పాలన కేంద్రీకృతమై ఉందని, దీన్ని వికేంద్రీకరించి స్థానికంగా ప్రజల చేతుల్లోకి తేవాలని మహిళాసత్తా విజయనగరం జిల్లా అధ్యక్షురాలు ఇనగంటి అనంతలక్ష్మి అన్నారు. జయప్రకాష్ నారాయణ్ రాష్ట్రంలో చేసిన సురాజ్య యాత్ర ఆరు లక్ష్యాల గురించి వివరించే చర్చాపత్రాన్ని విడుదల చేశారు. ఈ లక్ష్యాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్ళి ఆలోచనను పెంచటం, కార్యాచరణలో భాగస్వాముల్ని చేయటం తమ లక్ష్యమన్నారు. లోక్‌సత్తా పార్టీ నేతలు అల్లంశెట్టి నారాయణ, ముల్లేటి చిన్నారావు టి. రాజారావు, టి.కోటి, శిమ్మశ్రీను, పి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

Posting Date 22-01-2018
RNI.Reg. No. APTEL/2010/32219   Postal Reg. No. HD/1126/2016-18   Published on January 16th 2018



# సురాజ్య లక్ష్యాలు

1) ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పౌర సేవలు
2) పాఠశాల విద్య - ప్రతి బిడ్డకి ఖర్చు లేకుండా మంచి ప్రమాణాల విద్య
3) ఆరోగ్య రంగం - ప్రతి కుటుంబానికి ఖర్చు లేకుండా అన్ని స్థాయిలలో మంచి ఆరోగ్యం
4) స్థానిక ప్రభుత్వాలకు పన్నుల్లో వాటా
5) చట్టబద్ధ పాలన - మహిళల రక్షణ
6) పంటల ధరల సంక్షోభం - లాభసాటి వ్యవసాయం

Join & Participate: www.youthforbetterindia.com, www.citizensforbetterindia.com

| Book-Post<br>PRINTED MATTER | To |
| --- | --- |
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad